భారతి

మే 1968

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒక రూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

Recd 24/5/68

ఆంధ్ర సాహిత్య పరిషత్తు ★ గ్రంథాలయం ★ TELUGU ACADEMY, COCANADA

మే 1968

★

సంపుటము: 45 : సంచిక : 5 :

విడిప్రతిక వెల ఒక రూపాయి

వి ష యా ను క్ర మ ణి క

మే 1968



చంద్రునకు నూలుపోగన్న చందమునను
శతజయంత్యుత్సవమ్ముగ నల్పు నాంధ్ర
జనుల దివినుండి దీవింపు, జాతికెపుడు
వెలుగు నిడుగాత నీ యూత విశ్వదాత.

—డా॥ దివాకర్ల. వేంకటావధాని.

ప్రస్తావన

[దేశోద్ధారక, విశ్వదాత, కళాప్రపూర్ణ శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలలో వ్రాసిన ప్రస్తావనలు, భారతిలో వ్రాసిన స్వవిషయ సాభిప్రాయవిశేషములు వివిధవిషయ సంభరితాలై పాఠకులను విజ్ఞానవంతులుగాను, ఆలోచనా పరాయణులుగాను చేస్తాయి. 1930, 1933—ప్రమోదూత, శ్రీముఖ ఉగాది సంచికల ప్రస్తావనలలోని కొన్ని భాగాలను, ఆ ప్రస్తావనలు ఎలావుండేవో పాఠకులకు తెలియడానికి శ్రీ పంతులుగారి శతజయంతి సందర్భంగా ఇక్కడ ప్రచురిస్తున్నాము.]

శ్లో. ఓన్నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైక మూర్తయే:
నిర్మలాయ ప్రశాన్తాయ దక్షిణామూర్తయే నమః.

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని యాజ్ఞకనుసరణీయముగ ప్రవర్తమానంబగుచున్న విశ్వప్రవృత్తియందొకయేడు గడచినది. దిక్కాలబద్ధమైన విశ్వప్రవృత్తియందు దిక్కాలప్రభావము గణనీయమైనను దిక్కాలాతీతుడైన విశ్వేశ్వరునియందు దిక్కాలప్రభావము నిరవధికముగ నున్నది. అనంతమైనకాలము అఖండమైన విశ్వము విశ్వేశ్వరుని లీలావిలాసములను ఖండాఖండరూపములను ప్రత్యక్షము చేయుచున్నవి. అనంతమైన కాలచక్రమునందొక సంవత్సర ప్రవృత్తి అతిస్వల్పమైనను వ్యక్తి విషయములందు విశేషముగ గనుపట్టుచున్నది. పిపీలికాది బ్రహ్మపర్యంతము వ్యాప్తమైన ప్రవృత్తి యంతయును జననమరణములకు లోనగుచు కాలప్రభావమును పరిమితము చేయుచున్నది. జననమరణావృతమైన సంసార ప్రవృత్తియందు పరమాణువును పరబ్రహ్మమువలెను పరమానందము ననుభవించుచు జీవయాత్రను జేయుచున్నది. అవ్యక్త మహంకారావృతమై వ్యక్తిరూపమును దాల్చుచు కాలప్రవాహమునకు బద్ధమగుచున్నది. వ్యక్త్యహంకారము జననమునకు మూలమై మమకారావృతమై దిక్కాలపరిమిత మగుచున్నది. నేను నాది యను సంకల్పముతో దిక్కాలసంస్మరణము గలుగుచున్నది. నేను అనంతమైన కాలమునకును, అఖండమైన విశ్వమునకును కర్తృత్వభోక్తృత్వాభిమానములను గలిగి దిక్కాలబద్ధ మగుచున్నది. నిర్వికల్పమైన నేను సవికల్పమై దేశకాలపాత్ర రూపమున మహాప్రవృత్తియందు వ్యవహరించుచున్నది. అహంకార మమకారావృతమైన నేను దిక్కాలముల నాశ్రయించి విశ్వప్రవృత్తిని వెలయించుచున్నది. పరబ్రహ్మమువలె పరమాణువును విశ్వభోక్తృత్వము నభిలషించుచు స్వయంవ్యక్తిత్వమును గోరుచున్నది. స్వయంవ్యక్తిత్వము సిద్ధించుటకై దేశకాలములను సంకీర్తనము చేయుట పరిపాటియైనది. సంవత్సరారంభమున పంచాంగశ్రవణ విహా మహాఫలమును నను కూర్చుటకు వినియోగపడుచున్నది.

ప్రమోదూత సంవత్సరారంభమున మహాకాలసంస్మరణమును జేయుట ఆత్మోపలబ్ధికి సాధనము కాగలదు. ప్రమోదూత సంవత్సరముతో శాలివాహన శకాబ్దములు 1852, విక్రమార్క శకాబ్దములు 1984, క్రైస్తవ శకాబ్దములు 1929, ఫసలీ శకాబ్దములు 1338, భరత శకాబ్దములు 5074 గతించినవి. వైవస్వతమన్వంతరమునందు, కలియుగమునందు ప్రథమ పాదమునందు 5031 సంవత్సరములు ముగిసినవి. కలియుగారంభమునుండియు 83 పరివృత్తులు ముగిసి 84 వ పరివృత్తియందు నాల్గవసంవత్సరమైన ప్రమోదూత సంవత్సరము ప్రారంభమైనది. సృష్ట్యాదినుండియును 1,95,58,85,031 సంవ

త్సరములు గతించినవి. అద్య బ్రహ్మకల్పమునందు ద్వితీయ పరార్థమునందు పగటియందు 13 గడియలు 43 విగడియలు గతించినవి. అనంతమైన కాలచక్రమునందు సంవత్సర వృత్తాంతము అతిస్వల్పము. కాని కాలబద్ధమైన మహాప్రవృత్తియందు నూతన సంవత్సరారంభము నూతన సంకల్పములకు సాధన మగుచున్నది. ప్రమోదూత సంవత్సరారంభమునందు ప్రజలు నూతన సంకల్పములను గలిగి కాలసంకీర్తనమును జేసి కామితార్థములను బడయుదురుగాక!

దేశసంస్మరణము

అనంతమైన కాలసంస్మరణమువలె నఖండమైన దేశసంకీర్తనమును నిత్యానిత్యవివేకమునకు సాధనంబుగ నున్నది. కాలమువలె దేశమును ననంతముగ గనుపట్టినను పరిమితముగ నున్నది. అంతవంతములైన దేశకాలము లన్యోన్యాశ్రయములై అవ్యక్తము నాశ్రయించియున్నవి. అఖండమైన ఖగోళమవ్యక్తప్రభావమును స్ఫురింపజేయుచున్నది. గణకులు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులు, ప్రకృతి శాస్త్రజ్ఞులు, తత్త్వశాస్త్రజ్ఞులు దేశకాలనిర్ణయమును చేయజాలకున్నారు. విశ్వపరిమాణమును కాలము నిర్ణయింపజాలకున్నది. కాంతికిరణము క్షణమునకు 1,86,000 మైళ్ల చొప్పునను ప్రసరించుచు చంద్రమండలమునుండి భూమండలమున $1\frac{1}{2}$ క్షణములో చేరుచున్నది. కాంతికిరణము ఖగోళమునందలి దూరతమమైన గోళమునుండి భూగోళము చేరుటకు 10,00,00,000 కాంతిసంవత్సరములు గావలయునని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు నిర్ణయించుచున్నారు.

తారాగణమునందు పెక్కుతరగతుల నక్షత్రములు గలవు. వానియందు కనుల కగపడునవి 10,000 కలవు. విశ్వమునందు 50,00,00,00,000 తారాగణములు గలవని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు నిర్ణయించుచున్నారు. తారామండలము వివిధములయిన ఆదిత్యమండలములతో నిండియున్నది. తారామండల విష్కంభము 3,00,000 కాంతిసంవత్సరములుగా షాప్లేగారు నిర్ణయించిరి. తారాగణమంతయును విశ్వమయమై వెలయుచున్నది. ఆకాశగంగామార్గమున విశ్వము లన్నియు నియతమార్గమున సంచారము చేయుచున్నవి. ద్వాదశరాసులందును విశ్వములు, గ్రహములు, నక్షత్రములు, నియతప్రమాణమున సంచారము చేయుచున్నవి. ఆకాశగంగయందు కొన్నిప్రాంతములు ప్రకాశమయముగను, కొన్నిప్రాంతములు ప్రకాశహీనముగను గనుపట్టుచున్నవి. ధనూరాశియందు ప్రకాశము విశేషముగ గోచరంబగుచు, తారాగణసముదాయమును వ్యక్తము చేయుచున్నది. ప్రతిముఖమునందు గల చీకటికోణములు తారాగణరాహిత్యమును విశదముచేయుచున్నవి. ఆకాశగంగామార్గమునందు కాంతిప్రవాహము ప్రతిక్షణమునందును శుక్లపటలములను, తారలను, ధూమకేతువులను సృష్టిలయములను జేయునటు లూహింపదగియున్నది. ఆకాశగంగామార్గము విశ్వముల కంతకును ప్రాణాధారముగ వెలయుచున్నది. ఆకాశగంగామార్గమునందు దూరముగానున్న నక్షత్రములు సూర్యగోళమున కనేకలక్షల రెట్లు పెద్దవిగా నున్నట్లు పరిగణింపబడుచున్నవి. కొన్ని తారాగణములనుండి కాంతికిరణము భూమండలమునకు ప్రసరించుటకు 600,000,00,00,000 కాంతిసంవత్సరములు పట్టుచున్నవి. నక్షత్రములు స్వయంప్రకాశము గలిగి పదార్థనిర్మాణమునందు భూగోళమునకు భిన్నముగా నున్నవి. తారాగర్భము భాస్వరకాంతిమయమై యొప్పుచున్నది. తారానిర్మాణమును, తారాసంచారమును, తారావిశ్వమును నిర్ణయించుటకు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చేయుచున్న పరిశ్రమ దినదినాభివృద్ధి పొందుచున్నది. తారాగణపరిజ్ఞానము పరిమితముగా నున్నను సూర్యమండల పరిజ్ఞానము కొంతవరకు వికాసమును పొందినది.

సూర్యమండలము

సూర్యుడు రూపమునందును, నిర్మాణమునందును, ఆకాశవ్యాప్తములైన కోట్ల నక్షత్రములలో నొక నక్షత్రముగా నున్నాడు. సూర్యమండలము పెద్దవైన నవగ్రహములతోను, కొన్ని చిన్నగ్రహములతోను, నక్షత్రములతోను, ధూమకేతువులతోను, నావృతమై వెలయుచున్నది. సూర్యగోళము భూగోళముకన్నను 3,33,432 రెట్లు పెద్దదై 8,64,000 మైళ్ల విష్కంభమును కలిగియున్నది. రవిమండలము నాశ్రయించి బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు, శని, నెప్ట్యూను, యురేనస్, భూమి, మొదలగు

గ్రహములు సంచారము చేయుచున్నవి. భూగోళము వాశ్రయించి చంద్రగోళము సంచారము చేయుచున్నది. గ్రహముల నిర్మాణము, సంచారము, తత్త్వము, జ్యోతిశ్శాస్త్రజ్ఞులు నిర్ణయించియున్నారు. సకల గ్రహములయందును, జీవజాలములు నివసించుచున్నటుల మహర్షులు నిర్ణయించిన విషయము భారత విజ్ఞానము విశదీకరించుచున్నది. కుజగోళమునందు నివసించుచున్న ప్రజలతో మాటలాడుటకు మానవులు ప్రయత్నించుచున్నారు. ముక్తులు సూర్యమండల వాసమును గైకొనియెదరని భారతీయ విజ్ఞానము దెలుపుచున్నది. ఖగోళమునందు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు నూతన గ్రహములను గనుగొనుచున్నారు. అమెరికాలోని లోవెలు జ్యోతిరాలయమునుండి నూతన గ్రహమును ధూమకేతువును కనిపెట్టినటుల హార్లిషేప్లిగారు తెలుపుచున్నారు. ఈ గ్రహము నెప్ట్యూను గ్రహమున కావలనున్నది. భూమండలము కన్న చిన్నదిగ నున్నది.

భూమండలము

దూరస్థమైన ఖగోళపరిజ్ఞానము దుర్గ్రాహ్యముగ నున్నను నికటస్థమైన భూగోళ పరిజ్ఞానము సమాహితముగ నున్నది. భూగోళ ధ్రువ విష్కంభము 79,000 మైళ్ళు. విరక్ష విక్షేపము 7,928 మైళ్ళు. పృథివి జలమునకయిదు రెట్లు ఘనత్వమును గలిగియున్నది. భూమి క్షణమునకు 18½ మైళ్ళ ప్రమాణమున భూకక్ష్యయందు సంచారము చేయుచున్నది. భూమి మృగశిర కాలమునందు మందగమనమును, సంక్రాంతి కాలమునందు శీఘ్రగమనమును చేయుచున్నది. భూగోళము 23 గంటలు 56 నిమిషముల కాలమునందు అక్షపరివర్తనము చేయుచున్నది. భూగర్భము అగ్నిమయమై లోహాదులను నిర్మించుచున్నది. భూగోళము 30,00,00,00,000 ఏండ్లకు పూర్వము సృష్టియైనటుల్ల శాస్త్రజ్ఞులు నిర్ణయించుచున్నారు. భూగోళము సూర్యమండలమునకు 9,20,00,000 మైళ్ల దూరమున నున్నది. భూగోళ విస్తీర్ణము 19,05,50,000 చదరపు మైళ్లు. అందు 5,55,00,000 చదరపు మైళ్లు జలభాగము. భూవిస్తీర్ణమునందు బ్రిటిషు సామ్రాజ్య విస్తీర్ణము 1,42,20,000 చదరపు మైళ్లు. బ్రిటిషు సామ్రాజ్యమందు భరతఖండము 1,80,53,32 చదరపుమైళ్ల విస్తీర్ణము గలిగియున్నది. విశ్వమునందు పరమాణువుగనున్న భూమండలములో దేశాధిపత్యమునకై ప్రవర్తమానము లగుచున్న సంగ్రామములు, దురాలోచనలు, దుష్కార్యములు పరమవిషాదమును గలుగజేయుచున్నవి.

భూగోళమునందు 1920 జనాభాలెక్కల ప్రకారము 1,84,95,00,000 జనులు గలరు. వారియందు 45,00,94,300 ప్రజలు బ్రిటిషు సామ్రాజ్యమునందును, 31,89,42,480 ప్రజలు భరతవర్షమునందును నివసించుచున్నారు. బ్రిటిషు సామ్రాజ్య ప్రజలలోని రెండు వంతులు ప్రజలు భరతఖండమునందు కలరు.

అనంతమైన కాలమును అనంతమైన దేశమును సంస్మరించునపుడు స్వస్థల స్వకాలములు జిజ్ఞాసువులకు పరమాణువులుగ గనుపట్టుచున్నవి. విశ్వప్రవృత్తి మానవులందు ప్రాజ్ఞులకు వారి యల్పత్వ మహత్వములను స్ఫురింపజేయుచున్నది. అనంతమైన కాలమును, అఖండమైన విశ్వమును సంభావించుటకు మానవుల కఖండమైన శక్తి గలదు. ఆ శక్తిని విశ్వప్రవృత్తియందాత్మోద్ధరణమునకు వినియోగించుట సుఖమునకును, ఆత్మనాశమునకు వినియోగించుట దుఃఖమునకును గారణం బగుచున్నది. నామరూపవిలసితమైన విశ్వభోగాభిలాష దుస్తరమై దుఃఖమునకు మూలమగుచున్నది. జాతులు, వ్యక్తులు మమకారాహంకార పరాయణులై సంసారమును దుఃఖమయము చేయుచున్నారు. మానవుడు మమకారాహంకారములను విడిచి విశ్వవ్యాపకుడైన పరమేశ్వరుని గనుగొని శాంతిసుఖములను బడయుచున్నాడు. ఈ పరమార్థమునే సంవత్సరారంభమునందు పురోహితులు చేసెడి పంచాంగ శ్రవణము స్ఫురింపజేయుచున్నది. మానవునకు అనిత్యమును దేశకాలపాత్రబద్ధమునునైన భౌతిక సంపదల యల్పత్వమును, నిత్యమును దేశకాలపాత్రాతీతమునైన దైవసంపదల మహత్త్వమును పంచాంగ శ్రవణము స్మరింపజేయుచున్నది.

* * *

ఆంధ్ర రాష్ట్రము

మద్రాసు రాష్ట్రాంతర్భాగమైన ఆంధ్ర రాష్ట్రము దేశావసరముల కవసరమైన విధమున నాత్మవికాసమును బొందజాలక పరితపించుచున్నది. వర్తమాన ప్రజాప్రబోధయుగమునం దధికారాదరణ ప్రాపకములు నిరాదరణీయములైనను నిత్యవ్యవహారము లందు సామాన్య ప్రజాలక్ష్యము నాకర్షించుచు నవసరము లగుచున్నవి. దేశాభ్యుదయమున కవసరములైన బాటలకును, వంతెనలకును, జలాధారములకును, విద్యావ్యాపనమునకును, వైద్యసహాయమునకును ఉచిత రీతిని నాంధ్రావని కుపకృతి గలుగుట లేదు. దక్షిణమున కావేరీనది కెన్నియో వంతెనలు గలవు. కృష్ణ గోదావరీనదులు రాజమార్గమునందున్నను వంతెనలు లేవు. శ్రీ పానుగల్లు రాజాగా రాంధ్రవిశ్వవిద్యాలయమును స్థాపించినను డాక్టరు సుబ్బరాయనుగారు సంకుచితముచేసిన పుణ్యమును కట్టుకొనిరి. ప్రతిభావంతుడైన శ్రీ రాధాకృష్ణ పండితుని యాజమాన్యము క్రింద నాంధ్ర విశ్వవిద్యాలయము రూపరేఖా విలాసములను బడయుట పురోవృద్ధికి శుభ చిహ్నము. శ్రీ పండిత రాధాకృష్ణ, పండిత వెంకటరామను గారల యుపదేశానుసారముగ నాంధ్రదేశమునందలి ప్రథమ మధ్యమ కళాశాలలు విద్యాప్రవృత్తిని వర్తమానావసరముల కనురూపముగ నిర్ణయించుట సమంజసము. అనంతపురము కళాశాల నాంధ్రవిశ్వవిద్యాలయానుబంధ కళాశాలను చేయుటకు విశ్వవిద్యాలయ నిర్వాహకులును, రాయలసీమవాసులును, ప్రభుత్వాధికారులును పనిబూనుట శ్రేయస్కరము. ఆదర్శము లందును భావములందును, భాషయందును, ప్రయోజనములందును సామ్యముగల విశ్వవిద్యాలయమునకును, కళాశాలకును, సంబంధ సాహచర్యములు శ్రేయోదాయకములు. వివిధ ప్రభుత్వ శాఖలందును నాంధ్ర ప్రయోజనములు నిరాదరణమును బడయుచున్నవి. ప్రజాపోషణమున కవసరమైన తుంగభద్ర జలాశ్రయము మెట్టూరు ప్రాజెక్టువలె నధికారాదరణమునకు పాత్రము గానున్నది. సకలవ్యవహారములందును నాంధ్రవ్యవహారముల కాదరణము గలుగకున్నది. ద్వంద్వ ప్రభుత్వానంతర మీ నిరాదరణ మధిక మగుచున్నది. కొన్నిశాఖలం దాంధ్రులు ప్రధానాధికారులుగ నున్నను వారి ప్రధానాధికారమే వారి సంకల్పసిద్ధికి ప్రతిబంధకముగ నున్నది. ఆంధ్రులకు సహజమైన మొహమోటమును, ఆంధ్రేతర వాతావరణమును, పక్ష ప్రయోజనములును, నిస్సహాయత్వమును ప్రధానాధికారులకును కార్యాచరణమునందు ప్రతికూల పరిస్థితులు గలుగుచున్నవి. శ్రీ మునిస్వామినాయుడుగారు ప్రధానమంత్రిగ నున్నను ఆంధ్రోద్యమమునకు అవసరమైన పోషణ ప్రోత్సాహములు లభించలేదు. శ్రీ బొబ్బిలి మహారాజాగారు ప్రధానమంత్రిపదవిని స్వీకరించినతోడనే వారి ఆంధ్రోద్యమాభిమానము చల్లపడినది. శ్రీ బొబ్బిలిరాజాగారు ఉత్కళరాష్ట్ర సరిహద్దుల నిర్ణయ సందర్భమందు శ్రీ కళ్లికోట రాజాగారిని ప్రతిఘటించుటకు విరమించిరి. అదృష్టవశమున వ్యవసాయశాఖకు శ్రీయుత శొంఠి రామమూర్తి గారును, పరిశ్రమశాఖకు రామకృష్ణగారును ప్రధానాధికారులుగ నేర్పడినను వ్యవహారాచరణమునందు వారి యవకాశము లత్యంతపరిమితములుగ నున్నవి. వైద్యశాఖయందును, విద్యాశాఖయందును ప్రతిభావంతులైన యాంధ్రులకు దేశక్షేమమునకు పనిబూనుట కవకాశములు సంకుచితము లగుచున్నవి.

కాంగ్రెసు ప్రయోజనములకు కాంగ్రెసు నిర్ణయించిన ప్రత్యేకాంధ్రరాష్ట్ర విభాగము ఆంధ్రులకు స్వతంత్రాచరణమున కవకాశము గలుగజేసినది. పదేండ్లకు పూర్వము మద్రాసీనామమే శరణ్యమయిన ఆంధ్రు లిప్పుడు దేశమునం దంతటను ఆంధ్రనామముతో గౌరవమునకు పాత్రులుగ నున్నారు. రాగల సాంఘిక పక్షప్రభుత్వ రాజ్యాంగములందును నాంధ్రోద్యమమునకు హృదయమైన ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణము పోషణమును బడయదని శాసనసభల వ్యవహారములు విస్పష్టము చేయుచున్నవి. ప్రతికూల వాతావరణముగల ఉత్కళులకు రాష్ట్ర నిర్మాణము నంగీకరించుటయును, అనుకూల వాతావరణముగల ఆంధ్రులకు రాష్ట్ర నిర్మాణము నిరాకరించుటయును ప్రభుత్వ హృదయము నావరించిన సంకుచిత స్వభావమును వెల్లడి చేయుచున్నవి. ఆంధ్రుల స్వాతంత్ర్య ప్రియత్వమును, ఉదార స్వభావమును, సహనశీలమును ఆంధ్రరాష్ట్రసిద్ధికి ప్రతిబంధకములుగ నేర్పడినవి. ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకై యువజనులు వారి శక్తి సామర్థ్యములను

వినియోగించి కార్యసిద్ధిని బడయుట వర్తమాన ప్రపంచావృతమైన విషమావస్థయందు పరమావశ్యకమై యున్నది. ఆంధ్రోద్యమమునకు పితామహులై మహాత్యాగముజేసి కష్టముల ననుభవించిన దేశభక్త వేంకటప్పయ్య పంతులుగారనారోగ్యము వలన కార్యభారమును నిర్వహింపజాలకున్నారు. కార్యశూరులైన యువకులు నాయక కవచమును ధరించి ఆంధ్రోద్యమమును నడుపవలసిన యవసరము గలిగినది. ఆంధ్ర యువజను లాత్మోపలబ్ధికి, స్వధర్మ నిర్వాహణమునకు బూనుకొనుట భావ్యము.

రా య ల సీ మ

ఆంధ్రావనియం దాదికాలమునుండియును రాయలసీమ తెనుగుసీమ. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి తన కవిత్వమహత్వమున నాంధ్రావనికి మోదము గల్పించినటులు శ్రీకృష్ణ దేవరాయలు రాజకీయ సాంఘికార్థిక సారస్వతాది సకల విషయము లందును నాంధ్రావనికి ప్రమోదమును కల్పించిన మహాపురుషుడు. ఆంధ్రత్వమును తిక్కన సోమయాజి వలె పెద్దనామాత్యుడు, రామరాజభూషణుడు, శ్రీకృష్ణదేవరాయలు మొదలగు మహానుభావులు రక్షించి పోషించిన విధమున కాంధ్రశైలిహాసములు ప్రత్యక్ష ప్రమాణములు.

ఆ. వె. తెలుగ దేల యన్న! దేశంబు తెలు గేను
తెలుగువల్లభుండ తెలు గొకండ,
ఎల్ల నృపులు కొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స!

శ్రీకృష్ణదేవరాయ విరచితమైన ఆముక్తమాల్యద తెలుగుభాషకు దేశభాషలందు గౌరవమును కల్పించినది. ఉత్తరాంధ్రులకును, పశ్చిమాంధ్రులకును తిక్కనవలె పెద్దనయును, ప్రతాపరుద్రునివలె శ్రీకృష్ణదేవరాయలును పూజాపాత్రులు. రాయల కాలమునందు పాడిపంటలకును, వైభవవిలాసములకును, ధైర్యసాహసములకును, కళానిర్మాణములకును, నవ్యసారస్వత రచనలకును, స్వాతంత్ర్యప్రియత్వమునకును నిలయమైన రాయలసీమ వర్తమానకాలమం దనుభవించుచున్న విషాదావస్థ సకలాంధ్రాదరణమునకును తగియున్నది. రాయలసీమ నావరించిన విషాదావస్థకు కారణములు ప్రభుత్వ నిరాదరణమును నవకాశాభావమును గాని రాయలసీమవాసుల సాహస సంస్కార వివేకాభావములు కావు. దుర్బలస్థితియందున్న ఉత్తరాంధ్రులును, రాయలసీమాంధ్రులును గలిసి పనిజేసి ఆంధ్రాభ్యుదయార్థమైన ఆంధ్రరాష్ట్ర స్థాపనము జేయుటకు భగవదనుగ్రహము గలుగుగాత!

భగవదనుగ్రహమువలన శ్రీముఖ సంవత్సరారంభమునందు 24–వ సంవత్సరాది సంచికను ఆంధ్ర మహాజనులకు సమర్పింపగలిగినందులకు వ్యాసకర్తలకును, చిత్రకారులకును, కవులకును, నితర మహాశయులకును నిర్వాహకులు కృతజ్ఞులు. వర్తమాన దేశకాలపరిస్థితులందు పత్రికాప్రచురణమును సంవత్సరాది సంచికాప్రచురణమును దురారాధ్యముగ నున్నవి. నిర్బంధశాసనములు భావస్వాతంత్ర్యమును, సంభాషణ స్వాతంత్ర్యమును, ప్రచురణ స్వాతంత్ర్యమును వజ్రపాశములందు బంధించినవి. ప్రచురణ విషయము లందును, చిత్రపటములందును, నిషిద్ధవిషయము లను, సమ్మతవిషయములను నిర్ణయించుట దుర్లభము. ప్రజాహృదయము నాకర్షించెడి పటములు, వ్యాసములు, విమర్శనలు వ్రాయగల యవకాశములు, ప్రచురింపగల యవకాశములు పరిమితములు. విషమ పరిస్థితులందును ఆంధ్రమహాజనుల సహాయపోషణాదరణములవలన శ్రీముఖ సంచికను సంవత్సరాదిని ప్రచురింపగల భాగ్యము కలిగినందుకు సంచికా నిర్వాహకులు కృతజ్ఞులు.

మొదటి సంవత్సరాదిసంచిక బొంబాయి యందు సాధారణ సంవత్సరాదిని తత్త్వవివేచక ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది. శ్రీముఖ సంచిక చెన్నపురియందు స్వీయాంధ్రపత్రికా ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది. కడచిన 24 ఏండ్లయందును ఆంధ్రావనియందును, హిందూస్థానమునందును, ప్రపంచమునందును రాజకీయ మత సాంఘికార్థిక సాహిత్య లలిత కళాదులందు గలిగిన వికాసమును సంచికయందలి వ్యాసములు, పద్యములు, కథలు, గేయములు, చిత్రపటములు విశదము చేయుచున్నవి.

సారస్వతము

ఆదికాలమునుండియును ఆంధ్రావనియందు సంస్కృతాంధ్రములకును ప్రాచీన నవీనమార్గములకును సంరంభసాహచర్యములు సహజముగ గలిగినవి. ఆసంరంభసాహచర్యములందు ఆంధ్ర సారస్వతము స్వయంవ్యక్తిత్వమును బడసి వికసించినది. వర్తమాన యుగమునందు ప్రపంచమంతయును నవీన భావములతో తాండవమాడుచున్నది. మానవ జీవయాత్రను ఆనందప్రదము చేయుటకు కావ్యములు, లలితకళలు ప్రాచీననవీనభేదములులేక రసానందమును గలుగజేయుచున్నవి. గతించిన పదేండ్లయందును సారస్వతమునందు వెలసిన నవీన సాహిత్య నిర్మాణములు ఖండన మండనములకు పాత్రమైనను క్రమవికాసమును పొందుచు విద్యావంతుల హృదయముల నాకర్షించుచున్నవి. దేశమంతయును రాజకీయ సాంఘిక మతాది విషయములందు స్వాతంత్ర్య ప్రాప్తికై పరితపించుచున్నప్పుడు సారస్వతమునం దీపరితాపము ప్రతిబింబించుచుండును. యువజనులు నవజీవన నిర్మాణమునకై మహాత్యాగమును జేయుచున్నప్పుడు సాహిత్య రచనలందు వారి త్యాగము సహజముగ ప్రతిబింబించుచుండును. సంచికయందు ప్రచురించిన వ్యాసములును, గీతములును కథలును, విమర్శనలును ఆంధ్ర యువజన హృదయావృతమైన భావపరివర్తనమును విశదము చేయుచున్నవి. సకలనిర్మాణములకును స్వాతంత్ర్యము మూలాంకురము. స్వాతంత్ర్య విలసితములైన రచనలు ప్రాచీన నవీనభేదమును, సంస్కృతాంధ్రభేదమునులేక ప్రజాదరణమును బడయుచున్నవి.

త్రివర్ణ చిత్రములు

రా. బ. వీరేశలింగము పంతులుగారాంధ్రోద్యమమునకు మూలపురుషులైనటులు ఆంధ్రచిత్రకలాభ్యుదయమునకు శ్రీయుత కీ. శే. దామెర్ల రామారావు గారు మూలాంకురమును నాటిరి. ఆంధ్రచిత్రకలాభ్యుదయమువారి దక్షత్వమును విశదము చేయుచున్నది. ఈ సంచికయందు 8 త్రివర్ణ చిత్రములును, అనేకములైన సాధారణ చిత్రములును ప్రచురింపబడినవి. త్రివర్ణ చిత్ర పరిశీలన మాంధ్ర చిత్రకళా వ్యక్తిత్వమును తెలుపుచున్నది. రూపరేఖావిలాస విన్యాసములందును, రంగులందును, భావములందును, చిత్రరచనలందును ఆంధ్ర యువజనులు చూపుచున్న వ్యక్తిత్వము చిత్రములందు వెల్లడియగుచున్నది. వివిధప్రాంతములందును ఆంధ్రయువజనులు స్థాపించిన చిత్రకళా భవనములు ఆంధ్రుల చిత్రకళా ప్రావీణ్యమునకును, సభిరుచికిని నిదర్శనములు. ఇతర రంగములందువలెనే సారస్వత చిత్రకళారంగములందును అవకాశాభావము లాంధ్రుల పురోభివృద్ధికి ప్రతిబంధకములుగ నున్నవి. శ్రీముఖ సంచిక ముఖపటము నవీన మార్గము నవలంబించుచున్నది. దేశమునందు సనాతనులను, సంస్కారులను కలవరపరచుచున్న హరిజన సమస్య ముఖపత్ర విషయము. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు సనాతన ధర్మమును విసర్జించి నవీనాచార వ్యవహారములను, నూతన వేషభాషలను స్వీకరించినను అస్పృశ్యులు మాత్రము పూర్వము వలెనే శ్రీరామభజనలను చేయుచున్నారు. దేవాలయ ప్రవేశవిషయమై జరుగుచున్న ప్రతిఘటనము నుపశమింపజేయుటకు శ్రీరాముని సేవించుచున్నారు. సనాతన ధర్మపరాయణులు అనివార్యమైన సంస్కరణమును హృదయపూర్వకముగ నామోదించి హరిజనులకును నితరవర్ణములకుగల మానవస్వాతంత్ర్యమును ప్రసాదించి హిందూమత సంఘధర్మమును రక్షింతురుగాత!

ఆచారపాశబద్ధమైన ప్రపంచ వ్యవస్థలందు నవజీవన ప్రవాహము ప్రసరించుచు ఆచారపాశబంధములను శిథిలము చేయుచున్నది. ప్రపంచమునం దంతటను నవజీవన నిర్మాణమునకు ప్రయత్నములు జరుగుచున్నవి. అనుకరణము పారతంత్ర్యమునకును, నిర్మాణము స్వాతంత్ర్యమునకును చిహ్నములు. ప్రపంచమునం దంతటను సకల రంగములందును స్వాతంత్ర్య సమరము ప్రవర్తమాన మగుచున్నది. రాజకీయ సాంఘికార్థిక మత సాహిత్య కళానిర్మాణములు నవజీవనకాంతుల నపేక్షించుచున్నవి. నిరంకుశాధికారులకు రాజకీయ స్వాతంత్ర్యము గిట్టదు. సనాతనులకు సాంఘిక సంస్కరణము సరికిరాదు. మతాచార్యులకు మతసంస్కారము పాపభూయిష్ఠము. ధనస్వాములకు ప్రజాస్వాతంత్ర్యము

భయంకరము. సాహిత్య కళాభిమానులకు నవీన మార్గము లుపద్రవకరములు. స్వాతంత్ర్య ప్రియులైన వీరులు, ధీరులు, కవులు, గాయకులు, కళాభిజ్ఞులు స్వాతంత్ర్య యుగస్థాపనమునకు వారి శక్తి సామర్థ్యములను వినియోగించవలసిన యవసరము గలిగినది. ఆంధ్రదేశ భాగ్యోదయము స్వాతంత్ర్య ప్రియులైన యువజనులమీద నాధారపడి యున్నది. గతించిన పదేండ్లయందును నాంధ్ర మహాజనులు (స్త్రీ పురుషులు) చేసిన త్యాగ మాంధ్రులకు కర్తవ్యమును బోధించుచున్నది. సాహిత్య కళారచనలందును, సంఘమతాచారములందును నాంధ్ర మహాజను లవలంబించుచున్న స్వాతంత్ర్యమును సంచికయందలి రచనలు తెలుపుచున్నవి. శ్రీముఖ సంవత్సరమునం దాంధ్రులును, సమస్త లోకములును గీతాంతమునందు సంజయుడు ధృతరాష్ట్రునకు జేసిన ధర్మోపదేశానుసారముగ యోగారూఢులై, కార్యపరాయణులై కామితార్థములను బడయుదురుగాత!

శ్లో. యత్ర యోగేశ్వరః కృష్ణో
యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతిః
ధ్రువా నీతి ర్మతి ర్మమ.



నైనం దహతి

శ్రీ సూరపరాజు రాధాకృష్ణమూర్తి

[హరి పరాక్రమ యేను గిందము డన్మనిన్.]

1

ఈ అడవి ఎంతో అందంగా ఉంది
ముని మనసులా ప్రశాంతంగా ఉంది
ఆకులు డుల్లి కోర్కెలు రాలి
ధీరంగా దీర్ఘంగా
తపస్సు చేస్తున్నాయి చెట్లు
పక్షులు ముద్దుగా అరుస్తున్నాయి
ముని నెత్తిపై విహరిస్తున్నాయి
ఈ అడవి ఎంతో అందంగా ఉంది
ముని మనసులా

2

అందంలో ఏదో అశాంతి ఉంది
చెట్టంత స్థైర్యం ఉంది
కొమ్మలలో రెమ్మలలో ఏదో కదలిక ఉంది
రామచిలుకలు రాబందులు
కలరవంచేస్తున్నాయి వికలంగా అరుస్తున్నాయి
లేడిపిల్ల గంతులతో సింహకిశోరం వంతువేసుకుంది
ఈ అడవి ఎంతో అందంగా ఉందికదూ
నా మనసులా
కాదు
నా మనసు ఈ అడవిలాగుంది.

వసంతం నన్నుచూసి నవ్వుతుంది
విరగబడి వికటంగా

కోరలుచూపి కరాలుచాపి
ఏదో పురాణ పిశాచం వలె.
వసంతం ఈ నాటిదికాదు ఇక్ష్వాకులనాటిది ఇంకాముందుడి ముసలిది
సప్తమ సముద్రగర్భంలో మొలచిన
ఒంటికాలి మేడలో
తనకోసం కాచుకున్న చిన్నదాన్ని
వెదకుతూ వెడుతున్న వాణ్ణి
అర్ధాంతరంలో అధ్వాన్నపుటడవిలో ఆపి
ప్రేమిస్తున్నానన్నది
ప్రేమించకపోతే చెట్టును చేసేస్తానన్నది


3

నిన్నటి వరకు నిండుగా నిటారుగా
మోడుగా మోడిగా
ధీరంగా దీర్ఘంగా
తపించిన ఈ చెట్టు
ఈ చెట్టుకు నిప్పంటుకుంది
ఇప్పు డీఅడవి ఎంతో అందంగా ఉంది
నా మనసు ఈ అడవి లాగుంది
ఈ అరణ్యం రాగారుణ్యం.

దేహంలేని కోరిక
దహిస్తున్న దీదేహాన్ని
అశరీరకామం
అందుకే అది అక్షరం
దాన్ని హరుడు హరించలేడు
వైశ్వానరుడు దహించలేడు
కందర్పుని చాపము
సర్వభూతేప్సితశాపము
అజ్యోద్దీపిత శతశత సహస్ర జిహ్వాయుత హవ్యవాహాభము కామము

నైనం దహతి

ఈ దేహము చాలదు
ఈ దాహము చల్లారదు
కోరిక కదలికలో మృగమౌదును నేను
పశువాంఛలో వసించు ఋషిని నేను
కుక్క నక్క శివుడు చీమ
పందులు రాబందులు
హరి హరిణము కరి కరిణులు
అన్నిట నా వాంఛయే జ్వలించు
అన్నిటి నా వాంఛయె దహించు
ఈ చెట్టు చూడు
ఈ చెట్టుకు నిప్పంటుకుంది.
మహరాజా మరచిపోకు
నీవూ ఈ అడవిలోని చెట్టువు.



ప్రాచీనాంధ్రమున మాండలికములు

శ్రీ ఎం. కందప్పశెట్టి

ఏ భాషకైనను దాని చరిత్రను తెలిసికొనవలెనన్న అందలి మాండలికముల పరిశీలించుట మిక్కిలి యవసరము. తెలుగుభాషను విశాలమైన ప్రదేశమున ప్రజలు మాటలాడుచున్నారు. కావున ప్రాంతీయముగా నీ భాషలో కొన్ని కొన్ని భేదములుండుట సహజము. ఈ ప్రాంతీయ భేదములను గుర్తించినగాని తెలుగు భాషా చరిత్రను సమగ్రముగ వ్రాయలేము. తెలుగునకు ముఖ్యముగా నాలుగు మాండలికములున్నవి. 1. రాయలసీమ 2. మధ్యకోస్తా 3. ఉత్తరకోస్తా 4. తెలంగానా. పూర్వము తెలుగునకు మూడే మాండలికము లున్నట్లు విమర్శకులు భావించెడివారు. రాయలసీమ—సర్కారు—తెలంగానా. కాని ఇప్పటివారు కోస్తాజిల్లాలలో విశాఖపట్టణమున కుత్తర భాగము భాషలోని ప్రత్యేకతలను గుర్తించి, దాని నొక ప్రత్యేక మాండలికముగా నిరూపించిరి.[1]

ఏ భాషకైనను ఈ మాండలికములు ఒక్కసారిగా ఒకే విధముగా నేర్పడవు. ఏదో కారణముగా సంఘములో రాకపోకలు తగ్గుటయే యీ మాండలికము లేర్పడుటకు కారణమగును. ఇది రాజకీయ సాంఘికములైన అనేక కారణమువలన పలుచోట్ల పెక్కు సందర్భములందు ఏర్పడును. చిరకాలము పరస్పరము సన్నిహితత్వము లేకుండినచో తొలుత మాండలికములు ఏర్పడి, పిదప చాలకాలమునకు అనేక కారణములవలన వేరు భాషలుగ నగును. ఒకే కుటుంబమునకు చెందిన భాషలన్నియు నీ విధముగనే ఏర్పడును.

నేటి వ్యావహారిక భాషకు మాండలికముల పరిశీలించు విధముగా ప్రాచీన కాలమున వ్యవహారమున నుండిన భాషలలోని మాండలికముల పరిశీలించలేము. ఆ కాలమునందలి భాషలు నేడు వ్యవహారమున లేకపోవుటచేతను, ఆ కాలమునందలి సాహిత్యములు శిష్టభాషా ప్రయోగములు గావించుటచేతను (Standard language), ఆనాటి మాండలికముల గుర్తించుట కష్టమైనవి. అదృష్టవశాత్తు తెలుగు భాషలో మన పూర్వులైన రాజులు, నాయకులు తమ శాసనములను రాళ్లపైన చెక్కించియుండుటచే ఆనాటి వివిధ మండలము లందలి భాషా భేదములను మనము నేడు కొంతవరకు గుర్తించగలుగుచున్నాము. ప్రపంచములోనే భాషకును లేనన్ని శిలాశాసనములు భారత భాషలకున్నవి. ఈ శిలాశాసనములు ఇతర రచనలవలె ఒక చోటినుండి మరియొక చోటికి తేలికగా తీసికొని పోలేరు.[2] కనుక ఆ నాటి మాండలికములను గుర్తించుటకు ఇవి మిక్కిలి తోడ్పడుచున్నవి.

భాషాపరిశోధకు లనేకులు ఈ శిలాశాసనములను పరిశోధించిరి. కాని మాండలికముల దృష్టిలో నుంచుకొని యెవ్వరును పరిశోధన గావింపలేదు. ప్రాకృతభాషలకు మెహెండలే అను పండితులు శిలాశాసనములందలి మాండలికభేదములను గుర్తింప ప్రయత్నించిరి. కాని వారు పరిశోధనకు పూర్వమే ఉత్తరప్రాకృతము, దక్షిణప్రాకృతము, మధ్యప్రాకృతము అని విభజించి ఆయామండలము లందలి స్వరూపముల జూపిరి.[3] పరిశోధనకు పూర్వము నీ విశ్రుతాభి

1. డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి—మాండలిక వృత్తిపదకోశము. I. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ—హైదరాబాదు.

2. శిలాశాసనములు ఏవో కొన్ని తప్ప మిగిలినవి దాదాపు పుట్టినచోటనే నిల్చియుండును. కనుక నివి మాండలిక పరిశీలనకు తోడ్పడును. ఆ కొన్ని కూడ సమీపప్రదేశములకే తీసికొనిపోబడును. కొన్ని కొన్ని కట్టడముల కుపయోగింపబడియున్నవి.

3. Mehandale M.A, Historical Grammar of Inscriptional Prakrits—Poona-1948.

ప్రాయమును లేకుండ రూపసంగ్రహము గావించి, తర్వాత దానిని పరిశీలించినచో వాస్తవమైన మాండలికములను, ఆ మాండలికము లెట్లేర్పడుచున్న వనియు గుర్తించవచ్చును. ఈ విధమైన పరిశీలన వా శాసనపరిశోధనలో ప్రయత్నించి కొంతవరకు నిరూపింపగల్గితిని.[4] అందు కొన్నిఅంశములను వదలి వేయుటచే నీ చిన్నివ్యాసమును ప్రకటించుచున్నాను.

తెలుగుభాషలో శాసనములు క్రీ. శ. 6 వ శతాబ్దినుండి కన్పడుచున్నను, అత్యధికమైన శాసనములు 12 వ శతాబ్దినుండియే గన్పడుచున్నవి. వా శాసనపరిశీలనలో 12–14 శతాబ్దుల మధ్య దాదాపు 1700 శాసనములను పరిశీలించితిని. ఇవి దేశమునందలి నలుమూలలను వ్యాపించియున్నవి. కావున నీశతాబ్దులమధ్య శాసనములు మాండలికము లను దెలిసికొనుటకు మిక్కిలి యుపయోగకారిగ నున్నవి.

తెలుగుభాషలో నేడు మనము 'శనివారము' అను మాటకు బదులు పై శాసనకాలమున అనేక రూపములు ఉండెడివి. శనైశ్చరవారము, సౌరి వారము, వడ్డవారము మొ. వి. 'శనివారము' అనుట అమంగళసూచకమని కాబోలు—దీనితోబాటు పైచెప్పిన పేళ్లును ఆంధ్రదేశమున బహుళప్రచారమున నుండినవి. శనివారమనుమాట ఆంధ్రదేశమంతట గన్పడు చున్నది. కాని దాని పర్యాయపదములైన తక్కినవి ఒక్కొక్క మండలములందు ఒక్కొక్క విధముగ నున్నవి. వానిని ఈ క్రింద పొందుపరచుచున్నాను.

శనివారము

12 వ శతాబ్ది

స[ని]వారము	SII. V.[5] 1100–5–1135 ముఖలింగం–పర్లాకిమిడి–శ్రీకాకులం.
శనివారము	SII. X. 666–3–1124 నారాయణపురం–బొబ్బిలి–శ్రీకాకులం.
శనివార	SII. X. 661–9–1118 ,,
శనివార	SII. X. 702–3–1149 ద్వారపురెడ్డిపాళెం–విజయనగరం–విశాఖ.
సనివారము	SII. VI. 1174–4–1151 సింహాచలం–విశాఖ.
శని[వా]రము	SII. IV. 1128–4–1159 దాక్షారామం–రా. చం.పురం – తూ. గో.
సనివారము	SII. IV. 1253–3–1132 ,,
శనివారము	SII. VI. 127–19–1151, 150–7–1148, 151–7–1154, 159–2–1143, 183–6–1156, 193–7–1131 బాపట్ల – గుంటూరు.
శనివారము	SII. VI. 627–3–1145 కొనిదెన–నరసరావుపేట–గుంటూరు.

13 వ శతాబ్ది

శనివరము	SII. V. 1283–3–1211 శ్రీకూర్మం–శ్రీకాకులం.
శనిరోహిణి	SII. VI. 1118–6–1281 సింహాచలం– విశాఖ.

4. Kandappa Chetty M. Historical Grammar of Inscriptional Telugu (based on the inscriptions of 12th, 13th and 14th centuries) - Tirupati – (thesis-unpublished.)

5. SII-South Indian Inscriptions—Govt of Madras— ఇందలి సంఖ్యలు మొదటిది శాసనసంఖ్య – రెండవది శాసనమునందలి వరుససంఖ్య–మూడవది సంవత్సరము. ఈ పట్టికయందలి జిల్లాలు నాకు తెలిసినంతవరకు నేటి విభాగము ననుసరించి యిచ్చితిని. కొన్ని శాసన గంథమున మున్నట్లే యిచ్చితిని. మాండలిక పరిశీలనకు ఈ కొద్దిపాటి వ్యత్యాసమువలన అంతగా మార్పురాదు. నెల్లూరు శాసన గ్రంథములు నాకు దొరకనందున ఈ వ్యాసమున నా జిల్లా శాసనములను గైకొనలేదు.

శనివారము SII. V. 218-12-1243 గుడివాడ–కృష్ణా.

శనివారము SII. X. 456-2-1282 మల్కాపురం–గుంటూరు.

శనివారము SII. X. 340-10-1253 త్రిపురాంతకం–మార్కాపురం–కర్నూల్.

శు ౧౩ శ[6] SII. X. 369-3-1259 ,,

బ ౬ శ SII. X. 394-2-1261 ,,

శనివారము Hyd Arch[7] 17-11-1258 అన్నవరం–సూర్యాపేట–నల్గొండ.

శనివారము Hyd Arch 28-11-1258 వాగులపాడు–సూర్యాపేట–నల్గొండ.

14 వ శతాబ్ది

శనివరము SII. V. 1224-2-1356 శ్రీకూర్మం–శ్రీకాకులం.

శనివారము SII. VI. 1122-6-1374, 1114-6-1376, 1084-6-1382 సింహాచలం–విశాఖ.

శనివారం SII. VI. 972-2-1383 సింహాచలం–విశాఖ.

సనివారము SII. VI. 869-2-1379, 870-2-1379, 871-5-1379, 739-5-1381, 723-5-1378 సింహాచలం–విశాఖ.

శనివారము SII. VI. 741-2-1380, 732-2-1379 సింహాచలం–విశాఖ.

శనైశ్చరవారము

12 వ శతాబ్ది

శనైశ్చరవారము SII. IV. 1053-7—1166, 1160-2-1140 దాక్షారామం–రా. చం.పురం–తూ. గో.

శనైశ్చరవారము SII. X. 13-6-1142 తణుకు–ప. గో.

శనైశ్చరవారము SII. IV. 993-2-1157 చల్లపల్లి–కృష్ణా.

శనైశ్చరవారము SII. VI. 103-59-1149 బాపట్ల–గుంటూరు.

13 వ శతాబి

శనైశ్చరవారము SII. VI. 937-8-1292, 943-12-1292 సింహాచలం–విశాఖ.

శనైశ్చరవారము [8]T I. I. 30-25-1204 పిల్లలమర్రి–నల్గొండ.

14 వ శతాబ్ది

శనేశ్వరవారము SII. IV. 818-6-1382 సింహాచలం–విశాఖ.

---

6. ఇచ్చట శ అనగా శనివారము గావచ్చును, శనైశ్చరవారము గావచ్చును.

7. Hyderabad Archeaological series

8. Telangana Inscriptions.

సౌరివారము

12 వ శతాబ్ది

శౌరివారము SII. V. 1068–3–1145 ముఖలింగం–పర్లాకిమిడి–శ్రీకాకులం.
శౌరివారము SII. X. 680–3–1133 నారాయణపురం–బొబ్బిలి–శ్రీకాకులం.
శౌరిదినంబున SII. IV. 666-7–1139 నరసరావుపేట–గుంటూరు.
సౌరివారర SII. VI. 103–52–1145 బాపట్ల–గుంటూరు.

13 వ శతాబ్ది

సౌరివారము SII. V. 1293–12–1246, 1296–2–1238, 1236–2–1277 శ్రీకూర్మం–శ్రీకాకులం.
శౌరివారము SII. VI. 912–6–1278 సింహాచలం–విశాఖ.

14 వ శతాబ్ది

సౌరివారము SII. V. 1225–3–1349–శ్రీకూర్మం–శ్రీకాకులం
శౌరివారం SII. VI. 1059–2–1391 సింహాచలం–విశాఖ.
సౌరివారము SII. VI. 922–5–1378 ,,
సౌరివరము SII. VI. 794–6–1375 ,,

వడ్డవారము

12 వ శతాబ్ది

శుంౕవ SII. X. 207–2–1198 తణుకు–ప. గో.
వడ్డవారము SII. VI. 228–60–1197 పత్తిపవల్లి–గుంటూరు.
వడ్డవారము SII. IV. 667–11–1139 నరసరావుపేట–గుంటూరు.
వడ్డవారము TI. I. 5-7–1162 హనుమకొండ–వరంగల్లు.
వడ్డవారము T I. I. 4-4–1121 మాటూరు–వరంగల్లు.

13 వ శతాబ్ది

వడ్డవారము SII. V. 85-2–1210 కాకినాడ–తూ. గో.
వడ్డవరవ SII. V. 54–3–1293 ,,
వడ్డవారము SII. V. 195–3–1204 ఏలూరు–ప–గో.
శుంౕవ SII. X. 484–2–1298, 485–2–1298 తణుకు–ప.గో.
వడవారము SII. IV. 957–1–1270 చల్లపల్లి–కృష్ణా.
వడ్డవారము SII. IV. 747–7–1228 బెజవాడ–కృష్ణా
వడ్డవారవ SII. IV. 766–5–1271 ,,

వడ్డవారము SII. VI. 618-3-1221, SII. X. 413-5-1267 నరసరావుపేట—గుంటూరు.

వడవారము SII. X. 312-21-1247 సిద్ధిపేట—కడప.

14 వ శతాబ్ది

శు రా వ SII. X. 556-35-1358 బాపట్ల—గుంటూరు.

	శనివారము			శనైశ్చరవారము			సౌరివారము			వడ్డవారము		
జిల్లాలు	12శ	13శ	14శ	12శ	13శ	14శ	12శ	13శ	14శ	12శ	13శ	14శ
శ్రీకాకుళం	3	1	1				2	4	4			
విశాఖ	2	1	11		2	1						
తూ. గో.	2			2							2	
ప. గో.				1						1	3	
కృష్ణ		1		1							3	
గుంటూరు	7	1		1			2			2	2	1
కర్నూల్		3										
కడప											1	
తెలంగానా		2			1					2		

పై పట్టికలో 'శనివారము' అనుమాట ఆంధ్ర దేశమునందు సర్వత్ర కన్పడుచున్నది. 'శనైశ్చర వారము' అనుమాట శ్రీకాకుళము, కడప, కర్నూల్ తప్ప తక్కిన ప్రదేశములందు గన్పడుచున్నది. 'సౌరి వారము' గుంటూరులో రెండు ప్రయోగములుతప్ప తక్కినవన్నియు శ్రీకాకుళములోనే గన్పడుచున్నవి. గుంటూరులోని రెండు ప్రయోగములును (శౌరిదినంబున, సౌరివాసర) ఉత్తరాదివారు వలనవచ్చుట మూలముగనో లేక మరేకారణముగనో జరిగియుండ వచ్చును. వారము అనుమాటకు బదులు 'దినము, వాసర' అని ప్రయోగించుట ఇందలి అతిశిష్టత్వము నకు తార్కాణము. 'వడ్డవారము' అనునది శ్రీకాకులము—విశాఖపట్టణము తప్ప తతిమచోట్ల గన్పడు చున్నది. 'వడ్డవారము, సౌరివారము' అనుమాటల ప్రయోగములనుబట్టి విశాఖపట్టణమున కుత్తరభాగ మొక మండలముగను, విశాఖపట్టమునకు దక్షిణ భాగమును మరొక మండలముగను విభజింపవచ్చును. ఈ రెండుమాటలును విశాఖపట్టణమున గన్పడక పోవుటచే విశాఖపట్టణ మేమండలమునకు జేరు నదియు చెప్పలేము. 'శనైశ్చరవారము' అనుమాట శ్రీకాకులమున గన్పడకపోవుటయు గమనింపదగిన విషయము.

పై మాటలలో శనివారము, శనైశ్చరవారము అనువానికి అర్థము స్పష్టము. శనిదేవత సూర్యుని కొడుకు కనుక ఉత్తరమండలమున సౌరివారమనిరి. కాని వడ్డవారము అనుపదము శాసనములలో నొక వింతపదము. దీనికి సాహిత్యమున ప్రయోగములేదు. శాసనములందును 12వ శతాబ్దికి పూర్వము ప్రయోగములేదు. 14వ శతాబ్దినుండి ప్రయోగము చాల అరుదు. 12-13 శతాబ్దులలోనే ఇది బహుళ ప్రచారమున నుండినది. ఈ వడ్డ అను శబ్దము సంస్కృతమునందలి వర్ధ అను శబ్దమునకు ప్రాకృత

రూపము. దీనికి శనివారార్థమున కన్నడమున రన్నని కాలముననే ప్రయోగము గన్పడుచున్నది. రన్నని గదా యుద్ధమున "అమంగళవారమునకు మంగళవారమనియు, శనివారమునకు వడ్డవారము అనియు, పేరు వచ్చినట్లే ధర్మపరుడు కానట్టివానికి ధర్మరాజని పేరువచ్చెన"ని దుర్యోధనుడు ధర్మజునిగురించి చెప్పినట్లు వర్ణించబడియున్నది.[9] రన్నకవి 10వ శతాబ్దివాడు. ఈ కాలమున తెలుగుభాషలో నీ పదము వ్యవహారమున నున్నట్లు కన్పడకపోవుటచేతను, 11–13 శతాబ్దంలలో తెలుగుదేశముపై కన్నడభాషాప్రభావము ఉండియుండుటచేతను, ఈ పదము కన్నడభాషనుండి తెలుగునకు వచ్చియుండునని చెప్పవచ్చును. ఆంధ్రదేశమున నీ పదము వ్యాపించియున్న ప్రదేశమును బట్టియు నీ విషయము స్పష్టపడుచున్నది.

---

9. కళశజన వింతు కొలిసిద
ఖళనెగడం ధర్మనందనం క్రూరదినం
గళపెసరం మఱెయిసి మం
గళవారం వడ్డవార మెంబిందతె వలం.

రన్నకవి–గదాయుద్ధం(3–26)
మైసూరు–1925

ఈ ప్రయోగము విచ్చిన శ్రీ గణేశరావుగారికి (Asst prof. of Kannada, Govt. Arts College. Madras) వా కృతజ్ఞత.



నియమాతీతమ్

శ్రీమతి ఆర్. వసుంధర

హైదరాబాదు వెళ్లే రైలువచ్చి బెజవాడస్టేషన్‌లో ఆగింది. ఆడవాళ్ల సెకండ్‌క్లాస్ పెట్టెలో ఎక్కింది సుశీల. మిగతా పెట్టెలన్నీ క్రిక్కిరిసి వున్నాయి. రెండే బెర్తులున్న యీ చిన్నపెట్టె మాత్రం బాగా ఖాళీగా వున్నది. ఎదుటి సీట్లో ఒక లావుపాటామె సామాన్లన్నీ సీటుమీద పరిచి పెట్టుకొని కాళ్లు రెండూ సీటుమీదనే విశ్రాంతిగా ముడుచుకొని కిటికీలో మోచెయ్యి ఆనించుకొని తాపీగా బయటకు చూస్తూ కూర్చున్నది. సుశీల ఎదుటిసీటుమీద హోల్డాలు పరిచి బాబును పడుకోబెట్టి జుట్టు సర్దుకొని కూర్చున్నది. రాత్రంతా జాగరణ చెయ్యకుండా హాయిగా పడుకోడానికి చోటు దొరికినందుకు సంతోషించింది.

రైలు బయల్దేరాక ఎదుటి సీట్లో ఆమెను 'ఎక్కడికి వెళ్తున్నారు' అని ప్రశ్నించింది.

'ఖమ్మం' అన్నదామె.

ఆమె దిగి వెళ్లిపోతే తాను ఒక్కత్తెనే అయిపోతానని తోచగానే సుశీలకు అమ్మ చెప్పిన జాగ్రత్తలన్నీ గుర్తుకొచ్చినై. 'ఆడవాళ్ల పెట్టెలో ఎక్కవద్దు. కష్టమైనా మగవాళ్లపెట్టెలో ఎక్కడమే మంచిది. ఒంటిగా అసలు వుండరాదు' అని ప్రతి సారీలాగానే గట్టిగా చెప్పింది అమ్మ. 'జాగ్రత్తలు చెప్పడమైతే చెప్పారుగాని ఎవరైనా బెజవాడవరకూ వచ్చి రైలెక్కించలేకపోయారు! పనివాణ్ణి పంపినా సరిపోయివుండేది. వాళ్ల కోపతాపాలేగాని నా సంగతి పట్టలేదు' అని విసుక్కుంది. 'వచ్చి పది రోజులు కాలేదు. ఇంతదూరంవచ్చి అంతలోనే వెళ్లకపోతేనేం? యింకో పదిరోజులుండి సంక్రాంతి వెళ్లాక వెళ్లవచ్చును. విశా ఆయన్ని పండక్కి రమ్మని వ్రాయి. యిద్దరూ కలిసి వెళ్దురుగాని. పిల్లవాడితో ఒక్క దానివి వెళ్లలేవు' అన్నారు అమ్మా, నాన్నా. అసలే అక్కడ తగవులాడి వచ్చివుండటాన, ఆయన ఘట్టిగా రమ్మని వ్రాసినప్పుడు వెళ్లకపోతే బాగుండదనే వుద్దేశ్యంతో మొండిగా బయల్దేరింది సుశీల. రైలెక్కించడానికి వాళ్లకు వీలుకాలేదు. 'ఇంత చదువుకొని ఎన్నో ప్రయాణాలు చేసినదాన్ని. బాబు వున్నాడనిగాని లేకుంటే నాకు యిదంతా ఒక లెఖ్ఖా!' అనుకుంది సుశీల.

'పిల్లాడి కెన్నోఏడూ?' దీర్ఘంతీస్తూ అడిగింది ఎదుటి సీట్లో ఆవిడ.

'మూడు నిండింది.'

ఎవరడిగినా అయిదో సంవత్సరమని చెప్పమనీ లేకుంటే దిష్టి తగుల్తుందనీ తల్లి చెప్పిన విషయం గుర్తున్నా అబద్ధం చెప్పడానికి అలవాటూ యిష్టమూ లేక నిజమే చెప్పింది సుశీల. ఒకసారి ఎవర్తోనో పిల్లాడికి అయిదు వెళ్లిందని చెప్పింది తల్లి. పొడుగు పిల్లాడు కావటాన చూడటానికి కాస్త నదురుగా వున్నా మొహంలో పసితనం కనిపిస్తోంది. వాళ్లు నిజం వూహించి 'యీవిడ అబద్ధం చెబుతున్నది' అనుకుంటారేమోనన్న భయం వున్నది సుశీలకు. అబద్ధాలు చెప్పేవాళ్లంటే సుశీలకు అసహ్యం.

'టక్‌టక్'మన్న శబ్దంతో పరధ్యానంనుండి బయటపడింది సుశీల. టికెట్‌కలెక్టరు వచ్చి పెన్సిలుతో పై బెర్తుమీద టకటక శబ్దం చేస్తున్నాడు. 'టికెట్స్' అన్నాడు. సుశీల పర్సులోంచి తన టికెట్ తీసి చూపించింది. 'పిల్లవాడికి?' అన్నాడు. 'వాడికి మూడేళ్లే' అన్నది సుశీల సగం విసుగూ సగం గర్వం కలిసిన గొంతుతో నిర్లక్ష్యంగా. 'మూడు నిండిందా?' అన్నాడు టీసీ. 'అవును...' అన్నది సుశీల. టీసీ మొహంలో చిన్ననవ్వు కన్పించింది.

దొంగను పట్టుకున్న పోలీసు దర్పమూ, అజ్ఞానుల యెడల తెలిసినవాళ్ళు చూపే పెద్దరికపు ఠీవీ ఒలక బోస్తూ 'చూశారా మరి...మూడు నిండితే అర టికెట్ కొనాల్సిందే...రూల్స్...ఇక్కడ ఫరవాలేదు గాని పైకిపోతే అక్కడ చెకింగు గట్టిగావుంటుంది. పిల్లవాడి వయస్సడిగితే మూడో సంవత్సరం అని చెప్పండి...' అని సలహా యిచ్చాడు వుదారంగా. కాస్త పెద్దపిల్లలకు అరటికెట్ కొనాలని తెలిసినా మరీ మూడేళ్ళకే కొనాలన్న విషయం బాగా ప్రకటించనందుకు రైల్వేవాళ్ళమీదా, తెలుసుకోనందుకు తన మీదా చీకాకు కలిగింది సుశీలకు. కాని ఆ విషయంలో టీసీ నానాహంగామాచేసి పైన వేయనందుకు చాల సంతోషించింది. 'అలాగేనండి...' అంటూ తల వూపింది కృతజ్ఞతతో. ఎదుటి సీటామె టికెట్ చూసి వెళ్ళిపోయాడు టీసీ.

ఆమె లేచి సామాన్లు సర్దుకోవటం ప్రారంభించింది. 'మీరు దిగిపోతే నే నొక్కర్తెనే అయిపోతాను... నే రెవరైనా ఎక్కుతారో లేదో' అన్నది సుశీల. 'ఎవరూ లేకుంటే మగవాళ్ల పెట్టెకు మార్చుకోండి. కాలం మంచిదికాదు' అన్నదామె. ఆమె దిగిపోయాక డోర్నకల్‌వరకూ ధైర్యం చిక్కబట్టుకొని తలుపులూ కిటికీలూ వెయ్యి కళ్ళతో చూస్తూ కూర్చుంది సుశీల. అక్కడా క్రొత్తవాళ్లెవరూ ఎక్కలేదు. అప్పుడు కూలీని పిలిచి సామాన్లతో మగవాళ్ల పెట్టెలోనికి మార్చుకున్నది.

మగవాళ్ల పెట్టెలో రద్దీ జాస్తిగా వున్నది. నిద్ర విషయంలో ఆశ వదిలేసిన వాళ్లలా అందరూ గుంపులుగా కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఒక సీట్లో ముగ్గురు మగవాళ్ల ప్రక్కగా కిటికీ దగ్గరగా చోటు దొరికింది సుశీలకు. వాళ్లకూ తనకూ మధ్యగా బాబును కూర్చోబెట్టి తాను కిటికీ ప్రక్కగా కూర్చున్నది. బాబుకు నిద్ర ముంచుకొస్తున్నది. సుశీలకు ఏంచెయ్యాలో తోచలేదు. ఇంతలో బాబుప్రక్కనున్నాయన 'ఎక్కడన్నా ఖాళీ వున్నదేమో చూసొస్తాను' అంటూ ప్లాట్‌ఫారంమీదికి దిగి వెళ్లాడు. రెండు నిముషాల్లో తిరిగి వచ్చి 'ప్రక్కన ఆడవాళ్లపెట్టె ఖాళీగా వున్నది. ఎవరైనా వచ్చి దింపేవరకూ అక్కడ హాయిగా పడుకోవచ్చు' అని ప్రక్కనున్నాయనతో చెప్పాడు. ఇద్దరూ చేతి సంచులు పుచ్చుకొని దిగి వెళ్లిపోయారు. ఒక్క క్షణం అయినా వృధాచెయ్యకుండా ఖాళీఅయినచోటులో హోల్డాలు పరిచేసింది సుశీల. సీట్లో ఆ చివర్న మిగిలిపోయి నతను కొంచెం కోపంగా చూసి మొహం తిప్పేసుకున్నాడు. మాటల్లో మునిగివున్నవాళ్లలో కొందరు కూడా తిరిగి చూశారు. 'ఆడవాళ్ల అఘాయిత్యం యిల్లా వుంది' అన్నభావం అంతటా కన్పించింది సుశీలకు. అయినా లెక్కచెయ్యకుండా నిద్రతో తూలుతున్న బాబును సుఖంగా పడుకోబెట్టి ప్రక్కన కూర్చొని విసరటం ప్రారంభించింది. బాబు నిద్రపోయాడు. సీట్లో ఆ చివర కూర్చున్నతను కునికిపాట్లు పడుతూ వుండుండి తల విసురుగా ముందుకు వాలిపోతుంటే సర్దుకుంటున్నాడు. ఎదుటిసీట్లోవాళ్ల కిటికీలో తల పెట్టుకొని ఒకరూ, ఒళ్లోవున్న సంచీమీద ముఖం ఆనించుకొని ఒకరూ కునుకుతీస్తుంటే మూడో ఆయన ఆ గుడ్డివెలుతురులో ఏదో పుస్తకం చదువను ప్రయత్నిస్తున్నాడు. బాబును కాస్త ఒత్తిగించి ప్రక్కనే పడుకుంది సుశీల. రైలు కుదుపుకు హాయిగా నిద్ర పట్టేసింది.

నిద్రలోని నిశ్శబ్దంలోనుండి ఏదో గందరగోళంలోనికి మెలకువ వచ్చినట్లయింది. బయటి చీకటీ, పెట్టెలోని గుడ్డిలైట్లూ అలాగే వున్నై. రైలు ఆగివున్నది. 'కాజీపేట...కాజీపేట' అంటున్నారు. ఆ వైపున ప్లాట్‌ఫారంమీద మసగ వెలుతురులో మనుష్యులు నడుస్తున్నారు. 'గరమ్ చాయ్... చాయ్...చాయ్' అన్న కేకలు విరామం లేకుండా విన్పిస్తున్నాయి. 'హాట్‌చాయ్...వన్ పాట్' అంటూ ఎవరో అవతలి సీట్లోంచి ఆర్డరిచ్చారు. పెట్టెలోని మనుష్యులందరూ మాట్లాడుతున్నట్లుగా సందడిగా వున్నది. సుశీల లేచి కూర్చున్నది. సీట్లోని ఆ చివరాయన సంచీ పట్టుకొని కునికిపాట్లు పడుతూనే వున్నాడు. ఎదుటి సీట్లోనివాళ్లు నిద్రాభారంతో ఎర్రబడ్డ కళ్లను మూస్తూ తెరుస్తూ అప్పుడప్పుడు ఒక్కోమాట మాట్లాడుకుంటున్నారు నెమ్మదిగా. ప్లాట్‌ఫారంవైపుగావున్న పొడుగాటి పై బెర్త్‌మీద హోల్డాలులు పరుచుకొని వున్నవాళ్లు యిద్దరు

పెద్దగా మాట్లాడుకుంటున్నారు. సంభాషణను బట్టి యిద్దరూ డాక్టర్లని గ్రహించింది సుశీల. 'కాలేజ్‌లో నీ Performance బట్టి ఎంతో పైకి వస్తావనుకున్నాం. పల్లెటూరి డాక్టరువైపోతావనుకోలేదు. సర్జరీ ప్రొఫెసర్ నిన్ను చాల మెచ్చుకునే వారు' అన్నాడు సన్నగా చామనచాయలోవుండి కళ్లజోడు పెట్టుకున్నాయన. మంచితనంతోపాటుగా జీవితంలో యిహ తెలుసుకోదగ్గదేమీలేదన్న నిర్లిప్తత కనిపిస్తున్నది అతని మొహంలో. జుట్టు సగం తెల్లబడిపోయింది. అతని బట్టలు అప్పుడే మంచిచాకలి తెచ్చియిచ్చినవాటిలా మెరుస్తున్నవి. మనిషి శుభ్రంగా వున్నాడు.

పల్లెటూరి డాక్టరు కొంచెం బొద్దుగా పొట్టిగా వున్నాడు. శరీరం తెల్లగావుండి లైటు వెల్తురులో మెరుస్తోంది. బట్టలు తెల్లగావున్నా నలిగివున్నాయి. సోమరిగా దిండుమీదకు సగం వాలి సిగరెట్టుపొగ వదిలి పెద్దగా నవ్వాడు మిత్రుడి మాటలకు. 'నాకేం లోటు వచ్చిందంటావ్? సుఖంగా వున్నాను...మూడువాళ్ల ముచ్చటలాంటి బ్రతుకును Ambition లో మసిచేసుకుని సరదాలేకుండా బ్రతికాలని యిష్టంలేదు' అన్నాడు ఆప్యాయంగా స్నేహితుణ్ణి చూస్తూ...

పొడుగాటి కిందబెర్తులో అవతలి 'సగం ఆక్రమిస్తున్న ముగ్గురు మనుష్యులు చర్చలో మునిగివున్నారు. ఈ చర్చ నిద్రను జయించే ప్రయత్నమైతే అది నెరవేరిందనే చెప్పాలి. అప్పుడప్పుడు ఆవలింతలు రావడం మినహాగా వాళ్ల మాటల్లోగాని మొహాల్లోగాని నిద్రతాలూకు ఛాయలేమీ లేవు. 'గురువుగారికి నియమనిష్ఠలూ ఆచారంమీద పట్టింపూ వున్నాయి. వర్ణాశ్రమధర్మాలు ప్రధానం అంటారు...' అన్నాడు పొడుగ్గా సన్నగా తెల్లగా వున్నాయన కనుబొమ ఎగరేస్తూ. పొట్టిగా లావుగావుండి కాషాయబట్టలు ధరించిన ముసలాయన క్రిందికి చూస్తూ 'నారాయణ...నారాయణ...' అని తలూపాడు. వాళ్ల మాటలన్నీ శ్రద్ధగా వింటున్న మూడో అతను 'మా వూరి ఆశ్రమంలో అమ్మగారున్నారు. ఆమెకు యీ ఆచారాల పట్టింపులేదు. కులాల పట్టింపూలేదు. అక్కడ అందరికీ ఏకపంక్తి భోజనమే...' అన్నాడు. ఇంకా చెప్పబోతూవుండగా మిగతా యిద్దరూ సాభిప్రాయంగా ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. అనాసక్తతను వ్యక్తపరుస్తూ పొడుగాటాయన ఆవులించాడు. మూడో అతను యిది గమనించి 'ఆమె సాక్షాత్తూ ఆదిశక్తి అంటున్నారు...' అని ముగించి కాళ్లు సర్దుకున్నాడు. అప్పుడు అతని కాళ్లను గమనించి ఆశ్చర్యపోయింది సుశీల. అతని కాలు ఒకటి రెండోదానికి రెట్టింపు లావులో వున్నది. దానిమీద గుడ్డ కప్పుకున్నాడు. బోదకాలైతే పాదంవరకో మోకాలువరకో వుబ్బటం చూసిందిగాని యిలాగ కాలు కాలంతా ఒకేలావు కావటం చూడలేదు. సుశీలకు అతనిమీద జాలి కలిగింది. 'పాపం, ఆ కాలు ఎలా మోస్తున్నాడో' అనుకున్నది. వాళ్లు మళ్లీ గురువుగారి కబుర్లలో పడిపోగా లావుకాలతను వాళ్ల మాటలను శ్రద్ధగా వింటున్నాడు...

అదే సీటులో యింకో వైపున ఇద్దరు స్టూడెంట్సు కాబోలు సినిమాల గురించి మాట్లాడుతున్నారు!

కొంచెం ముందరగావున్న చిన్నసీట్లో యిద్దరున్నారు. ఒకతను నిద్రలేక ఎర్రబడ్డ కళ్లతో దీనంగా వున్నాడు. సీట్లో చాలీచాలని చోటులో యిరుక్కొనికూర్చున్నాడు. మిగతాచోటంతా హోల్డాలుపరుచుకొని దానిమీద కూర్చొని వున్నతను ముందర షేవింగు సామాన్లు పరిచిపెట్టుకొని మొహంనిండా దట్టంగా సబ్బు పట్టించి, తెల్లటి సబ్బు నురగలోనుంచి మాట్లాడుతున్నాడు. నలభైఏళ్లకు పైవయసులో లావుగా నల్లగావున్నాడు. హాయిగా నిద్రపోయిలేచినట్లున్నాడు. నిద్రలేక బాధపడుతున్న మనిషితో వుత్సాహంగా పెద్దగా వెయిన్‌కోట్ దొరగారిగురించి చెబుతున్నాడు. మాటల్లో యితనిపేరు జేకబ్ అని తెలిసింది. 'క్రైస్తవమత ప్రచారకుడిలావున్నాడు' అనుకున్నది సుశీల. రెండో అతను నిద్రపోనూలేక పోకుండానూలేక సతమతమౌతూ యితను చెబుతున్న దానికి బాధగా తలూపుతున్నాడు

ఇంతలో 'టీ, సర్' అన్నారు బయటనుండి. పొడుగు సీట్లోని స్టూడెంటు 'ఇల్లా తేవోయ్' అన్నాడు. జేకబ్ ఆత్రంగా 'నేను ఆర్డరిచ్చింది... Bring it here...Is it hot?' అన్నాడు. బేరర్

'yes, sir' అంటూ ట్రే తెచ్చి అతని ముందు పెట్టాడు. జేకబ్ మాటలూ చేష్టలూ రూపమూ చూస్తుంటే సుశీలకు చీకాకుపుట్టింది. 'ఆ సబ్బు నురగలోంచే పాచి నోటితోనే తాగేస్తాడు కాబోలు!' అనుకుంది విసుగ్గా. అల్లాగే ఒకచేత్తో రేజర్‌పట్టుకొని రెండోచేతిలోని కప్పులోని కాఫీని చప్పరిస్తూ నిద్రలేకుండా యిరుక్కు కూర్చున్నతనితో అమెరికాలోని లూథరన్‌మిషన్‌చేస్తున్న సేవను తనే చేస్తున్నట్లుగా చెప్తున్నాడు జేకబ్.

సుశీలకు విసుగేసి కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. హైదరాబాదు దగ్గరకు వస్తున్నదంటే మనసంతా కలవరమై పోయింది. ఎంత పోట్లాడి మొండిగావచ్చేసింది తాను! అత్తగారిని స్వగ్రామానికి పంపించేస్తేకాని యింట్లో వుండనని పంతంపట్టి వచ్చేసింది. తరువాత ఏం జరిగిందోగాని ఆమె వెళ్ళిపోయిందని వ్రాశాకనే తాను తిరిగి బయల్దేరింది! భర్త స్టేషన్‌కువస్తే మొహం ఎలా చూపేదా అని మథనపడసాగింది సుశీల. ఆమెకు కొడుకు తప్పించి వేరే సంతానంగాని కావాల్సినవాళ్ళుగానిలేరు. అలాగని కొంచెం సరుకుపోవచ్చునా? అలాంటిదేమీలేదు. తనకెంతతోస్తే అంత! ఆవిడకి మంచీచెడ్డా, నిజం అబద్ధం, నీతినిజాయితీలాంటివేవీ లేవు. తాననుకున్నది జరగటం తప్పించి మరే నియమాలూ ఆమెకులేవు. అబద్ధాలు మంచినీళ్ళ ప్రవాహంలా దొర్లుకొస్తాయి ఆమె నోట్లోంచి. కాన్వెంటు వాతావరణంలో క్రమశిక్షణలో నిజంలో నిజాయితీలో పెరిగిన సుశీలకు యిది ఏమాత్రం సరిపడలేదు.

చాకలిబట్టలు చించుకొస్తున్నదని ఆమెకు కోపంగా వున్నది. దాన్ని మానిపించి వేరే చాకలిని పెట్టమన్నది. చాకళ్ళందరూ అలానేవున్నారనీ, మార్చినందువలన కలిగే లాభం ఏమీలేదనీ కొడుకు చెప్పినది ఆమెకు నచ్చలేదు. అసలే ఆలస్యంగా బట్టలు తెచ్చిన చాకలిని 'పద్దు కనపడలేదు, రేపు రమ్మని' పంపించివేసి, కొడుకు యింటికిరాగానే 'ఆ పాడు చాకలి యింకా బట్టలు తేలేదురా...మరీ యింత అన్యాయమైపోతే ఎలా...వేరే చాకలినిపెట్టుకుంటేగాని కుదరదు' అంటూ సాధింపు ప్రారంభించింది.

ప్రక్కింటి సుందరమ్మగారికీ యీమెకూ సరిపడదు. వాళ్ళ పాలమనిషి మంచిది. మిగిలిపోయిన పాలన్నీ రోజూ వూరికే 'కొసరు' పోసేసి వెళ్తుంది. అది యీమెకు సహించరానిదైంది. ఆ పాలమనిషిని చాటుగా పిలిచి 'నీకు తాంబూలానికి రోజూ ఒక అణాయిస్తానుగాని మిగిలిపోయిన పాలు మాకు పోసి వెళ్తూండు' అనడిగింది. ఆ విషయం తెలిసి సుందరమ్మగారు సుశీలకు ఫిర్యాదుచేసింది...ఇలాగ ప్రారంభమైంది అత్తా కోడళ్ళ మధ్య కలత. ఇదేమని అడిగితే అలిగిపడుకుంటుందిగాని తన బుద్ధి మార్చుకోదు, తెలుసుకోదు. సుశీల స్నేహితులతో 'మాకు వందెకరాల మాగాణి వున్నద'నీ 'లంకంత యిల్లు వున్నద'నీ చెప్పింది. అసలు విషయం ముందుగానే సుశీలద్వారా వినివున్నవాళ్ళు చాటుగా నవ్వుకోవటం, ఆమెచేత యింకా అబద్ధాలు చెప్పించాలని ప్రయత్నించటం సుశీల గమనించింది.

ఒకనాడు సుందరమ్మగారు పెద్ద స్టీలు గిన్నె పోయిందని తెగ వెతుక్కున్నారు. అత్తగారు బయటే తీరుబాటుగా కూర్చొని 'యింట్లోనే ఏమూలో వుంటుంది, సరిగా చూసుకోండి' అన్నది కూడాను. రెండురోజుల తరువాత సుశీల చాకలికి బట్టలు వెయ్యడానికి వెడితే బట్టల క్రిందవున్నది ఆ స్టీలు గిన్నె. సుశీలకు చాలాకోపంవచ్చింది. 'ఆ గిన్నె మన వాకిట్లోపడవేసివున్నది. అంత అశ్రద్ధ అయితే ఎల్లాగంట? రెండురోజులు వెతుక్కుంటే బుద్ధి వస్తుందని దాచేనులే' అన్నది అత్తగారు. దానిమీదట రభస అయి ఆమెను స్వగ్రామం పంపిస్తేగాని యిక్కడ వుండలేననీ, యీ అబద్ధం కుత్సితాలు భరించలేననీ మొండికెత్తింది సుశీల. 'ఎల్లాగో సర్దుకోవాలిగాని ఆమె ఎక్కడికిపోతుంది? కోరుకున్నట్లుగా లేదని ముక్కుకోసేసుకుంటారా? మన బాబుకే అబద్ధాలు అబ్బితే ఏం చేస్తావ్?' అన్నాడు భర్త. 'నాబిడ్డ అలాంటివాడు ఎన్నటికీ కాదు'అన్నది సుశీల. 'మన మంచి కోరేవాళ్ళు మనల్ని కావాలనుకునేవాళ్ళు అభిమానించేవాళ్ళు యింకెవరూ లేరని గుర్తుపెట్టుకో. ఆమెను వెళ్ళమని నేను చెప్పను' అన్నాడు భర్త. వీళ్ళవాదనంతా విన్నదో లేదోగాని 'వంటయింది, భోజనానికి రండి' అని పిలవొచ్చింది ఆమె.

ఆమెకు కొడుకన్నా మనుమడన్నా ప్రాణమని సుశీలకూ తెలుసు. ఒక హద్దంటూలేని అబద్ధాలూ అల్పబుద్ధీ సుశీల ఏమాత్రం భరించలేకపోయింది. ఆ వంతంతోనే పుట్టింటికి వచ్చేసింది. ఇప్పటికీ ఎంత ఆలోచించినా సుశీలకు తన ప్రవర్తనలో తప్పు తోచటంలేదు. అయినా యిలా జరగవలసివచ్చినందుకు మనసంతా చీకాగ్గా మాత్రంవున్నది...

రైలు వేగంగా పరుగెడుతోంది. జేకబ్ షేవ్ చేసుకోవడం పూర్తయిపోయింది. నిద్రలేక బాధ పడుతూ యిరుక్కు కూర్చున్న మనిషితో బైరాగులను గురించీ దొంగసన్యాసులను గురించీ మాట్లాడుతున్నాడు పెద్దగా. 'ఒక దినం నేను ఎక్కిన కంపార్టుమెంటులో నలుగురు సాధువులు ఎక్కారు. వాళ్ళు ఏదేదో గొప్ప వేదాంత చర్చలు చేస్తున్నారు. ఆత్మజ్ఞానం అంటూ మాట్లాడుతున్నారు. ఇంతలో టీసీ ఒచ్చాడు. టీసీని చూడగానే వేదాంతం ఆత్మజ్ఞానం ఎక్కడికిపొయ్యాయో మరి దొంగచూపులు చూస్తూ నోరు మూసుక్కూర్చున్నారు. బైరాగివాళ్ల దొంగవేదాంతం అందరికీ తెలిసిందేగా. దరిదాపుల్లో వూరులేనిచోట మధ్య దారిలో రైలాపి వాళ్లను దించేశాడు టీసీ. పక్కస్టేషన్‌లోనైనా దింపమని బతిమాలారు. మళ్లీ మాట్లాడితే గంజాయితోసహా కొట్లో తోయిస్తానన్నాడు టీసీ' అంటూ పెద్దగా నవ్వాడు. హిందూమతంమీద క్రిస్టియానిటీ ఆధిక్యత నిరూపించినట్లుగా గర్వపడిపోతూవున్నాడు.

జేకబ్ మాటలు విన్నట్లూ విననట్లూ కాకుండా అందరూ తగ్గుస్వరాల్లో నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. అతను సబ్బు నురగలోంచీ కాఫీతోపాటుగా నోట్లోని పాచి వంతటినీ మింగాడని గుర్తొచ్చి అసహ్యంవేసింది సుశీలకు. తన మతంలోనిదీ ఆచారంలోనిదీ మంచీ చెడూ తెలియని వాడు, ఇతరులదంతా గొప్పని భ్రమించేవాడు— రాజావేషం వేసుకున్న వీధిభాగవతుడు తానే రాజాననుకున్నట్లుగా ప్రవర్తించేవాడు - నల్లదొర! — అలోచించినకొద్దీ అతనిమీద చాలాకోపం వచ్చింది. ఒకరిలో తప్పులెన్నగలశక్తి యీతని కెక్కడిది అనుకున్నది.

జేకబ్ తన పాయింటుకు తానే మురిసిపోయాడు. ద్విగుణీకృతోత్సాహంతో 'అసలు యీ దేశంలో అందరూ అంతే...ఒకప్రక్క సన్యాసులూ యింకోప్రక్క దొంగమంత్రాల బ్రాహ్మలూ' అన్నాడు చుట్టూ చూశాడు. ఎవరూ మాట్లాడలేదు, నవ్వనూ లేదు. అందరూ మాటలు మానేసి చూస్తున్నారు. రైలురొద తప్పించి మరే శబ్దంలేదు. కనీసం ఆ వేదాంత చర్చలు చేసేవాళ్లయినా సమాధానమిస్తారేమోనని చూసింది సుశీల. ఇహ వూరుకోలేకపోయింది.

'ఇందాకట్నుంచీ చూస్తున్నాను. సాధువులు, సన్యాసులు, దొంగబ్రాహ్మలూ అంటూ వూరికే మాట్లాడుతున్నారు. సాధువులూ, సన్యాసులూ అందరూ అబద్ధాలు చెప్తారనీ పనికిమాలినవాళ్లనీ మీ వుద్దేశ్యమా? మంచీ చెడ్డా అన్నిచోట్లా వున్నై. మీ కాన్వెంటుల్లో వుండేవాళ్లంతా వున్నత గుణాలు కలవాళ్లేమీ కాదు. Judge not others lest ye be judged...' అన్నది పెద్దగా.

జేకబ్ మాట్లాడలేదు. సుశీలవైపు చూడను కూడా లేదు. ప్రక్కనున్న మనిషికేసి చూసి నవ్వాడు కనుబొమలు ఎగరేస్తూ.

సుశీలకు ఈసారి చాలాకోపం వచ్చింది. వుద్రేకంతో ఒణుకుతున్న గొంతుతో 'అతిపవిత్రమైన మీ కాన్వెంట్లను నే నెరుగుదును. అబద్ధాలూ కుత్సితమూ చాడీలూ రాజ్యం చేస్తాయి అక్కడ. సిస్టర్లమంటూ వేషం వేసుకున్నవాళ్లకు కుళ్ళుబుద్ధి లేమీ మారవనీ తెలుసు. వాళ్లకంటే బైరాగులు ఎక్కువేమీ లేదు!...' అంటూ అరిచింది.

ఈసారికూడా జేకబ్ సమాధానమివ్వలేదు. ఈ మాటలు లెక్కచెయ్యనట్లుగా ప్రక్కనున్నతనితో చిన్నగా మాటలు ప్రారంభించాడు.

సుశీలకు అవమానంతో మొహం ఎర్రబడింది. ఇంకేంచెయ్యాలో తోచలేదు. పెట్టెలో అందరూ మాటలు మానేసి శ్రద్ధగా సుశీలమాటలు విన్నారు. అందరూ తననే బలపరుస్తున్నట్లుగా, తనవైపు సానుభూతి కలిగివున్నట్లుగా తోచింది సుశీలకు. 'అసలు నేను యీ మనిషితో వాదించి వుండకూడదు.

ప్రచారంచేసేవాళ్ళు మరీ low types' అనుకున్నది. ఓమూలనుంచీ తాను ఎక్కువగా గౌరవించి ఇష్టపడిన సిస్టర్స్ జ్ఞాపకంవచ్చి మనస్సు చివుక్కుమన్నది. తనమాటలు తనకే అబద్ధంగా తోచాయి. కాని అదంతా ప్రక్కకునెట్టింది. 'సిస్టర్స్‌గావుండీ వీళ్ళ క్రోధ లోభ మాత్సర్యాలు ఒదల్లేదు, ఛీ' అని తాను ద్వేషించిన కొందరినిమాత్రం దృష్టిలో పెట్టుకున్నది. మనసులో కొరతవున్నా కోపంలో తన వాదనను సమర్థించుకోవటానికిగాను సగం నిజంమీదే ఆధారపడి మాట్లాడింది సుశీల. జేకబ్ ప్రవర్తనా, ఆలోచనా, రూపమూ అన్నీ వికారంగా కన్పించాయి సుశీలకు. ఇతర్లలో అన్యాయంగా తప్పులు వెతుకుతూ నిరాధారంగా నిందించే వాళ్ళంటే సుశీలకు అసహ్యం.

టీసీ ఆప్రక్కనుండీ టికెట్లు చూచుకుంటూ వస్తున్నాడు. ఈ మాటల మధ్యలో బాబు ఎప్పుడో లేచి కూర్చున్నాడు. 'మనూరు ఏదమ్మా...నాన్న కావాలి' అన్నాడు. వాడికి మాటలు త్వరగా రావటమే కాకుండా స్పష్టంగా కూడా వస్తున్నాయి. టీసీ ఒచ్చాడు: 'మనూరు దగ్గరకొచ్చేసిందిలే' అంటూ పర్సులోంచీ టికెట్‌తీసి చూపించింది. 'అబ్బాయి కెన్నేళ్ళు?' అన్నాడు. బెజవాడదగ్గర టీసీ చెప్పిన సలహా జ్ఞాపకం వచ్చింది. 'మూడోఏడు' అన్నది గభాల్న. 'కాదు...ఆ అబ్బాయి అయిదేళ్లవాడిలా కన్పిస్తున్నాడు....ఫైన్‌తో టికెట్ తీసుకోవాలి' అన్నాడు టీసీ ఖచ్చితంగా. 'అబ్బాయికి మూడోఏడని చెప్పలేదూ...' అన్నది సుశీల తలప్రక్కకు తిప్పేసుకుని. అబద్ధం చెబుతున్నందుకు కించకలిగింది.

పెట్టెలోవుండే వాళ్ళంతా తననే చూస్తున్నట్లనిపించింది. జేకబ్ నవ్వుకుంటున్నట్లనిపించింది. టికెట్ తీసుకోకుండా రైలెక్కిన సాధువులు మనసులో మెదిలారు. ఇంత అవమానకరమైన పరిస్థితిలో ఎలా చిక్కుకున్నాను! అనుకుంది ఆశ్చర్యంగా, అవమానంతో క్రుంగిపోతూ. తానబద్ధం చెబుతోందో లేదో కూడా తెలియలేదు. అసలు అబద్ధం చెప్పవలసిన పరిస్థితి ఎందుకువచ్చిందో సరిగ్గా అర్థంకాలేదు. మనసు అల్లకల్లోలమూ అనిశ్చితమూ అయింది.

టీసీ గట్టిగా మాట్లాడుతున్నాడు. 'మీరు తల్లి గనుక ఏంచెప్పినా చెల్లుతుంది. కాని నిజమేమిటో మీ మనసుకు తెలుసు. ఆ అబ్బాయికి అయిదేళ్ళు. మీరు కాదంటే నేనేం చెప్పగలను!' ఒక్కొక్కమాట ఒక్కొక్కసమ్మెటపోటులావుంది. ప్రపంచమంతా ఒకటై 'అబద్ధం' అని నవ్వుతున్నట్లనిపించింది.

పెట్టెలోనివాళ్ళంతా నిశ్శబ్దంగా వింటున్నారు. ఈసారి సుశీలకు సమాధానం చెప్పాలని అనిపించలేదు. ఒక మనిషిని అనుమానించడం ఒక్కొక్కళ్ళకెంత సరదాగా వుంటుందో అనుకుంది నిస్సహాయంగా వింటూ. ఆ జేకబ్ ఏమి వాగినా అందరిలా నోరు మూసుకొనివుండక తగుదునమ్మా అంటూ వాదనకు దిగవలసినపని తాను ఎందుకు చేసింది! అని తనను తానే తిట్టుకున్నది.

చెప్పాల్సిందంతా చెప్పేసి టీసీ వెళ్లిపోయాడు. కిటికీలోంచీ బయటకు చూస్తూ కూర్చుంది. పెట్టెలోనికి మొహం తిప్పలేక పోయింది సుశీల. 'టికెట్ లేని సాధువులకథ కంటే యింకా రసవత్తరంగా ప్రతిప్రయాణంలోనూ అందరికీ యీ కథ చెప్తాడు కాబోలు నల్లదొర! అందరి దృష్టిలోనూ ఎంత అపహాస్యంపాలై పోయేను!' అనుకుంటే కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. బలవంతాన ఏడుపు బిగబట్టుకుని కూర్చుంది.

కిటికీ బయటగా వేలా చెట్లూ కుప్పలూ టెలిగ్రాఫ్ స్తంభాలూ అన్నీ Straight line లో వెనక్కు పరుగెడుతున్నాయి. 'నా నీతిలాగా, నా పరువులాగా' అనుకున్నది సుశీల. 'నీ ఆలోచన ఎప్పుడూ Straight line లో వుంటుంది. జీవితం అలా వుండదు' అన్నాడు భర్త ఓసారి మాటల్లో...

'ఆ పనికిమాలిన వాదన చెయ్యకుండా వుండివుంటే!' అనుకుంది పదిసార్లు. 'తగుదునమ్మా అని ఎంతగా మాట్లాడింది!' అని అందరూ నవ్వుకుంటారన్న స్పృహ చాల బాధకలిగిస్తోంది. 'నేను అబద్ధం చెప్పేనా? నిజమేమిటి? అబద్ధమేమిటి? ఒక్క నెలముందు వాడికి మూడోఏడు. ఇప్పుడు కాదు. నిజానికీ అబద్ధానికీ తేడా ఏమిటి?' అనుకుంది సందేహంగా చెదిరిపోయిన మనస్సులో.

పెట్టెలో అందరూ ఒక్కసారిగా మాట్లాడటం ప్రారంభించారు. విర్లిప్తంగా వింటూ కూర్చుంది సుశీల.

'డయాబిటిస్ తగ్గటమేమిటి! ఆరేళ్ళు చదివిన వైద్యమంతా ఏంచేశావ్?' అన్నాడు పై బెర్తుమీది సన్నటి డాక్టరు.

రెండో డాక్టరు నవ్వాడు. 'నేను డాక్టరు కాకముందు విషయం యిది. నాన్నగారిని ఒకరు కాదు యిద్దరు డాక్టర్లు పరీక్షించి డయాబిటిస్ అని తేల్చి చెప్పారుట. డయట్‌లో శ్రద్ధ తీసుకుని నాలుగేళ్ల తర్వాత మళ్లీ చూపించుకుంటే లేదన్నారట...తర్వాత ఆయన స్వేచ్ఛగా అన్నీ తింటూనే వున్నారు. నాకు తెలిసి యింకా ముగ్గురికి యిలానే జరిగింది' అన్నాడు.

'నాన్సెన్స్.....అంతా లూస్‌టాక్.....అసలు డయాబిటిస్ కాదేమో. అది ప్రొగ్రెస్సివ్ కండిషన్ అని తెలిసీ అలాంటి మాటలు నమ్ముతావా! ప్రైన్ ఏమన్నాడో మరచి పోయావా' అన్నాడు మొదటి డాక్టరు.

'ప్రైన్ ఏమన్నా అనసీ, అదంతా ఏకారణం వలన వచ్చిందో ఆ కారణంగానే పోవచ్చును. మనిషిని బట్టి శాస్త్రం వచ్చిందా లేక శాస్త్రం ప్రకారం మనిషి వుంటాడా...' రెండో డాక్టరు తన అభిప్రాయం చెప్పాడు ఆవులిస్తూ...

క్రింది బెర్తులో ఆచివర కూర్చున్నవాళ్ళు ముగ్గురూ మళ్లీ వేదాంతం మొదలెట్టారు.

'మా వూరి ఆశ్రమంలోని అమ్మగారు భావం నశించిన శుష్కమైన నియమనిష్ఠలవలన ప్రయోజనం లేదన్నారు. మంత్రోపాసన యీ కాలధర్మంలో అనర్థాలకు దారితీస్తున్నదన్నారు...ఇహ ముక్తి మార్గం ఏమిటమ్మా అనడిగితే అంతా ఆ భగవంతుడే చూచుకుంటాడు అన్నారు' లావుకాటిమనిషి అన్నాడు.

తెల్లగా పొడుగ్గా వుండే మనిషి వినుగ్గా 'ఏమిటయ్యా నీవనేది? సాధన ఏమీ చెయ్యకుండానే ముక్తి దొరుకుతుందనా? నియమనిష్ఠలు పాటిస్తూ సాధనచేసి ఎన్నోజన్మలెత్తి పరోపకారాది సద్గుణాలు పొంది బ్రతుకే ఒక తపస్సుగాచేస్తే తప్ప భగవద్దర్శనంకాదు...' అన్నాడు.

కాషాయబట్టలతను 'నారాయణ...నారాయణ...' అంటూ జపం ప్రారంభించేడు.

లావుకాటి మనిషి యింకా సందేహంగానే 'నియమ నిష్ఠలవల్ల అనుగ్రహం లభించి తీరుతుందంటారు. అప్పుడిహ అనుగ్రహం ఏమున్నదీ! నియమనిష్ఠలే దేవుడు!... అయినా భగవంతుడు సులభసాధ్యుడనీ భక్తవత్సలుడై వున్నవాడనీ అంటారే, ఇంత కఠినుడంటారా...ఆయన తలచుకుంటే యివన్నీ లేకుండానే అనుగ్రహించడా?' అన్నాడు.

మొదటివ్యక్తి అసహనంతో 'ఏమిటయ్యా నీ గొడవ...భగవంతుడు ఇహనుండీ పద్ధతి మార్చుకొని అల్లాటప్పగాళ్లకే ప్రత్యక్ష మౌతాడనేట్లున్నావు' అని కసురుకున్నాడు.

ఇంతలో ఓవా చివర కూర్చున్న స్టూడెంట్సు పెద్దగా నవ్వారు ఎందుకో. 'బారాహాత్ వెళ్లి దో అంఖేతో చూసి ఇనపగొలుసులు తెచ్చి కాళ్లమీద వేసుకున్నాకనే నిద్రొచ్చింది...' ఒకబ్బాయి హాస్యంగా అన్నాడు...

పెట్టెలోని మనుష్యులందరూ వుత్సాహంగొంగా మాట్లాడుతున్నారు. ఆ మాటలన్నీ తల త్రిప్పకుండా వున్న సుశీల చెవుల్లోంచీ దూరి మనసులో నాట్యం చేస్తున్నాయి. ఇంతవరకూ ప్రపంచం తనమీద మోపిన భారమంతా పోయి మనసు తేలికైనట్లు, ప్రపంచం గాలిలో తేలిపోతున్నట్లు అనిపించింది. 'నిజమేమిటి? అబద్ధమేమిటి? నేను అబద్ధంకాదు!' అనుకున్నది. కళ్ళుపైకెత్తి దూరానికి చూచింది. అప్పుడే సికింద్రాబాదు వచ్చేసినట్లుంది. ఇళ్లూ మేడలూ ప్రపంచం అంతా వుదయకాంతిలో స్పష్టమైన ఆకారాలు ధరించి అందంగా ఆర్లిబిర్లి తిరుగుతున్నాయి.

రైలాగింది. ప్లాట్‌ఫారం మీదినుండీ అత్తగారు ఆత్రంగా లోనికి చూచి 'అదేమిటమ్మాయ్! ఇంకా

చిన్ని దీపాలు

శ్రీ నూతలపాటి గంగాధరం

వంచనను ప్రమిదచేసి మంచిని వెలిగించి
వాడు వెలుగజేయువాడె నరుడు!

ఆశలేకయున్న ఆశయమే లేదు
ఆశయమ్ములేక అవనిలేదు!

కండలందు పిఱికి; గుండెలందు కళుకు
ఉండెనేని బ్రతుకు పండబోదు.

వరములందు మేటి వరమౌను నరజన్మ
నరుల మేలుకోరు బ్రతుకు బ్రతుకు!

రెక్క మొలిచినపుడు రిక్తపాదము లేల?
నాణ్యమున్న ఏల నగల ప్రశ్న?

శ్రమకు ఓర్పితేని శాంతిదేవత నీకు
పెదవి నిచ్చు—మోక్షపదవి నిచ్చు!

శివుని మెచ్చె విసపుచిచ్చు; సజ్జనులకు—
మేలు కూర్చుగాదె మిత్తికూడ

మట్టి—చెట్టుకూడ మార్పును చెందునా
మనిషి మారడెట్లు మట్టిబుట్టి!

సన్నతీగమీద సాము చేసెడివాడు
మురియడేమి అదియె ముక్తియంచు?

నీరులేక పైరు నిలచి పండనియటు
బ్రతుకు—ఆశలేక పండునెట్లు?

కోర్కె లేనివాడు; క్రొత్త కోరనివాడు;
వలపెరుగనివాడు నిలనుగలడె?

తెనుగు వాల్కు వాకు తేనెకన్నను తీపి
ఎవని వాల్కు వాని కిలను తీపి!

తిండి యున్నవాడు తీపి యన్నిటనుండు
తిండి లేనివాడు దేనతీపి?

విప్లవమ్ము వెన్క వెల్గురేకలు చూడు
వేదనమ్ము వెన్క వెలికి పాడు!

ఇరులు గ్రుడ్లుపెట్టి విరిగి నపుడకాదె
వెలుగు పులుగు రెక్క విప్పునెపుడు!

కైతలందు శ్లేష—కతల నెన్నియొ తెల్పు!
బ్రతుకునందు శ్లేష—వెతలుదెచ్చు!

ఇలను ఆశకన్న ఎక్కుడేమున్నది?
ఆశలేని నరుడు అవనిగలడె?

———

తెలుగున నాటకములు వెలయకుండుటకు హేతువులు

శ్రీ ఎస్. గంగప్ప

ఆంధ్ర వాఙ్మయము పదునొకండవ శతాబ్దిలో ఆరంభమైనది. నన్నయ ఆదికవి; నన్నయభారతము తెలుగున తొలి రచన. అట్లు ప్రారంభింపబడిన ఆంధ్ర వాఙ్మయము మూడు పూవు లారు కాయలుగా క్రమవికాసమునంది మేటిస్థితిని పొందినది. కాని వాఙ్మయమున ప్రధానములైన సంస్కృత రూపకముల వంటివి తెలుగున నుద్భవించలేదు. పందొమ్మిదవ శతాబ్ద్యుత్తర భాగమున మాత్రమే అట్టివి వెలసినవి.

సంస్కృత సాహిత్యమున పురాణములు, కావ్యములు, నాటకములునని మూడు ముఖ్యవిభాగములు గలవు. వీనిలో నాటకమునకున్న ప్రాధాన్య వైశిష్ట్యములను పురస్కరించుకొనియే 'కావ్యేషు నాటకం రమ్యమ్'; 'నాటకాంతం హి సాహిత్యమ్'—అను ఆభాణకములు బయలుదేరినవి. సంస్కృత నాటకములు ప్రపంచమందలి అన్నిదేశములలోని సహృదయ హృదయముల నెక్కువగా ఆకర్షింపగలిగినవి. గీర్వాణ వాఙ్మయమున నాట్యకళ ప్రాచీనమై సర్వజనామోదము నందియుండినను తెలుగున పందొమ్మిదవ శతాబ్ద్యుత్తర భాగమువరకును అజ్ఞాతవాసమునే యనుభవించినది.

ప్రాచీనాంధ్ర వాఙ్మయమున నాటకములు లేనంతమాత్రమున ఆంధ్రులకు నాట్యకళను గూర్చి గాని, నాటకములగూర్చిగాని తెలియదని యనుకొనుటకు వీలులేదు. ధర్మోపదేశమే ప్రధానముగా తలంచిన ప్రాచీనాంధ్రకవులు అట్టివానిని మాత్రమాంధ్రీకరించి భాషాసేవయు గావించిరి. కాని ఎన తరువాతి కవులు ప్రసిద్ధి వహించిన సంస్కృత కావ్యముల నాంధ్రీకరింప నారంభించిరి. అట్టివారిలో శ్రీనాథుడు ప్రథముడు. కావ్యపరివర్తనము తరువాత నాటకము లనువదింపబడుట సహజపరిణామక్రమము. శ్రీనాథ యుగమునందలి కవులు స్వాభావికమైన పద్ధతినే అవలంబించిరని విదితమగును. శ్రీనాథుని అనువాద పద్ధతి ననుసరించి వీరు ప్రసిద్ధ సంస్కృత నాటకములను కొన్నింటిని ఆంధ్రీకరించిరి. కాని ఆ యాంధ్రీకరణము నాటకరూపమునగాక ప్రబంధ రూపమున వెలసినది. పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల నాటకమును శృంగార శాకుంతల ప్రబంధముగా నాంధ్రీకరించెను. మంచన, రాజశేఖరకవి సంస్కృతమున రచించిన కర్పూర మంజరీ నాటకమును కేయూరబాహు చరిత్రమను ప్రబంధముగ తెలిగించెను. నంది మల్లయ, ఘంట సింగయ లను జంటకవులు కృష్ణమిశ్ర కృత ప్రబోధచంద్రోదయ నాటకమును ప్రబంధముగ నాంధ్రీకరించిరి. కాని నాటకములను నాటకములుగ ననువదింపలేదు., అయినను శ్రీనాథకృతమని చెప్పబడుచున్న క్రీడాభిరామము వీథీరూపమున గలదు. మార్గరూపకములవంటివి తెలుగున వెలయలేదు. అంతమాత్రమున మన పూర్వ కవులు రసపరిపుష్టములైన సంస్కృతనాటకముల వైశిష్ట్యము నెరుగనివారనిగాని, ప్రతిభా సంపన్నులు కారనిగాని తలంచుటకు వీలులేదు. అసమాన ప్రతిభా వ్యుత్పన్నులైన తిక్కన, శ్రీనాథుడు, పింగళి సూరన మున్నగుకవులు నాటక ప్రక్రియ నుపరిపోషింపకవదలుట కేవియో ఇతర బలవత్తర కారణములుండి యుండు

నని తలంచు టుచితము. 'కొంచెమించుమించుగ సంస్కృతమునందలి ప్రసిద్ధ కావ్యములన్నియు తెనుగులోని కనూదితములైనవి. మన పూర్వకవులు స్వతంత్రముగ నాటకములు వ్రాయకుండినను రస నిధానములైన కావ్యముల నుత్తమములని యెన్నబడు చున్న సంస్కృత నాటకములలో నొకదానినిగూడ తెనుగున నావిష్కరింపమి మిక్కిలి విస్మయావహము. కొందఱు సంస్కృత నాటకముల పరివర్తనమును ప్రారంభించియు వాని రూపమునుమార్చి ప్రబంధ ములుగా ననువదించుటచూడ నాటకరూపరచ నమున కాకాలమున నేవియో అనివార్యములైన యాటంకము లుండవలయుననుట నిర్వివాదము.'[1]

ప్రాచీన కాలమున నాంధ్రమున దృశ్యకావ్య వాఙ్మయము లేకపోవుటకు దగిన కారణములు చెప్పుట కష్టసాధ్యమే! కాని యుక్తిచే కొన్నింటిని చూప వీలగును. అట్టి హేతువుల నూహించిన వారిలో ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, శ్రీ నిడద వోలు వేంకటరావుగారు, శ్రీ బులుసు వేంకటరమ ణయ్యగారు, కోలాచలం శ్రీనివాసరావుగారు ముఖ్యులు. తెలుగున సంస్కృత రూపకములవంటివి లేకుండు టకు హేతువులివి :—

I. వైదిక మతోద్ధరణము ప్రధానము:— '...తెనుఁగు వాఙ్మయముయొక్క పుట్టుక యానాటి పరిస్థితులనుబట్టి చాలవఱకు వైదిక మతోద్ధరణ ముతో సంబంధించియుండుట సంభవించెను. అప్పటి యాంధ్ర సమ్రాట్టులుకూడ దానికొఱకే విశ్వప్రయ త్నములు చేయుచుండిరి. అట్టియెడ పంచమవేద మనఁబరఁగి సర్వధర్మ సమన్వయ సంధాన క్షమములగు భారతమువంటి యుత్తమ గ్రంథములయొక్క పరి వర్తనమే మిక్కిలి యావశ్యకమై కనుపట్టెను... శ్రీనాథుని యుగము వఱకుఁగల తెనుఁగు వాఙ్మయము మత ప్రచారమున కనువగు పురాణముల పరివర్త నము తోడనే భాసిల్లుచుండెను. పైఁగా శ్రీనాథునికిఁ బూర్వముండిన యాంధ్రకవులలో నన్నెచోడునివంటి స్వతంత్ర కావ్యకర్తలు తక్కువ. వాఙ్మయారంభమున నాద్యులయిన నన్నయాదుల మార్గమునువీడి నాటక పరివర్తన మారంభించి భిన్నమార్గమును ద్రొక్కుట కప్పటి కవులకు ధైర్యము చాలినది కాదు.'[2]

II. పాత్రోచితభాష:—సంస్కృత నాటక ములలో సంస్కృతముతోపాటు ప్రాకృతమునుగూడ విరివిగా వాడియున్నారు. అందు సంస్కృతమువలెనే ప్రాకృతముకూడ వ్యాకరణబద్ధమైనది. సంస్కృత నాటకములందు ఉత్తమ మధ్యమ పాత్రలకు సంస్కృతమును, స్త్రీ నీచపాత్రలకు ప్రాకృతమును వాడుట పరిపాటి. అనగా సంస్కృత నాటకములలో పాత్రోచితభాష వాడబడుచుండినది. తెనుగు కవుల కీ నిబంధనము కొంతవరకు ఆటంకము కలిగించి యుండును. ఏలయన తెనుగున గ్రాంథికభాషవలె వ్యావహారికము వ్యాకరణబద్ధముకాదు. సంస్కృత పద్ధతి ననుసరించి పాత్రోచితభాషాప్రయోగమున స్త్రీపాత్రలకు వ్యావహారికమును వాడవలసి వచ్చె డిది. కాని దాని నుపయోగించుటకు వీలులేదు. పోనీ దానిని త్రోసిపుచ్చి సర్వపాత్రలకు నొకటే భాష నుప యోగించి నాటకము రచింపబూనుటకు పూర్వాంధ్ర కవులకంత నిరంకుశత్వమును, స్వాతంత్ర్యమును లేక పోయెను. తత్ఫలితముగా, తెలుగున నాటకము లానవ యమున వెలువడలేదు.[3]

III. రంగస్థలములు లేకుండుట:—ఆ కాల మున తగిన రంగస్థలములు లేకుండినవి. రంగపరికర ములుగూడ ఆంధ్రదేశమున లేకుండినది. ఉత్తమమై స్వతంత్రమైన ప్రబంధ రచనకు ప్రోత్సాహమునిచ్చి పోషించిన కృష్ణదేవరాయలు సైతి నిశానాటక రచ నకు దోహదము చేసినట్లు కన్పట్టదు. మనుచరిత్ర లోని 'చిలుకల కొల్కి కల్కి యొక చేడియ నాటక శాల మేడపై నిలువున వాడుచుండి...' (5–63) అను పద్యమున నాటక సంబంధి సూచన కలదు. కాని అందెట్టి నాటకములు ప్రయుక్తములయ్యెడివో

---

1. 'ఆంధ్రనాటక పితామహుఁడు'—ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు—పుటలు 5, 6.

2. 'ఆంధ్రనాటక పితామహుఁడు'—పుటలు 6, 7.

3. 'ఆంధ్రనాటక పితామహుఁడు'—పుట 7. 'కావ్యము—దాని ప్రభేదాలు'—శ్రీ బులుసు వేంకట రమణయ్యగారు—పరిశోధన—ఫిబ్రవరి మార్చి 1955.

తెలియదు. తంజావూరు రాజుల కాలమునగూడ నృత్య గీతాది వినోదములకై 'సరస్వతీ మహలు' అను పేరితో నొక శాల నిర్మింపబడినట్లు తెలియును. అందు ప్రదర్శితములైనవి కేవలము యక్షగానము లేమో స్పష్టము కాలేదు.[4]

IV. నటులకు సంఘమున గౌరవము లేకుండుట:—ఆనాడు ఆర్యధర్మము ననుసరించి నటుఁడు సంఘమున నీచముగా చూడబడుచుండెను. కనుక ప్రభువులుగూడ నాటకములపై శ్రద్ధ చూపకుండిరి. అందుచేతనే కవులు నాటకములను రచింప నుద్యమింపకుండిరి. నటవిట గాయకాదులు సంఘ బాహ్యులుగా నిరసింపబడుటచే, నాగరులును, విద్యావంతులును వీనియెడ నసహ్యభావమునే ప్రకటించుచుండిరి. కనుక నాటక వాఙ్మయమున్నను, తద్రచనమున్నను నాటి కవులకు నీరసభావమేగాని, గౌరవము లేకపోయెను.[5]

V. తెలుగున నాటక లక్షణము లేకుండుట:—'నాటకకళ సంస్కృతమున సమగ్రత్వమును బ్రాపించినది. తల్లక్షణముల సమగ్రముగా వివరించు లక్షణగ్రంథములందుఁ బెక్కు వెలువడినవి. ఆంధ్ర కవులు సంస్కృత కావ్యముల నాంధ్రీకరించినట్లు కొన్ని నాటకముల నాంధ్రీకరింపకపోవుట యటుండ నీ లక్షణగ్రంథములయినఁ దెలుఁగున వెలయింపరైరి...... పదుమూడవ శతాబ్దియందలి విన్నకోట పెద్దన తన 'కావ్యాలంకార చూడామణి'లో నీ రూపక ప్రశంస కొలఁదిగానైన నొనర్చి యుండలేదు. పదునాలవ శతాబ్దియందలి భట్టుమూర్తి 'నరసభూపాలీయ' మను పేర విద్యానాథుని 'ప్రతాపరుద్రీయము'ను గొంచె మించుమించుగాఁ బరివర్తనము చేయుచు నందలి రూపకప్రకరణమును విడిచివైచెను...లక్షణాభావముచేఁ గవులు రసాశ్రయములైన రచించి యాంధ్ర భాషాయోష నలంకరింపరైరి. ఫలితార్థ మేమనఁగా నాటిదేశభాషలలోఁ బెక్కు అనాఁడే కళాసర్వస్వము లయిన రూపకములచే విరాజిల్లుచుండఁగా నాంధ్రమునకు నిన్న మొన్నటిదాఁక నా భాగ్యము లేకపోయినది.'[6]

VI అనువైన వచన రచన లేకుండుట:— 'తొల్లింటి తెనుఁగు గద్యరచన శబ్దప్రధానముగాని యర్థప్రధానముగాదు. నన్నయాది కవుల కరిద్దరు మాత్రమే యర్థప్రధానముగ గద్యరచనను గావించినను, ఆ వెనుక, కవు లాలంకారికనియమముల ననుసరించి, శబ్దప్రధనము గావించిరి. సులభముగ నర్థమును గ్రహించుటకు నవకాశముగల వచన రచన లేకపోవుటయే, యాకాలమున నాటకములు వెలువడకపోవుటకు కారణమని యూహింపనగును.'[7]

VII. శ్రవ్యకావ్యమునకేగాని దృశ్యకావ్యమునకంతగా ప్రాధాన్యము లేకుండుట:- నాటకము శ్రవ్యత్వముతోపాటు దృశ్యత్వముగూడ కలిగియున్నది. శ్రవ్యత్వ దృశ్యత్వములు రెండును సమగ్రమైననే ఉత్తమనాటక మనిపించుకొనును. కనుకనే 'కావ్యేషు నాటకం రమ్యమ్'-అను నానుడి ప్రసిద్ధి వహించినది. శ్రీనాథుడు ప్రబంధ రచనకు శ్రీకారము చుట్టి దారి చూపినాడు. కవులందరు అట్టి మార్గముననే నడచి వెళ్లిరి. నాటకము ప్రయుక్తముకాగా ఆంధ్రులు చూచినట్లు కన్పట్టదు. అందుచేతనే ప్రబంధమువలననే అట్టి యానందమును పొందుచుండిరి. కనుకనే కవులును పరిస్థితుల ననుసరించి శ్రవ్య కావ్యములను మాత్రము రచించిరి. పై పెచ్చు కొందరు సంస్కృత నాటకములను సైతము తెలుగున ప్రబంధములుగానే రచించిరి. కనుక ఆ నాడు దృశ్యకావ్యములకంటె శ్రవ్యకావ్యములకే యధిక ప్రాధాన్యముండుటచే నట్టివే వెలువడినవి. కాని నాటకములు రచింపబడలేదు.[8]

---

4. 'ఆంధ్ర నాటక పితామహుఁడు'—పుటలు 9, 10.
'కావ్యము—దాని ప్రభేదాలు'—పరిశోధన.

5. 'ఆంధ్రనాటక పితామహుఁడు—పుట 10.
'కావ్యము—దాని ప్రభేదాలు'—పరిశోధన.

6. 'ఆంధ్రనాటక పితామహుఁడు'—పుటలు—10, 11.

7. 'అభిషేకనాటక పరిచయము'—శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు—పుట ii.

8. 'ఆంధ్ర నాటక పితామహుఁడు'—పుట 8.
'కావ్యము—దాని ప్రభేదాలు'—పరిశోధన.

VIII. సంస్కృతభాషాప్రాధాన్యము తగ్గుచుండుట:—సంస్కృతములోనున్న నాటకములలో గూడ ప్రసిద్ధి వహించినవి తక్కువనియే చెప్పవలెను. అవి పదవశతాబ్దికి ముందే రచితములు. తరువాత నంత విరివిగా రచింపబడలేదు. రచింపబడిన వానిలో గూడ ప్రబోధచంద్రోదయము వంటివి యొకటి రెండుతప్ప తక్కినవి ప్రసిద్ధికి రాలేదు. సంస్కృత నాటక ప్రదర్శనములు గూడ తగ్గియుండును. ఏలయన అవి పండిత పరిషత్తులకు మాత్రమే పరిమితమై యుండినవి. అంతేగాక దేశభాషల అధికృత ప్రబలుచుండ సంస్కృత ప్రాముఖ్యము తగ్గుచుండినది. సంస్కృత నాటక ప్రదర్శనములుండినచో వానిని చూచినప్పుడైన ఆంధ్ర కవులకు నాటక రచనాభిలాష కలిగియుండెడిదేమో![9]

IX. యక్షగానములవంటి దేశరచనలుండుట:—'విజయనగర వినాశానంతరము తంజావూరు మధుర సంస్థానములు ప్రసిద్ధికి వచ్చెను. ఈ సంస్థానముల నాయకులు వాఙ్మయాభిరుచికలవారై యనేక కావ్యములను దాము వ్రాసియుఁ, దమ యాశ్రితులచేత వ్రాయించియు నాంధ్రభాషను సర్వవిధముల నభివృద్ధి చేసిరి. వీరిపోషణమున యక్షగానములు విరివిగా రచింపఁబడుచుండెను... తొలుఁదొలుత నివి సత్కవి రచితములుగాక నటులచేతనో, మఱియే స్వల్ప పాండిత్యము కలవారిచేతనో వ్రాయఁబడిన వచనరూప సంబంధముకల పురాణ పద్యములతో విలసిల్లుచుండెను. తరువాత వీనిని జను లాదరించుటచే విద్వత్కవులు గూడ స్వతంత్రముగా నిట్టివానిని వ్రాయ నారంభించిరి...ఇవి శుద్ధదేశిమార్గమునకుఁ జెందినవి...ఇట్టివి పాల్కురికి సోమనాథుని కాలమునుండియు వ్రాయఁబడి యప్పుడప్పుడు ప్రదర్శింపఁబడుచుండుటచే నప్పటివారు వీని ప్రదర్శనముల నవలోకించుటతోడనే సంతుష్టులై సంస్కృత నాటకములను బోలిన నాటకములను మన భాషలో వ్రాయుటకుఁ బూనుకొనరైరి.'[10]

ఈ పైని చెప్పబడిన హేతువులు కేవల మూహామాత్రములైనవే. కాని యివి యెంతవరకు సమంజసములో కొంత పరామర్శించుట ఉచితము.

1. నన్నయనుండి శ్రీనాథయుగమువరకు గల ఆంధ్ర కవులు వైదిక మతోద్ధరణమే ప్రధాన ధ్యేయముగా నెంచుటచే తెనుగున నాటక రచనకు పూనుకొనలేదనుటలో కొంతవరకు సామంజస్యము కలదు. అయినను నాటక రచనచే వైదిక మతోద్ధరణము చేయగూడదను నియమము ఎక్కడను లేదు గదా? పైపెచ్చు శ్రవ్యకావ్యమునకంటె దృశ్యకావ్యమందులకు మరింత దోహదకారియై యుండదా?

2. పాత్రోచితభాష యన్నది యాధునికు లుంచిన పేరు. సంస్కృత నాటకములలోని పాత్రోచిత భాషాప్రయోగము ననుసరించినచో తెలుగున గ్రాంథికముతోపాటు వ్యావహారికమును ప్రయోగించవలసివచ్చెడిది. కాని అది వ్యాకరణబద్ధమయి యుండ లేదు. అందుచే తెలుగున నాటకములు రచింపబడ లేదనుట నంగీకరించుటకు వీలులేదు. కారణ మేమన వ్యావహారికమును గూడ వాడి కొన్ని గ్రంథములు రచింపబడినట్లు తెలియును. 'కాని వ్యావహారికభాష వాడరాదని ఆ కాలమున ఆగ్రహ ముండినట్లు తోచదు. పద్యభాగమును విడిచి, వచన భాగమును వ్యావహారికభాషలో వ్రాయుట ప్రసిద్ధము. అప్పకవీయాది లాక్షణిక గ్రంథములలోని వివరణము, కొన్ని గద్యములు వ్యావహారికభాషయందే యున్నవి.'[11] అట్టియెడ నాటకములలో వ్యావహారికభాషను వాడుటకు గల నిర్బంధ మేమిటో?

3. ఆంధ్రదేశమున రంగస్థలములు, రంగపరికరములు లేకుండుటచే నాటకములు రచింపబడ లేదనుట కుచితమైన యాధారములు లేవు. రంగస్థలము లుండియుండవచ్చుననుటకే యెక్కువ యాధారములు గలవు. నాటకములు రచింపబడలేదు గనుకనే రంగస్థలములు లేవని తలంచుటయు సముచితము కాదు. నన్నయభట్టు భారతమున, '...ఉదాత్త రసా

---

9. 'ఆంధ్రనాటక పితామహుఁడు'—పుటలు 7, 8.

10. 'ఆంధ్రనాటక పితామహుఁడు' పుట 9.
ఈ విషయమును శ్రీ విడదవోలు వేంకటరావుగారు గూడ 'అభిషేక నాటక పరిచయము'లో పేర్కొనిరి. (పుటలు II, III.)

11. 'కావ్యము—దాని ప్రభేదాలు'—పరిశోధన.

న్విత కావ్యనాటక క్రమములు పెక్కు చూచితి...'12– అని రాజరాజుచేత పలికించుటయు, 'నాటక ప్రయోగంబునందునోని ఘనరసపాత్రశోభితరంగరమ్యం బైన...'13–అని రచించుటయు చూడగా ఆకాలమున నాటకము, రంగస్థలము, నాటకప్రయోగము– అను పదములు బాగుగ పరిచయము లనుటలో సందేహములేదు. తెలుగున నాటకములు లేకుండినను సంస్కృత రూపకములు రాజాస్థానములలో ప్రదర్శింపబడుచుండినవని విశదమగును. ఇట్లు ఆంధ్ర సాహిత్యమున నిట్టి ననేక నిదర్శనములు గలవు. తరువాతి కాలమున యక్షగానములు రచింపబడి ప్రయోగింపబడుచుండినవనుట విజ్ఞులకు విదితమే! కనుక ఆ రోజులలో నాటకశాలలు లేవనుటకు వీలు లేదు. ప్రాచీనకాలమున రంగస్థలము లుండినవనుటకు తగిన చారిత్ర కాధారములు గలవు. (a) "శ్రీకృష్ణదేవరాయల నగరులోని నాట్యశాల:–కృష్ణదేవరాయలు స్వయముగ సంగీత నాట్యముల నభ్యసించెనని చరిత్రలు చెప్పుచున్నవి. శ్రీ భండారు లక్ష్మీనారాయణ అను సంగీతవేత్త కృష్ణరాయలకు, వారి అంతఃపురస్త్రీలకు సంగీతము నేర్పెను. రాయలు 'విద్వత్సభారాయ' బిరుదాంచితుడై కొలువుతీర్చి యుండగా రంజకం శ్రీ రంగరాజు, వాని కుమార్తె రంజకం కుప్పాయి, నట్టువ నాగయ్య మొదలగువారు నాట్యములను ప్రదర్శించెడివారు. ఈ నాట్యశాలను గూర్చి 'Paes'– అను యాత్రికుడు విపులముగా వర్ణించెను. (b) తంజావూరు రాజప్రాసాదములోని బహిరంగ ప్రదర్శనశాల:– దీనిని 'తిరిందవెళి అరంగం' (Open air theatre) అందురు. ఇది నాయకరాజుల ప్రాసాదములో 'సరస్వతీ మహల్ గ్రంథాలయము'నకు పడమటి దిక్కుగా దాని నానుకొనియున్నది. ఇది పూర్వము ఏ రూపమున నుండెడిదో తెలియదు...ఈశాన్యదిశయందు ఎత్తయిన దిమ్మ ఉండెడిది. దీనిమీద నిలుచుండి మాటాడినచో శబ్దవిపులీకరణ యంత్రముల సాహాయ్యము లేకయే రెండువేలమందికిని సుస్పష్టముగా వినిపింపగలదు......ఇప్పుడది చక్కని 'బహిరంగ నాట్యమండపము'గా నున్నది. నాయకరాజులుకూడ దీని నిందులకే ఉపయోగించెడివారని తలంపవచ్చును......... (c) నాగార్జునకొండ త్రవ్వకములలో ఒక బహిరంగ ప్రదర్శనశాల (Open air stadium) బయల్పడినది. అందొకప్రక్క ఉన్నత ప్రదేశమును (Pavilion), తక్కిన మూడు ప్రక్కల సోపానాకృతికల ఆసనములవరుసలును కలవు......'14. ఇక్కడ డా. డి. వి. ఏ. ఆచార్యగారి మాటలను పేర్కొనుటవసరము. 'ఇటీవల నాగార్జునకొండ త్రవ్వకాలలో దొరికిన ఆరుబయలు రంగస్థలం వేలాది ప్రేక్షకులకు సరిపోయే వైశాల్యం కల్గియున్నదనియు, శబ్దసంయమ సౌకర్యాదులు కల్గియున్నదనియు తెలియుచున్నది. ఈ రంగస్థలం క్రీస్తు పూర్వం 560–480 నాటిదని ప్రాచీన వాస్తుశాఖవారు నిర్ణయించుటచే 2500 సంవత్సరాలకు పూర్వమే ఆంధ్రలో రంగస్థలాలున్నట్లు ఇది సాక్ష్య మిస్తున్నది.......'15. కనుక ప్రాచీనకాలమున రంగస్థలము లుండినవనుట కిన్ని యాధారము లుండగా వానిని త్రోసిపుచ్చుట ఉచితముకాదు. అందుచే రంగస్థలములు లేవు గనుక తెలుగున నాటకములు రచింపబడలేదనుటలో సామంజస్యము కన్పట్టదు.

4. నటులకు సంఘమున గౌరవము లేమిచే ప్రజలకు నాటకములపై మోజు లేకుండినది. అందువలన నాటకములు తెలుగున రచింపబడలేదనుట అందరు నంగీకరించిన విషయమే! నటీనటులు నీతిబాహ్యులై ప్రవర్తించుటచే వారికి సంఘమున స్థానము లేకుండినది. అప్పటికే సంస్కృతరూపకరచన తగ్గుముఖము పట్టుటను గమనించిన తెలుగు కవులు అట్టి నాటకరచనకు పూనుకొనకుండిరనవలెను.

5. తెలుగున నాటక లక్షణము లేకుండుటచే నాటకములు రచింపబడలేదనుట ఉచితముగా తోపదు.

---

12. భారతము — ఆదిపర్వము – ప్రథమాశ్వాసము–పద్యము–10.

13. భారతము — ఆదిపర్వము — ద్వితీయాశ్వాసము–వచనము–27.

14. విశేషాంశములు–నాట్యశాస్త్రము, రెండవ అధ్యాయము–పుటలు 60, 61–డా. పి. ఎస్. ఆర్. అప్పారావు, M. A., ph. D.

15. ఆంధ్రలో నాటకం— నాటక రంగం— పుట 58–డా. డి. వి. ఏ. ఆచార్య B. A., G. C. I. M.

భట్టుమూర్తి నాటకప్రకరణమును వదలినాడు. అదెందుకు పరిత్యజించెనో తెలియదు. కాని క్రీ. శ. 1530–50 ప్రాంతమున చిత్రకవి పెద్దన లక్షణసారసంగ్రహములో నాటక లక్షణము తెలిపియే యున్నాడు. కనుక నాటక లక్షణము తెలుగున లేదనుటకు వీలులేదు. లక్షణముననుసరించి లక్ష్యమేర్పడదు. లక్ష్యమున్నప్పుడు లక్షణము వచ్చును. ఇది చాల సహజ విషయము. కనుక నీ ఉపపత్తి ఉచితముగా తోచదు.

6. తెలుగున నాటకోచిత వచన రచన లేకుండుటచే నాటకములు రచింపబడలేదనుట హాస్యాస్పదమైన విషయము. నన్నయాది కవులందరు సమర్థులు. నాటక రచనయెడ ఆసక్తియుండినయెడల తదుచిత వచన రచన చేసియుందురు. అందుకు వారి రచనలే నిదర్శనములు.

7. ఆ నాడు శ్రవ్య కావ్యములకేగాని దృశ్య కావ్యములకంతగా ప్రాధాన్యము లేకపోయినదనుటలో కొంత ఔచిత్యము కలదు. నన్నయ మొదలుకొని పూర్వకవులందరు శ్రవ్యకావ్యములనే రచించిరి. శ్రీనాథ యుగమున కొందరు సంస్కృత నాటకములను సైతము కావ్యములుగానే రచించిరి. ఆ నాడు గద్యమునకంటె పద్యమునకే అధిక ప్రాధాన్యముండియుండును. కావుననే కేతన గద్యమయమైన సంస్కృత దశకుమార చరిత్రమును పద్యమయము గావించెను. పైగా శ్రవ్యకావ్యమున ఒక సౌలభ్యము కలదు. మధురమైన కంఠస్వరముగల వ్యక్తి కావ్యమును రాగయుక్తముగా పాడి, అభినయించి మనోహర మొనరించును. ఆ విధముగా కవి తన పోషకుని మెప్పించియుండవచ్చును. నాటకము ప్రదర్శింపబడినప్పుడే దాని గొప్పదనము తెలియును. లేనిచో ప్రయోజనముండదు. దృశ్యకావ్యములకు చాల హంగు అవసరము. అందుచే శ్రవ్యకావ్యములే ఆనాడాదరింపబడుచుండిన వనవచ్చును.[16]

8. ఆంధ్రవాఙ్మయారంభమునాటికి సంస్కృత భాషా ప్రాధాన్యము తగ్గుచుండినదనవలెను. ఉత్తమ సంస్కృత నాటకములన్నియు 10, 11 శ. లకు పూర్వమే రచితములు. తరువాతి నాటకములంత శ్రేష్ఠతరములు కావు. భాషా ప్రాబల్యము తగ్గుటచే నాటక ప్రయోగమును తగ్గియుండవచ్చును. సంస్కృత నాటక రచన, ప్రదర్శనములు తగ్గిపోవుటకు — అవినీతిప్రతిపాదకేతివృత్తములను నాటకములుగా చేయుటయు, నటీనటులలో అవినీతి పెరిగిపోవుటయు కారణములని కోలాచలం శ్రీనివాసరావు గారు వివరించిరి. 'These and various other causes amongst which the immoral conduct of an actor or an actress played an important part, have completed the decline of the Indian stage.'[17]

9. యక్షగానములవంటి దేశి సంబంధిఅయిన ఆటలుండుటచే సంస్కృత రూపకములవంటి నాటకములు తెలుగున రచింపబడలేదనుట చాల ఉచితమైన విషయము. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో దృశ్యకావ్య ప్రశంస కలదు. శివరాత్రి జాగరణము సందర్భమున వేడ్కలు, వినోదములు, ఆటలు, బహువిధములుగా నుండెడివని అతడు వర్ణించెను. 'ప్రథమ పురాతన పటుచరిత్రములు/క్రమమొంద బహునాటకము లాడువారు... భారతాది కథలఁ జీరమరుగుల/వారంగ బొమ్మల నాడించువారు'...'వెండియు భవు బహువిధ చరిత్రముల/ఖండితగతి నాటకంబు లాడుచును...'[18]. ఇవి నిదర్శనములు. కావున దేశి సంబంధి నాటకములు చాలకాలమునుండియు కలవని తెలియును. 16 వ శ. నుండియు యక్షగానముల రచన, ప్రదర్శన ఆరంభమైన సంగతి అందరికి తెలిసినదే. ఆ నాటి ఆంధ్ర మహాజనులకు యక్షగానములు, వీథి నాటకములు, తోలుబొమ్మలాటలు, పగటి వేషములు—మున్నగు జానపద కళారూపములు వినోద విజ్ఞానములను చేకూర్చుచుండెడి వనుటలో ఏ విధమైన సందేహము లేదు. ఇట్టివి పండిత పామరుల కందరికీ నుపయోగ

---

16 ఇది ప్రొఫెసర్ జి. ఎస్. రెడ్డి, ఎం.ఏ., ఎం. లిట్; పి.హెచ్.డి. గారి అభిప్రాయము.

17. 'Dramatic History of the world' P.p. 225—231—Kolachalam Srinivasa Rao.

18. పండితారాధ్య చరిత్ర—పర్వత ప్రకరణము—పుటలు 435, 443—పాల్కురికి.

ప్రత్యక్షమౌతుంది. ఈ లయ సాహిత్యపదాలమీద ఆధారపడిఉంటుంది. ఇందులో, ఓ పదంనుంచి మరో పదానికి శబ్దం పోతూఉంటే, ఆ శబ్దం ఓ స్థాయిలో లేక ఓ చోట భారమైన శబ్దాలను సృష్టిస్తూ, మరోచోట మృదువైన శబ్దాలను సృష్టిస్తూ ముందుకు సాగిపోతూ ఉంటుంది. అప్పుడు ఆ శబ్ద విన్యాసంలోని రమణీయతను ఆస్వాదిస్తుంటే, శబ్దం ఉయ్యాల ఊగుతున్నట్లుగా ఉంటుంది. ఇది సాహితీ జగత్తులోని శబ్దాత్మకమైన లయ.

ఇక్కడే మరో రకమైన లయకూడా సాహిత్యంలో ఉంది. పదాలు అనేక అర్థాలనూ, భావాలనూ కలిగిస్తుంటాయి. ఓ భావం మరో భావంలోకీ, ఓ అర్థం మరో అర్థంలోకీ ప్రయాణిస్తున్నప్పుడు ఒకలాంటి భావాత్మకమైన లయను సాహిత్యం మనకు అందిస్తోంది. ఇదే భావాత్మకమైన లయగా సాహిత్యంలో ఒప్పుతోంది.

ఇలా ఉంటుంది నాదంలోనూ పదంలోనూ ఉండే లయ. ఇది అస్థాతికం కాబట్టి గతిశీలమూ శ్రవ్యమానమూ ఐంది, కనుకనే ఇది కదిలించే రస సంవేదనలలో మనం కదిలిపోతూ ఉంటాం.

ఇక పోతే ఇలాంటి లయ రూపంలోనూ ఉంది అని అంటే, ఎవరూ 'ఔను' అని అనరు. బాహ్య దృష్టికి రూపంలో లయ ఉన్నట్లుగా కనిపించదు. అసలు లయ అంటేనే సంచరనాత్మకమైందిగదా! పైగా రూపం వస్తుతత్వం కలిగి జడత్వం కలిగింది; కాబట్టి చేతనస్వభావం కలిగిన లయ రూపంలో ఉండటానికి ఆస్కారంలేదు—అనే భావం మనకు సర్వసాధారణంగా కలుగుతుంది. అలా కలగడం కూడా సహజమే!

ఐనా మనం రూపాభిమానులవలె రూపాన్ని అభిమానిస్తూ, ప్రేమిస్తూ దాన్ని సాదరంగా దగ్గరకు తీసుకుని పరిశీలిస్తే—

ఆ పరిశీలన అంతర్వీక్షణగా మారితే!

మూర్త జగత్తులోని రూపం స్థాణువులైనమా, అందులోనూ మనలను మధురంగా కదిపే అంశాలూ, మన దృష్టిని తనతోబాటు మృదువుగా తీసుకొనిపోయే కొన్ని లక్షణాలూ ఉన్నాయ్.

ఐతే రూపంలోని ఈ లక్షణాలను మనం దర్శించాలంటే ముందు రూపధర్మాలను ప్రేమతో భేదభావం లేకుండా అవగతం చేసుకోవాలి. ఆ తరువాత రూపంలోనూ, ఆ రూపాన్ని పెనవేసుకొన్న రేఖల్లోనూ, హృదయ పూర్వకంగా మనం తన్మయత్వం పొందాలి. అప్పుడుగానీ రూపవిజన్యరూపంలోని కొన్ని కావ్యాలంకారంలోవిలక్షణాలవంటి లక్షణాలనూ, ప్రమాణాలనూ మనం దర్శించలేం. అంతవరకూ ఎంత లావణ్యచమత్కృతిగల రూపమైనా మనముందు లావణ్యరహితంగా, నిస్తేజంగానే పడి ఉంటుంది.

ఇందుచేతనే సుందరమైన ఏ రూపమూ, పైనుంచి క్రిందివరకూ స్థంభాకృతిలో ఉండదు. అలా ఉండే ఏ రూపమూ అందమైన రూపంగా పరిగణింపబడదు రసజగత్తులో. కనుక అందమైన రూపంలో కొన్ని ఇంపైన ఒంపులూ, సొగసైన సొంపులూ తప్పక ఉంటాయి. అప్పుడుగానీ ఆ రూపం అందంగా చందంగా ఉండదు. అలా అందచందాలతో ఉండి, ఒంపు సొంపులు కలది ఓ రూపం ఐతే చిత్రం ఔతుంది. ఓ మూర్తి ఐతే శిల్పం ఔతుంది.

పోతే రూపం స్థాణువైనమా, అది మలచబడే నిర్మాణంవల్ల, రూపొందించబడే వివిధ రూపాల భారాలవల్లా కొన్ని రమణీయమైన రూప విన్యాసాలను ఏర్పరచుకొంటుంది. అప్పుడు రూపంలోని రూపాలూ, మూర్తిలోని ఆకారాలూ విభిన్నమైన రసమయరూపాలనూ, ఆకారాలనూ సృష్టించుకొంటాయి. అప్పుడు ఒక ఆకారంనుండి మరో ఆకారంలోకి మనదృష్టి దూకుతూ, మనోజ్ఞమైన ఒంపులూ, సొంపులవెంట మన రసజ్ఞత మధురంగా ప్రవహిస్తూ ఉంటుంది. అలా మన బాహ్యదృష్టి ఆహ్లాదంగానూ, అంతర్ దృష్టి రసస్ఫూర్తితోనూ రమణీయరూపాలలో ప్రవహిస్తున్నప్పుడు, మనలో కొన్ని మధురమైన రూపానుభూతుల కదలికలు మెదిలి, రసానందపు ప్రకంపనలు కలుగుతాయి. వానివల్ల ఓ లాంటి లయని దృశ్యాత్మకమైన స్పందనలక్షణాలను మనం అనుభవిస్తుంటాం!

అలా మనలో కలిగిన ఆ మృదువైన కదలికల రూప లక్షణమే, రూపలయ ఔతోంది రూప జగత్తులో !!

ఈ రూపలయను, మనకు అవలనున్న రూపంలోని రూపలావణ్యంవల్ల పొందుతున్నాం కాబట్టి, ఈ లయ రూప నిర్మాణ సాంకేతిక అంశాలలో గుప్తమై ఉంది. అందుకనే సర్వసాధారణంగా ఈ రూపలయను మనం ఆస్వాదించలేక పోతున్నాం. అసలు నాద శబ్దాలలోని లయను మనం ఎక్కువగా ఆస్వాదించాలంటే, అవి ఎక్కువ రసభరితాలై ఉండాలి. రూపంలోని లయను మనం ఎక్కువగా దర్శించాలంటే రసరూపంతో బాటు ద్రష్టలమైన మనం ఎక్కువ రసజ్ఞులమై ఉండాలి.

అసలు రసజ్ఞత ఉంటేనే ననుకోండి ! మనం రాగాన్నీ, రంగునీ, శబ్దాన్నీ శిల్పాన్నీ ప్రేమించేది. కాకపోతే రసజ్ఞత ఓ చోట ఎక్కువ అవసరం. మరో చోట కొంచెం తక్కువ అవసరం అంతే !

'రూపభేదాః, ప్రమాణాని,
భావ, లావణ్య యోజనే,
సాదృశ్యం, వర్ణికాభంగ
మితి చిత్రం షడంగకమ్'

అన్న మన ప్రాచీనుల ప్రమాణం ప్రకారం రూపానికి లావణ్యంకూడా ఓ అంగంగా చెప్పారు. కనుక లావణ్యమే రూపలయ ఔతోంది మూర్త జగత్తులో. ఈ లావణ్యం రూపనిర్మాణంలో వివిధ రూపాలకూ కూర్చబడిన ఒంపుల సొంపుల వల్ల కలుగుతుంది. ఆ తరువాత ప్రేక్షకుడు ఆ రూపంనుండి ఓ రకమైన లయను పొందుతాడు.

ఐతే ఇక్కడ ఒక చిన్న సత్యం దాగిఉంది. నాదంలోనూ శబ్దంలోనూ ఉండే లయ కదులుతున్నట్లు కనబడుతుంది. కానీ రూపంలోని లయ అలా కదిలినట్లు కనబడదు; కనుక రూపంలోని లయ సంచలనాత్మకమైంది కాదని బాహ్యదృష్టితో చప్పున మనం భావిస్తాం. కానీ అంతర్‌దృష్టితో చూస్తే ఆ భావం అభావంకూడా అవుతుంది.

ఎందుకంటే రూపంలోని లయ మనకు ఎదురుగా ఉండే, రూపం ప్రవహించే మార్గంలో ఉండి, రూపలయాత్మకంగా మన దృష్టిని ప్రకంపింపజేస్తుంది. అందుకని రూపంలో ఉండే లయ సంచలనాత్మకమైన లక్షణం కలది ఔతోంది. ఇక్కడే మరో చిన్న వ్యత్యాసం కూడా ఉంది.

సంగీత సాహిత్యాలలోని లయను ఆస్వాదించేప్పుడు శ్రోత స్థాణువుగా ఉంటాడు. అవి లయాత్మకంగా కదులుతాయి. రూపంలోనూ మూర్తిలోనూ అలాకాదు, ద్రష్టకు అవలఉన్న రసరూపాలు స్థాణువుగా స్థితిశీలంఉండి దృశ్యమానంగా ఉంటాయే కానీ, ద్రష్టమాత్రం రూపాలలోని లయకు అనుగుణంగా రూపలయాత్మకంగా తన దృష్టినీ, తన రసజ్ఞతనూ కదుపుతాడు. అంటే అమూర్తమైన సాహిత్య సంగీతాలలోని లయ తాను కదిలితే, మూర్త్యాత్మకమైన రూపాలలోని లయ తాను కదలక ఆవలి రసద్రష్టలను కదిలిస్తుంది.

అసలు ఈ లక్షణాలకు గల కారణాలను వెతికితే; పదానికీ నాదానికీ వస్తుతత్వం లేనందున వానిలోని శ్రవ్యమాన లయే మనవద్దకువచ్చి మనలో కలిసిపోతోంటుంది. మూర్తికీ రూపానికీ ఓ వస్తుతత్వం ఉంది కాబట్టి వానిలోగల దృశ్యమాన లయను దర్శిస్తున్నప్పుడు మనం కరిగిపోతాం. అందుకే రూపం మనల్నీ, మన రసదృష్టినీ లయాత్మకంగా కదుపుతూ తనలో కలుపుకుంటోంది.

బహుశ అందుకేనేమో ! పదమూ నాదమూ లయాత్మకంగా మనమీద వర్షిస్తే, రూపాలమీదా మూర్తులమీదా మనం లయాత్మకంగా వర్షిస్తాం !

పోతే, సర్వసాధారణంగా మనం మూర్తిలోగల వివిధ ఘనాలనూ ఓ క్రమంలో దర్శిస్తుంటాము. అప్పుడు ఒక ఘనం నుండి మరో ఘనానికి మనదృష్టి సాగిపోతున్నప్పుడు, రూపానుగుణంగా ఓ భావం తరువాత మరో భావం మనలో కదులుతూ ఉంటుంది. ఆ స్థితిలో మనం అమూర్తినుండి ఒకలాంటి భావాత్మకమైన దృశ్యలయను పొందుతూ ఉంటాం.

ఇదే లయను చిత్రంలో ఐతే ఇంకా బాగా పొందవచ్చు. చిత్రం అనేక ఆకారాలను కలిగిఉంటుంది. ప్రతి ఆకారమూ ఒకో రంగునుకూడా కలిగి ఉంటుంది. కనుక మనం ప్రతి ఆకారంలోని రంగు నుండి ఒకో భావాన్నీ, ఒకో అర్థాన్నీ పొందుతూ

ముందుకు సాగిపోతుంటాము. అప్పుడు మనలో అనేకమైన భావాలూ అర్థాలూ మధురంగాగానీ, తీవ్రంగాగానీ కదులుతుంటాయి. అలా భావాత్మకంగా కదిలే భావం కదలికే చిత్రంలోని భావాత్మకమైన లయ ఔతోంది.

కనుక సంగీత సాహిత్యాలలో భావాత్మకమైన లయ ఎలాఉందో, అలానే ఘన రూపంలోనూ వర్ణ చిత్రంలోనూ భావాత్మకమైన లయ ఉంది. కాకపోతే శ్రుతిబద్ధమైన లయ గతిశీలంలో ఉండి తాను కదిలితే, దృశ్యబద్ధమైన లయ స్థితిశీలంలో ఉండి ద్రష్టలను కదిలిస్తోంది.

ఇకపోతే రూపంలోని ఈ లయనే మరో రూపంలోనూ దర్శింపవచ్చు. సర్వసాధారణంగా రూపంగానీ మూర్తిగానీ కొన్ని ఒంపులూ సొంపులూ గల రమ్యమైన రేఖలను బహిర్గతపరుస్తుంది. ఆ రేఖల్లోని తీయదనాన్ని మనం ఆస్వాదించాలంటే, రూపం వ్యక్తపరిచే రేఖలను ముందు దర్శించాలి. పైగా రమణీయ రూపంలోని రేఖలు, ఎప్పుడూ మృదువైన ఒంపులూ సొంపులూ కలిగి, ఎంతో మనిసితంగాఉండి, పారవశ్యాన్నీ సంవేదనలను కలిగించేవిగా ఉంటాయి. అందుకని ద్రష్ట రూపాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు ఆ రేఖల వెంట రసవత్తరంగా సాగిపోతాడూ, జారిపోతాడు. అప్పుడుగానీ, రేఖజారిపోయే కొన్ని రమణీయ గతులలో ద్రష్ట ప్రయాణించడు. ఆ ప్రయాణంలో ద్రష్టయొక్క రసజ్ఞత అనేకరేఖామాధుర్యాలను పొందుతుంది.

అలా రసద్రష్ట సంగీతంలోని రాగాలవంటి, సాహిత్యంలోని '.........శిరస్సరజ్ఝరీ పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ......' పదాల వంటి రేఖలలో ప్రయాణించటంవల్ల, అతనిలోని రసజ్ఞత తీయనైన కదలికతో క్రిందికి జారిపోతున్నట్లుండి, ఓ మధురమైన స్పందనానుభూతిని పొందుతుంది. అలా మధురమైన వివిధగతులలో ప్రయాణించిన అతనిలోని రేఖాస్పందనాత్మకమైన రసజ్ఞతే, రేఖలలోని లయ ఔతోంది, రూప జగత్తులో.

ఇలా రూప విజ్ఞానంలో వ్యక్తమయ్యే రూప లయే కాకుండా, రూపంలోని వర్ణసామరస్యం వలననూ మరోరకమైన లయ ఉట్టిపడుతూ ఉంటుంది. కాంతివంతమైన అనేకరంగుల సామరస్యంగల చిత్రాన్ని పరిశీలిస్తే; ఇంపైన సొంపైన శబ్దాల స్వరాల సామరస్యంనుండి ఎలాంటి లయను పొందవచ్చో, అలాంటి లయనే మరో స్వరూపంలో వర్ణాల సామరస్యంవల్ల పొందవచ్చును.

కనుక స్వరసామరస్యంలోని లయ సంచల నాత్మకమైంది ఐతే, రూపంలోని వర్ణ సామరస్యంలోని లయ ద్రష్ట రసజ్ఞతను మనోజ్ఞంగా సంచలన పరిచేది ఔతోంది. అలాగే సాహిత్యంలోని శబ్దాల లయ సంవేదనాత్మకమైందిఐతే లావణ్య మూర్తులలోని లయ భావాత్మకంగా ద్రష్టను సంచలన పరిచేది ఔతోంది.

అందువల్లే సాహిత్య సంగీతాలలోని లయ శబ్దాల నాదాల కదలికల వలనా, వాని సామరస్యం వలనా తెలిస్తే, శిల్ప చిత్రాలలోని లయ మూర్తులూ రూపాలూ, ఘనాలూ రంగులూ కదిపే మన దృష్టి ప్రకంపనాల వలన తెలుస్తుంది.

మొదటివర్గం మనకు దూరంగా ఉండి వాని లయ మనకు వ్యక్తపరిస్తే, రెండవవర్గం మన దృష్టిని తన దగ్గరకు తీసుకొని, దానిని రూప లయాత్మకంగా కదిపి, మన మనస్సునుకూడా మధురంగా కదుపుతుంది.

అందుకే నాదంలోనూ శబ్దంలోనూ లయ ఎలా ఉందో, అలానే రూపంలోనూ మూర్తిలోనూ ఉంది. కాకపోతే అమూర్త జగత్తులోని లయ గతంలో వ్యాప్తమైతే, మూర్త జగత్తులోని లయ వర్తమానంలో వ్యాప్తవౌతోంది.

ఏది ఏమైనా రసతత్వానికి లయే జీవప్రాణం. అదిలేని శబ్దాలూ స్వరాలూ జడాలు. రూపాలూ మూర్తులూ శవచ్ఛవాలు.

కనుక లయే రసతత్వాన్ని లయం కాకుండా కాపాడేది ఔతోంది—!!!

విన్నపాలు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

1

రాజరాజేశ్వరా!
కవిరాజశేఖరా!!
ఈ విశ్వమే అచ్చయిన నీ కార్యసంపుటి!
నీ వల్లిన తేనె కయితలో,
నీ చెప్పిన రసవత్కథలో
నే నొక చిన్నపాత్రని!
అంతేకదా?
నీ దివాణానికి పిలిచి, నీ దర్బారులో నిలిచి
నన్నూ కవిత పలకమంటావా?
హనుమంతుడి ముందా కుప్పిగంతులు?

2

నీ సౌందర్యాన్ని కొలుచుకుందుకూ,
కొలతలు సరిపుచ్చుకుందుకూ,
నిన్ను నీవు చూచుకుందుకూ,
నీ ముస్తాబులు మార్చుకుందుకూ,
నన్నొక బిళ్లోరద్దంగా చేసుకొన్నావుసరే;
ముచ్చటగా దీనిని మలచుకొన్నందుకూ,
గదిలో దీనిని అందంగా నిలుపుకొన్నందుకూ,
ఎదురు పీఠిన నీవు నిలిచినప్పుడుకదా
చెదిరే నీ రూపాన్ని చిక్కబట్టేది?
ఆ ద్దాని కాపేరు సార్థకమయ్యేది?
పరాకుగా, చిరాకుగా
వైదొలగి నిలిస్తివా
పట్టే శిలాఫలక మిది!

3

నామీద నల్లని తెరవేసి
నావంక చూడమని
నన్ను కవ్విస్తున్నావు!
పరదాలోనికి నువ్వేరా; గుసగుసలు మాని;
పరదా వెలపలికి నన్నయినా లాగు.
చీకట్లో ఉన్నది నేను; వెలుగులో ఉన్నది నీవు;
బురఖా కప్పింది నీవు—బురఖా వేసుంచు
కొన్నది నేను;
ముసుగు తొలగించవలసింది నువ్వా నేనా?
ముందామాట చెప్పి మరీ కదులు.

4

ఈ సంతగోలలో మమ్మల్ని వదలి
చక్కాబోయావూ నువ్వు.
నీతో కలిసివచ్చిన స్పృహ
నీరసించిపోయింది మాతో.
నిన్ను వెతకాలన్న మిషతో
నలుగురమూ నాలుగు మూలలా
పద్దుకొన్నాము.
ఒకడు గోళ్లు గిల్లుకొంటూ కూచున్నాడు;
ఒకడు మంచం మిఠాయిదగ్గర మఠం వేశాడు;
ఒకడు రంగులరాట్నందగ్గర
రంగులలో అడుక్కుపోయాడు;
అంతలో—
అడుగో అడుగో అన్నారు.
సంతలో కలకలం బయలుదేరింది.
నాలుగువేపులనించీ నలుగురమూ
వాటేసుకున్నాము నిన్ను.
నాకు దొరికావంటే నాకు దొరికావని
కేకలు వేసుకొన్నాము;

తెలుగులో నామ్నీకరణాలు

శ్రీ చేకూరి రామారావు

భాషలో నామాలు, క్రియలూ, నామ–క్రియా విశేషణాలులాంటి భాషాభాగాలుంటయ్యని అక్షరాస్యులైన వారందరూ ఎరిగిందే. భౌతిక ప్రపంచంలోనివస్తువులను, తదాధారంగా మానవమేధలో జరిగే ప్రతిక్రియారూపమైన కొన్ని రకాల భావవిశేషాలను ప్రత్యేకంగాగాని, సామూహికంగాగాని మనం కొన్ని సంజ్ఞలతో వ్యవహరిస్తాం. అట్లాంటి సంజ్ఞలను నామపదాలంటాం. సాధారణంగా ఇట్లాంటి పదాలు స్వతస్సిద్ధంగానే నామపద వాచ్యాలు. ఈ నామ పదాలు వాక్యంలో ప్రవర్తించే విధానాన్నిబట్టి బహుధా విభక్తాలు. భాషా వ్యవహర్తల ప్రయోజనాల్ని అనుసరించి ఒక్కొక్కసారి ఒక భాషాభాగాన్ని ఇంకో భాషా భాగంగా వ్యవహరిస్తుంటాం. అటువంటి వ్యవహారానికి భాషలో కొన్ని నియతమైన పద్ధతులుంటై. ఒక భాషాభాగానికి చెందిన శబ్దానికి కొన్ని ప్రత్యయాదుల్ని చేర్చి వేరొక భాషాభాగంగా వ్యవహరించుకోటం భాష అనుమతించే ఒక పద్ధతి. ఉదాహరణకు నామాల్ని క్రియలుగా ఉపయోగించే ఈ పద్ధతిని గమనించండి.

నామం	క్రియ
బాధ	బాధించు
	బాధపడు
	బాధపెట్టు
కష్ట(ము)	కష్టించు
	కష్టపడు
	కష్టపెట్టు (కొను)
దబా(వా)	దబాయించు
Feel (ఫీల్)	Feel అగు
try (ట్రై)	try చేయు

ఇతర భాషాపదాలను కూడా మన అవసరాలను బట్టి వాటి భాషా భాగత్వాన్ని మార్చుకొని వ్యవహరిస్తుంటాం. ఈ పై పదాల్లో ఇంచుక్ ప్రత్యయాన్ని ఇంగ్లీషు మాటలకి చేర్చుకపోవటం గమనించవచ్చు. ఎవరైనా తమాషాకి అట్లా చేర్చినా అవి భాషలో ఎంతోకాలం నిలవవు.

'గ్లాసీ తిమిరాలు చెరిపించి
షైతాన్ మనల్ని పెరిషించినపుడు'

అని శ్రీ ఆరుద్ర వాడినా మిగతా తెలుగు కవులుగాని, తెలుగుభాషా వ్యవహర్తలుగాని వాటిని స్వీకరించక పోవటం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అందుకు కారణం భాషలో ఉన్న ఒకానొక నియమమే.

నామాల్ని క్రియలుగా వాడుకున్నట్టు గానే క్రియల్ని కూడా నామాలుగా వ్యవహరించుకో వచ్చు. పూర్వ వ్యాకరణాల్లో కృదంతపరిచ్ఛేదం ఈ పద్ధతుల్లోని నియమాల్ని సూచించటానికే.

పృథక్పదాల్ని మాత్రమే కాక వాక్యాల్నికూడా కొన్ని మార్పులు చేసుకొని భాషాభాగాల స్థానంలో మరో బృహద్వాక్యంలో ప్రయోగించవచ్చు. నామ పదాల స్థానంలో వాక్యాలను ప్రయోగించటం ఈ వ్యాసానికి విషయం. ఇదే* నామ్నీకరణమని ఈ

---

* Nominalize అనే ఇంగ్లీషుమాటకు సమానార్థకంగా నామ్నీకరణం వాడను. ఇంగ్లీషులో ఈ మాట చాలా ఇటీవలె ప్రచారంలోకి వచ్చింది. నామన్ అనే నకరాంత శబ్దానికి చ్వి ప్రత్యయాన్ని చేర్చడంవల్ల నామ్నీకరణం సాధ్యమవుతుందనుకున్నాను. అట్లా సాధ్యంకాకపోతే, ఇది తప్పయితే సాధురూపాన్ని సూచిస్తే దాన్నే ఆర్యాతి వ్యాసాల్లో గ్రహిస్తాను.

వ్యాసంలో వ్యవహరించ బడింది. నామ్నీకరణమంటే నామంకాని దాన్ని నామంచెయ్యటం. ధాతువులకు ప్రత్యయాదుల్ని చేర్చి నామాలుగా వ్యవహరించటాన్నికూడా నామ్నీకరణం అనవచ్చుగాని ఈ పదం ఈ వ్యాసంలో వాక్య నామ్నీకరణానికి పరిమితం. ధాతు నామ్నీకరణం పద నిర్మాణానికి సంబంధించిన విషయం. వాక్య నామ్నీకరణం వాక్య నిర్మాణానికి సంబంధించిన విషయం.

విషయార్థక నామ్నీకరణం

1. 'ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడు.'

2. 'ఆ విషయం (లేక ఆ సంగతి) నాకు తెలుసు.'

సాహితీప్రియులైన ఇద్దరు తెలుగువాళ్ల మధ్య జరగటానికి వీలున్న ఈ పై సంభాషణ పరిశీలిస్తే రెండో వాక్యంలోని ఆ విషయం (లేక ఆ సంగతి) మొదటి వాక్యం మొత్తానికి బదులుగా వాడబడిందని గ్రహించవచ్చు. ఆ విషయ మేమిటో మొదటి వాక్యంలో చెప్పబడింది కాబట్టి మళ్లీ ఆ విషయాన్ని చెప్పే అవసరంలేకుండా రెండో వ్యవహర్త 'ఆ విషయం' అని సంగ్రహించి చెప్పాడు. మొదటి వాక్య సందర్భం లేనప్పుడు ఆ వాక్యాన్ని రెండో వాక్యంలో ఏదోవిధంగా మిళితంచేసి చెప్పాలి. 'ఆ విషయం' అనే మాటకు బదులుగా మొత్తం వాక్యాన్ని ప్రయోగించాలి. ఇక్కడ విషయ శబ్దానికి వాక్యంలో చెప్పిన యావద్విషయం అని అర్థం. విషయార్థక నామ్నీకరణం అని అనటం కూడా ఇందుకే. ఇట్లా విషయార్థంలో వాక్యాన్ని ప్రయోగించటానికి కొన్ని మార్గాలున్నై. అందులో ఒకటి వాక్యానికి 'అని' అనే రూపాన్ని తగిలించటం. (అని శాబ్దికంగా అను ధాతునిష్పన్నమైన క్త్వార్థకరూపం. ఆర్థికసంబంధం కనిపించదు.) అప్పుడు రెండు వాక్యాల్ని 'అని' చేత అనుసంధిస్తే,

3. ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడని నాకు తెలుసు.

అన్న సంక్లిష్టవాక్యం ఏర్పడుతుంది. వ్యాకరణ సూత్రాలవల్ల కలిసిన రెండు వాక్యాల సంయోగరూపం సంక్లిష్టవాక్యమని వ్యవహృతం. ఈపై సంక్లిష్టవాక్యంలో 'అని'కి పూర్వమున్నభాగం విషయి, 'అని'కి తరవాత ఉన్నభాగం విషయం. ఇవి పారిభాషిక పదాలుగా ఈ వ్యాసంలో ప్రయుక్తం. వీటిని ఇంగ్లీషులో Topic and comment అంటారు. అలంకార శాస్త్రంలో వీటి అర్థాలు భాషావేత్తలకు తెలుసు. తత్తుల్యమైన అర్థంలోనే ఈ వ్యాసంలో ప్రయుక్తం.

ఈపై సంక్లిష్టవాక్యంలో నామప్రవర్తన కలిగిన (నామ్నీకృతం చేయబడిన) వాక్యాన్ని విశేషణీకృతం చేయవచ్చు. 'అని'ని 'అన్న' లేక 'అనే' అని మార్చి సంగతి లేక విషయం అనే మాటల్ని చేరిస్తే మొదటివాక్యం విశేషణీకృతం అవుతుంది. అప్పుడావాక్యం ఇట్లా ఉంటుంది. అర్థంలో భేదం ఉండదు.

4. ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడన్న సంగతి నాకు తెలుసు.

'అను' ధాతువుకున్న బహు విశేషణ రూపాల్లో రెండు మాత్రమే ఇక్కడ (అర్థభేదం లేకుండా) ప్రయోగించగలుగుతాం. వీటికి వ్యతిరేక రూపాలు కూడా ఇక్కడ ఉండవు. అంటే 'అన్నసంగతి' స్థానంలో 'అననిసంగతి' అని ప్రయోగించలేం. పై వాక్యాల్లో 'అని' ప్రత్యయతుల్యం. అంటే శబ్ద రూప సాధనలో ప్రత్యయంచేసే పనిని వాక్య నిర్మాణంలో 'అని' చేస్తున్నదన్నమాట. ఇట్లాంటివాటిని అవయవి సూచకాలు (Construction markers) అనవచ్చు. అంటే ఇక్కడ 'అని' చేసే పనల్లా తనకు పూర్వపు వాక్యం పద్ధతీ, ప్రవర్తా ఈ వాక్యంలో ఇదీ అని సూచించటం. అంతకన్నా ఈ 'అని'కి ప్రత్యేకమైన ప్రయోజనమున్నట్లు కనిపించదు. అంతర్నిర్మాణమున్న వాక్య, వాక్యాంశాలు అవయవులు (Constructions), వాటిలో పృథగ్భాగాలు అవయవాలు (Constituents). (అవయవి—అవయవం అనే మాటల్ని పై అర్థంలో ప్రయోగించవచ్చునని శ్రీమతి నాయని కృష్ణకుమారిగారు సూచించారు).

విషయార్థక నామ్నీకరణంలో తచ్ఛబ్ద ప్రయోగం మరో పద్ధతి. తెలుగులో 'అది' అనే

శబ్దానికున్న బహుళ ప్రయోజనాల్లో ఇది ఒకటి. ఒక వాక్యాన్ని మరో వాక్యానికి 'అది' చేత అనుసంధించాలంటే ఆ వాక్యంలోని కాలబోధక ప్రత్యయ సహితమైన సమాపక క్రియారూపాన్ని విశేషణరూపంగా మార్చాలి. ఈ రూపాల్నే చిన్నయసూరి ధాతుజ విశేషణాలని వ్యవహరించాడు. ప్రౌఢ వ్యాకర్త క్రియాజన్య విశేషణాలనేమాట కూడా ఈ అర్థంలోనే వాడాడు. కాలవాచి ప్రత్యయ ప్రాధాన్యమున్న ఈ రూపాల్ని క్రియాజన్య విశేషణా లనటమే సముచితంగా కనిపిస్తున్నది. ఆధునికభాషలో ఒక్కో క్రియారూపానికి నాలుగేసి క్రియాజన్య విశేషణరూపా లుంటై. 'వండు' ధాతువును ఉదాహరణంగా తీసుకుంటే ఈ రూపా లిట్లా ఉంటై.

భూత: వండిన

తద్ధర్మ: వండే వ్యతిరేక: వండని

వర్తమాన: వండుతున్న

ఈ విశేషణరూపాల తరవాత తచ్ఛబ్దంలోని అకారం లోపించి 'ది' అనే రూపం మాత్రమే మిగుల్తుంది. ఇంతకుముందటి వాక్యాన్నే ఉదాహరణంగా తీసుకుంటే నామ్నీకరణం తరవాత ఇట్లా ఉంటుంది.

5. ఖలీల్‌జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించింది నాకు తెలుసు.

ఈ నామ్నీకరణం భూతకాల క్రియారూపం మీద చేసింది. మిగతా క్రియారూపాలకి కూడా ఇదే పద్ధతి సాధ్యమని స్పష్టం.

ఇంతవరకు క్రియలున్న వాక్యాల్ని నామ్నీకరించే పద్ధతి మాత్రమే పరిశీలించాం. క్రియలేని వాక్యాల్ని నామ్నీకరించటం ఎట్లా అనే సమస్య ఉంది. తెలుగులో రెండు నామాల్ని (నామం అనే శబ్దం నామబంధానికి కూడా గ్రాహ్యం) అనుసంధించటంవల్ల కొన్ని రకాల వాక్యా లేర్పడతాయని అందరూ ఎరిగిన విషయమే. ఉదాహరణకు:—

6. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త.

ఈ వాక్యం రెండు నామాలు సన్నిహితావయవాలుగా గల అవయవి. [ఈ వాక్యాన్ని 'నాకు తెలుసు' అన్న వాక్యంతో అనుసంధించాలంటే 'అని' చేర్చటం ఒక పద్ధతి. అక్కడ చిక్కులేదు. 'అది' చేర్చాలంటేమాత్రం క్రియ కావాలి. 'అది' కాలబోధక ప్రత్యయసహితమై ఉండాలి. దాన్ని విశేషణంగా మార్చాలి. ఇట్లాంటి సందర్భాల్లో క్రియ లేని వాక్యాలకి 'అగు' ధాతు క్రియారూపాల్ని అనుబంధించటంవల్ల ఉద్దిష్టలక్ష్యాన్ని సాధించవచ్చు.

7. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయింది (అయిన సంగతి) నాకు తెలుసు.

ఈ పై వాక్యంలో అస్పష్టత ఉంది. అంటే ఈ వాక్యానికి రెండు రకాలుగా తాత్పర్యం చెప్పవచ్చు.

8. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అని నాకు తెలుసు.

9. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయినాడని నాకు తెలుసు.

ఈ భిన్నార్థబోధ 'అగు' ధాతువుకున్న రెండు ప్రయోజనాలవల్ల ఏర్పడింది. 'అగు' ధాతువు ప్రత్యేక క్రియగా ఉపయుక్తమైనప్పుడు పరిణామార్థకం. ఆ అర్థమే వాక్యం (9) లో సూచితం. క్రియారహిత వాక్యాన్ని ఇంకో వాక్యంతో కలపటానికి అనుసంధిక రూపంగా ఉపయోగపడటం రెండో ప్రయోజనం. అది వాక్యం (8) లో వ్యక్తంచేసిన తాత్పర్యంవల్ల సూచితం. పై రకపు నామబంధ వాక్యాల్ని అపి చేదార్థాల్లో వాడాలన్నా 'అగు' ధాతు క్రియారూపాల్ని అనుబంధించాలి. ఉదాహరణకు:

10. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయినా చిన్న వ్యాకరణం రాశాడు.

11. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయితే చిన్న వ్యాకరణం ఎందుకు రాశాడు?

ఈ పై వాక్యాల్లో 'అగు' ధాతువు అనుసంధిక రూపంగా ప్రయుక్తం అయిన సంగతి స్పష్టమే.

తచ్ఛబ్ద నామ్నీకరణానికి కాలవాచి ప్రత్యయం అవసరమని పూర్వమే ఉక్తం. కాలవాచి ప్రత్యయం అసలే చేరని లేదా పరిమితంగా చేరే] క్రియలు కొన్ని

ఉన్నై. వాటిలో బుద్ధ్యర్థక ధాతువులైన 'వచ్చు', 'తెలియు' పేర్కొనదగినవి. ఉదాహరణకు:

12. తెలుగు వ్యాకర్తలకు సంస్కృతం వచ్చు(ను).

అభ్యాసయుక్తమైన నామాలు మాత్రమే ఈ 'వచ్చు'కు కర్తృపదస్థానంలో రాగలవు. ఈ పై వాక్యాన్ని తచ్ఛబ్దమైన 'అది'తో నామ్నీకరించలేం. 'వచ్చు' అన్న సమాపక క్రియతో కాలవాచి ప్రత్యయం లేకపోవటమే అందుక్కారణం. 'అని'తో నామ్నీకరించటానికి ఎటువంటి ఆటంకమూ లేదు. కాలవాచి ప్రత్యయ మున్నపుడు తచ్ఛబ్ద నామ్నీకరణమూ సాధ్యమే.

తెలియు ధాతువుకు కర్తృపద స్థానంలో అదృశ్య పదార్థ (Abstract) వాచియైన నామం వచ్చినప్పుడు మాత్రమే భూతకాలవాచి ప్రత్యయం సాధ్యం. అప్పుడు తచ్ఛబ్ద నామ్నీకరణం చేయవచ్చు. రానప్పుడు వీల్లేదు.

13. వాడికి వ్యాకరణం చదివేపద్ధతి తెలుసు.

14. వాడికి వ్యాకరణం చదివే పద్ధతి తెలిసింది.

పై రెండు వాక్యాల్లో రెండో వాక్యానికి మాత్రమే తచ్ఛబ్ద నామ్నీకరణం సాధ్యం.

15. వాడికి వ్యాకరణం చదివేపద్ధతి తెలిసింది (తెలిసిన సంగతి) నాకు తెలియదు.

ఈ వాక్యంలో 'తెలిసింది' అనేరూపం క్రియ కాదు. క్రియాజన్య విశేషణానికి తచ్ఛబ్దం చేర్చటం వల్ల ఏర్పడిన నామరూపం.

ఈ పైన ఉదాహరించిన వాక్యం కొంత కృతకంగా కనిపించేమాట వాస్తవమే. ఈ వాక్యం ఇంతకుముందు ఎప్పుడూ ఎవరూ ప్రయోగించి ఉండక పోవచ్చు. ఇకముందు ప్రయోగించక పోవచ్చు కూడా. ప్రయుక్త వాక్యాల్నిమాత్రమే వ్యాకరించా లనటం వ్యాకరణ ప్రయోజనాన్ని సంకుచితం చేయటమే. ప్రయోగించటానికి వీలున్న వాక్యాలుకూడా వ్యాకరణ విషయాలే. ఈ పై వాక్యానికి ఈ వ్యాఖ్యాన కర్త చెప్పిన అర్థం తెలుగు భాషా వ్యవహర్త అంతరీకరించుకున్న వ్యాకరణం అనుమతిస్తుంది. ఈ పై వాక్యాల్ని సృష్టించగలిగిన వ్యవహర్త శక్తిని 'ప్రతిభ' అనీ, వాక్యాల్ని వ్యవహారంలో ప్రయోగించటాన్ని 'ప్రవృత్తి' అనీ అనవచ్చు. ప్రతిభా ప్రవృత్తులు (Competence and Performance) భాషా శాస్త్రంలో పారిభాషిక పదాలు. ఈ సిద్ధాంత విషయాలను విస్తారంగా చర్చించటానికి ఇదిసమయంకాదు.

తెలుగులో అన్నింటి క్రియల తరవాత కొన్ని భావ విశేషాలను వ్యక్తీకరించటానికి కొన్నిరకాల ధాతువుల్ని వాడతాం. ఆ ధాతువులకు కాలబోధక ప్రత్యయాలను సాధారణ ధాతువులకు వాడినంత విస్తృతంగా వాడలేం. ఉదాహరణకు ఈ కింది వాక్యాలను గమనించండి.

16 ఏ శాస్త్రమైనా మాతృభాషలో బోధించ వచ్చు.

17. ఇతరుల విషయాల్లో తలదూర్చ గూడదు.

18. అరసికుణ్ణి ఎవరు మెప్పించగలరు!

19. తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి (విన+వలయును).

అనుమత్యర్థంలో 'వచ్చు'కు నిషేధార్థంలో 'కూడు' కు, కాలవాచి ప్రత్యయాలు చేరవు. సామర్థ్యార్థంలో 'కలుగు' కు కాలవాచి ప్రత్యయాలు చేరతై కాని–కల–అనే రూపంలో ఉన్నప్పుడు మాత్రం చేరవు. 'వలయు' కు భూతకాలవాచి ప్రత్యయం మాత్రమే చేరుతుంది. అదీ అసమాపక క్రియగా ఉన్నప్పుడు మాత్రమే. ఉదాహరణకు :

20. రావాల్సి వచ్చును.

'వలయు' ధాతువుకి కాలబోధ వ్యక్తీకరించి సమాపకక్రియగా వాడాలంటె వలయు ధాత్వర్థక రూపానికి 'వచ్చు'గాని 'ఉండు'గాని అనుప్రయుక్తం చెయ్యాలి.

ఈ ధాతువు లీ సందర్భాల్లో కాలబోధక ప్రత్యయవాహకాలు (Tense carriers) గా మాత్రమే వర్తిస్తై. ఉదాహరణకు :

21. తెలుగు పండితులు భాషాశాస్త్ర ప్రాధాన్యం గుర్తించాల్సిఉంది.

22. అయిదేళ్లకి తెలుగులోనే భాషాశాస్త్రం బోధించాల్సివస్తుంది.

కాలవాచి ప్రత్యయయుక్త క్రియారూపాలున్న (21) (22) సంఖ్యగల వాక్యాలు తచ్ఛబ్ద నామ్నీకరణార్థాలు. కాని (16) నుంచి (19) వరకూ సంఖ్యలుగల వాక్యాలు కాలవాచి ప్రత్యయ రహితాలు గనక తచ్ఛబ్ద నామ్నీకరణానర్హాలు.

పై వాక్యాల్లో (16), (19) సంఖ్యలుగల వాక్యాలు క్రియావిభక్తి రహితాలు. (17) లో ఉన్నది క్రియావిభక్తి అవునో కాదో చెప్పలేం. (21), (22) సంఖ్యలుగల వాక్యాల్లో క్రియావిభక్తివంటి రూపం కనిపిస్తున్నదికాని కర్తృపదాన్వయం—అంటే కర్తృపదస్థ లింగవచనాదుల బోధ—ఉన్నట్టులేదు. ఈ సందర్భాల్లో పూర్వవ్యాకర్తలు అన్నంత రూపంలో ఉన్న ప్రధాన క్రియను ధాతువుకు భావార్థంలో 'నుటీ'ని విధించటంవల్ల నామంగా సాధించి వలయ్యాద్యనుబంధ క్రియలకు దీన్ని కర్తగా నిర్దేశించారు. ఆ సందర్భంలో వారు రచించిన సూత్రాలివి.

'వలయ్యాది క్రియలకుం గర్తయగు భావంబు నందు నుటీ యగు.'

'వలయ్యాది క్రియలకు గర్తృభూతక్రియా వృత్తియగు ధాతువునకు నుటీ వర్ణకంబగు.'

బాలవ్యా-క్రియ-సూ 122.

'కర్తృభూత క్రియతోడం దత్కర్త కన్వయంబగు.'

ప్రౌఢ వ్యా. క్రియ. సూ 27.

పూర్వ వ్యాకర్తల నిర్దేశం ప్రాచీనభాషకు సరిపోవచ్చు. ప్రాచీన భాషలో క్రియాబంధంలోని వలయ్యాద్యనుబంధ క్రియలు అన్నంత క్రియలతో సంహితగానేకాక వ్యవహితంగాకూడా ప్రయుక్తం. అంతేకాక భూతభవిష్యత్కాల బోధక క్రియారూపాలకు ప్రథమ పురుష క్రియా విభక్తి లింగ వచన భేదాలను సూచించదు. అందువలన అన్నంతమైన ప్రధాన క్రియా రూపాన్ని భావార్థక నామంగా భావించి వలయ్యాద్యనుబంధక్రియలకు కర్తగా నిర్దేశించటంలో అంతచిక్కులేదు. కాని ఆధునిక భాషలో క్రియా విభక్తి కర్తృపదస్థ లింగవచనాలను సూచించాలి. అందువల్ల ఈ పద్ధతి ఆధునిక భాషకు ఎంతవరకు సరిపోతుందో చెప్పలేం. అదీగాక బుద్ధ్యర్థక ధాతువులైన 'ఎరుగు' 'తెలియు' 'వచ్చు' కాలవాచి ప్రత్యయం లేనప్పుడు క్రియా విభక్తి రహితంగానే ఉంటై. ఇవి అన్నంత క్రియా సహాయం లేకుండానే ప్రయోగ యోగ్యాలు. అందువల్ల ఆధునిక భాషలో అన్నంత క్రియలను వలయ్యాద్యనుబంధక్రియలకు కర్తగా నిర్దేశించటంకంటే వ్యవహితత్వంలేని అన్నంత క్రియారూపయుక్త వలయ్యాదులను ఏకపదబంధంగానే గ్రహించి అన్నంతక్రియకు కర్తృభూతమైన నామాన్నే మొత్తం క్రియాబంధానికి కర్తగాచెప్పి ఎరుగ్వాదులకు, వలయ్యాదులకు కాలవాచి ప్రత్యయాభావంలో క్రియావిభక్తి ఉండదనీ, 'వలయు'కు కాలవాచి ప్రత్యయ వాహకాలైన 'ఉండు' 'వచ్చు'లకు సర్వలింగ వచనాల్లోనూ 'ది' ప్రత్యయం మాత్రమే విహితమనీ సూత్రించుకోటం సముచితంగా కనిపిస్తున్నది.

ఇంతవరకు పరిశీలించిన నామ్నీకరణాల్లో మూలవాక్యంలోని కాలబోధకి బాధ కలగలేదు. విషయార్థక నామ్నీకరణంలోనే ధాతువుకు భావప్రత్యయం చేర్చటం ఇంకోపద్ధతి. ప్రాచీన భాషలో 'ట' భావ ప్రత్యయం. ఆధునిక భాషలో 'అటం' (అడం కూడా అటంచేత గ్రాహ్యం). పూర్వ వ్యాకర్తలు భావ ప్రత్యయాన్ని ధాతువుకి విధించారు. ('ధాతువునకు' బాలవ్యా. క్రియ. సూ 1, 'టవర్ణకంబు భావంబునందగు' బాలవ్యా. క్రియ. సూ. 35.) ఆధునిక భాషలో కాలబోధక సమర్థమైన ధాతువులకే (కాలవాచి ప్రత్యయ వాహకాలుకూడా గ్రహించాలి) భావప్రత్యయం చేర్చ గలుగుతాం గనక ధాతువునకు అనకుండా కాలవాచి ప్రత్యయయుక్త సమాపక క్రియారూపాలకు అనటం సమంజసంగా కనిపిస్తున్నది. భావప్రత్యయం చేరినప్పుడు ధాతువుకు పూర్వ హితమైన లిడాదులకు, డుజాదులకు లోపం వస్తుందని చెప్పుకోవచ్చు. కాల వ్యక్తి భావార్థక

రూపంలో కలిసిపోతుందన్నమాట. అందువల్ల భావార్థక రూపం సర్వకాల బోధకమవుతుంది. కాలవాచి ప్రత్యయయుక్త సమాపక క్రియలకే భావప్రత్యయం చేరుతుందనటంవల్ల తదభావంలో చేరదని తాత్పర్యం. కాలవాచి ప్రత్యయం చేరని వలయ్యాదుల ఆధునిక భాషలో భావప్రత్యయం చేరక పోవటం గమనించదగింది. అంటే అనుబంధంగా వచ్చే 'వలయు', 'వచ్చు' 'కూడు' (చూ. వాక్యాలు 16, 17, 19), 'తగు' 'చాలు' మొదలైన ధాతువులకు కాలవాచి ప్రత్యయం చేరదు. కాబట్టి భావప్రత్యయమూ చేరదు. స్వతంత్ర క్రియలుగా వర్తించే ఎరుగ్వాదుల్లో 'ఎరుగు'కు కాలవాచి ప్రత్యయయుక్త సమాపకక్రియారూపమూ లేదు, భావప్రత్యయమూ చేరదు. 'ఎరగటం' అనే రూపం తెలుగులో ప్రచురంగా లేదు. 'ఎరిగి',- 'ఎరక్క' అనే అసమాపకక్రియారూపాలూ, 'ఎరిగిన', 'ఎరగని' అనే క్రియాజన్యవిశేషణరూపాలుమాత్రం కనిపిస్తున్నై. 'తెలియు', 'వచ్చు'లకు 'తెలియటం' (లేక 'తెలవటం') 'రావటం' అనే రూపాలున్నైగాని అవి ఆ ధాతువుల కాలవాచి ప్రత్యయయుక్త సమాపకక్రియారూపజన్యాలని గ్రహించాలి.

ఆధునికాంధ్రంలో భావప్రత్యయం చేరినప్పుడు ధాతువుకు 'ముత్తు'పరమైనప్పుడు జరిగే ఆదేశకార్యం జరుగుతుంది (ప్రాచీనాంధ్రంలో భావప్రత్యయం ముందిట్లాంటి ఆదేశంలేదు). ఉదాహరణకు 'ముత్తు' పరమైనప్పుడు 'వచ్చు'కు 'రా'అని,'తెచ్చు'కు 'తే'అని ఆదేశాలవుతై. ఈ ఆదేశరూపాలే 'అటం' ముందు ప్రయుక్తం. దీర్ఘాంతైకస్వరయుత ధాత్వాదేశరూపాలకు 'అటం' పరమైనప్పుడు వడాగమం (వకారాగమం) అవుతుంది. పై రెండు ధాతువులకి 'అటమంత' రూపాలకు ఈ విధంగా నిష్పత్తి చూపించవచ్చు.

వచ్చు + అటం > రా + అటం > రా + వ్ + అటం > రావటం.

తెచ్చు + అటం > తే + అటం > తే + వ్ + అటం > తేవటం

కాలవాచి ప్రత్యయాలు లోపించిన 'అటమంత' రూపాలు ఆయా సందర్భాల ననుసరించి సర్వకాల బోధకాలవుతై. ఉదాహరణకు.

(23) ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించటం నేనెరుగుదును.

(24) ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడు—తెనిగిస్తున్నాడు—తెలిగిస్తాడు.

(23) సంఖ్యగలవాక్యం (24) సంఖ్యగల వాక్య సమూహంలో ఏ క్రియా రూపాన్నుంచైనా నిష్పన్నం కావచ్చు. కాలబోధ ప్రధానం కానప్పుడు భాషా వ్యవహర్త 'అటమంత' నామ్నీకరణాన్నెన్నుకోవచ్చు.

ఈ విషయార్థక నామ్నీకరణం అన్నిరకాల వాక్యాలకూ సాధ్యపడదు. విధ్యర్థక, ప్రశ్నార్థక వాక్యాలకు విషయార్థక నామ్నీకరణంలేదు. అవిధ్యర్థక, అప్రశ్నార్థక వాక్యాలకు వాటి వ్యతిరేక రూపాలతోసహా ఈ నామ్నీకరణం సాధ్యం. ఎరుగ్వాదులకు, వలయ్యాదులకు విధ్యర్థక రూపాలు లేక పోవటం గమనించదగింది. ఈ నామ్నీకృత వాక్యాలను మరో వాక్యంతో అనుసంధించాలంటే ఇంకా కొన్ని విధి నిషేధాలున్నై. 'అని' చేత నామ్నీకృతం చేయబడిన వాక్యం నామబంధ వాక్యాల్లో (క్రియా రహిత వాక్యాలు) ప్రయోగార్హం కాదు. నామ్నీకృతం చెయ్యని రెండో వాక్యంలో బుద్ధ్యర్థక ధాతువులు, శ్రవణార్థక, వచ్యర్థక ధాతువుల్లాంటివి మాత్రమే క్రియా రూపాలుగా ఉండాలి.

ఈ వ్యాసంలో 'అని', 'అది', 'అటం' విషయార్థక నామ్నీకారకాలుగా ప్రతిపాదితం. వీటికి భాషలో వేరే ప్రయోజనాలు కూడా ఉన్నై. ఇవి ఇతర నామ్నీకరణాల్లో ఉపయుక్తమవుతై. వాటి వివరాలు ఇంకోసారి.

పరమ భాగవతాంబరీష రాజవిలాసము

పరమ భాగవతాంబరీషరాజ విలాస మనునది యాఱాశ్వాసముల ప్రబంధము. ప్రసంగ వశమునఁ దాళపత్ర సంపుటముల దుస్థితిని గూర్చి ప్రస్తావింప మా బంధువు మామిడిమడ్డ గ్రామ (మహబూబునగరం జిల్లా) గ్రామవాసియగు బ॥ శ్రీ॥ జోషి రామచంద్రయ్యగారు మఱికొన్ని గ్రంథములతోపాటు దీని యసమగ్ర ప్రతిని నాకందఁజేసిరి. ఇది మొన్న మొన్నటివరకు సమగ్రముగా నుండెననియు, దానిని పిల్లలాడుకొనుట కుపయోగించి యీగతిపొందించిరనియు దానినిచ్చినయొక వైశ్యసత్తముఁ డనెనట. ఈ విషయమును వినగానే తాళీదళ సంపుటముల సేకరణమునకెంత శీఘ్రముగ, నెందఱు పూనుకొనిన బాగుండునో యనిపించెను.

ఇందు 24 తాళీదళములున్నవి. అందొక్క ఆశ్వాసాంత గద్యమాత్రము గలదు. దాని నీక్రింద బొందుపరచుచున్నాను.

'ఇది శ్రీమద్వేంకటాచల శరణ కర సరసిరుహ తరుణ సహస్ర కిరణ కిరణాలంకరణచణ ధారాధర తత్ప్రదర్శన సుదర్శనాగణ్య కారుణ్య కటాక్ష దర్శన కిరణకర్ణనామృతధారాస్పర్శన వినోదితాక్షీణాంధ్రగీర్వాణకవితాచాతురీధురీణ సకల ప్రధానాఖండల కొండలరాయ లక్ష్మ్మసుచరిత్రా సుపుత్ర హరితమహర్షి పవిత్రగోత్ర సుధార్ణవ శరత్పూర్ణిమా కళానిధిమూర్తి సంబరాబ్బోషహమూర్తి ప్రణీతంబైన పరమ భాగవతాంబరీష రాజ విలాసంబను మహాప్రబంధంబునందు తృతీయాశ్వాసము'

ఈ గద్యవలనఁ దెలియనగు విశేషములు.

1. వీరు హరితసగోత్రులు. 2. మాతాపితలు లక్ష్మ్మసుచరిత్ర కొండలరాయలు. 3. శ్రీ మద్వేంకటేశకరస్థ సుదర్శన సమారాధనాత్తక్షీణాంధ్ర గీర్వాణ కవితా ధురీణుఁడు. 4. పేరు సంబరాబ్బోషహ మూర్తి.

ఇతఁడీ గ్రంథమును శ్రీ మద్వేంకటాచలపతి కంకిత మొనరించెను. ఇష్టదేవతాస్తుతి, తదనంతరము *పూర్వ కవీంద్ర వందనము నొనరించి మహా ప్రబంధ నిర్మాణ కుతూహలియై యుండ నొక్కనాఁడు స్వప్నమునం దితని కిష్టదైవతమైన శ్రీ వేంకటాచలపతి సాక్షాత్కరించి నా చరితమైనను, నా భక్తుల చరితమైనను నాకు సంతోషదాయకమేగాన మద్భక్తాగ్రేసరుఁడగు నంబరీషరాజు చరిత్రంబును ప్రబంధముగా సంతరించి నా కంకితము జేయుమని కోరెనట.

మరునాఁడుదయముననే పండితుల కీ విషయమును దెలుప వారితని జన్మధన్యతను బొగడి, యాతని వంశ వైశిష్ట్యంబును విన్పించిరట. ఇతని వంశక్రమము గ్రంథస్థ సాక్ష్యమునుబట్టి ఈ క్రింది విధముగ విశదమగుచున్నది. అదియు నసమగ్రమే.

నారాయణుని నాభి పద్మమునుండి బ్రహ్మ జనించెను. ఆతని మానసపుత్రులై మరీచి పులహాదు లుదయించిరి. వారి పుత్రపౌత్రాదులే భువనమంతయు వ్యాప్తిఁజెందిరి. వారిలోఁ బితామహనిభుఁడగు నంగిరసుఁ డుదయించెను. అతనికి దేవపూజ్యుఁడగు హరితుఁడుదయించెను. ఆ హరితాన్వయంబున మహామహులగు విష్ణుభక్తులనేకులు జన్మించిరి. అందు సంబరాజు పుట్టెను. ఇతడు ధనమున రాజరాజు, అభిమానమున రారాజు. అందమున రతిరాజు. కళలందు రాజు. అతడే వంశాగ్రేసరుఁడు. ఇతని వంశమున నరసింహుఁ డుదయించెను. అతని కచ్యుత పాద పంకజధ్యానపరాయణుఁడగు చెన్నమరాజు పుట్టెను. అతడు వెంకమాంబయందు సముజ్వలగాత్రులు దానకర్ణులునగు మువ్వురు పుత్రులఁ గాంచెను. అందగ్రజుఁడు నారసింహుఁడు. అతఁడు తిరువతమ్మయందు నలువురు పుత్రుల గాంచెను. అందు మొదటివాఁడు సతత కవిత్వతోషిత భుజంగమశాయియగు శేషశాయి. రెండవవాడు వేంకట నారసింహుఁడు. మూడవ వాఁ డంచిత కమనీయభవ్యగుణశేఖరరత్నమగు రత్న

* ప్రాచేతసుని, సాత్యవతేయుని, ద్వాదశ సూర్యులను, పరాంకుశుని, నాథముని, శ్రీరామమిశ్రుని, పుండరీకాక్షులను, పూర్ణాచార్యుని స్తుతించినట్లు —తరువాత నొక కమ్మ లోపించినది— తెలుఁగు కవుల స్తుతియు నుండవచ్చునేమో!

యార్యుఁడు. వాలవ వాఁడచ్యుత గురుభక్తి సూర్యుఁడగు సూరనార్యుఁడు. రెండవవాఁడగు వేంకట నారసింహుఁడు నాచమాంబయందు ముప్వురు పుత్రుల నిరువురు పుత్రికలను వార్నిధి సురద్రుమ పంచక మునువలె నుత్పాదించెను. అందు మొదటివాఁడు చంద్రమౌళి సదృశుఁడగు చంద్రమౌళి. రెండవవాఁడు కొండలరాయప్రధాని కుంబరుఁడు. ఇతనిని వర్ణించుచుఁ దరువాత వాక్యపీసము గలదు. అది సమాప్తము కాకమునుపే యొక కమ్మ లుప్తమగుట నింతవరకే వంశావళినిఁ దెలియ వీలగుచున్నది. తరువాతి కమ్మ విషయాంతర ద్యోతకము. ఇందు కొండలరాయని గూర్చి విశేషముగ వర్ణించుటవలనను, ఆశ్వాసాంత గద్యవలనఁ గృతికర్త తండ్రి కొండలరాయఁడని తెలియుచుండుటవలన నత డితడేయని యూహించుట అసమంజసముకాదు... వంశక్రమము నిట్లు వ్రాయ వచ్చును:

ఇది యాఠాశ్వానముల గ్రంథమని పైని నేను వ్రాసిన విషయము నా యూహ మాత్రమే. 33 వ కమ్మ చివర నేను జూపిన తృతీయాశ్వాసాంత గద్య గలదు. 65 వ కమ్మ చివర

'కం. తపమునకు మెచ్చి లక్ష్మి
(ప్రాప?) పతి గరుడుని నెూదనెక్కి ప్రత్యక్షంబై
నృపుని విమానముపై నిడి
కృప పరమపదమునన్ సుఖింపగ మనిచెన్

వ. అని సూతుండు శౌనకాదిమునులకు నివ రించెనని పరీక్షిన్నరేంద్రునకు'............(ఇంతటితో దీనికి సంబంధించిన తాళీదళములు అయిపోయినవి.) అని కలదు. ఆశ్వాసాంత సూచకమగు వచనము, అంబరీషునకు పరమపద మొసంగుట యను విష యము లిందుంటంబట్టి యిది యాశ్వాసాంతమేగాక గ్రంథ సమాప్తియునని యూహించుట పొరపాటు

నారాయణుఁడు
|
బ్రహ్మ
|
మానసపుత్రులు
|
(హరివంశమున) అంగిరసుడు
|
హారితుఁడు
|
(అతని వంశమున) సంబరాజు
|
(అతని వంశమున) నరసింహుఁడు
|
చెన్నమరాజు> (భార్య వెంకమాంబ)

(భార్య—తిరుమలమ్మ) <నారసింహుఁడు.   పేరు తెలియదు.

తిమ్మరాయి   వేంకటనారసింహుఁడు (భార్య నాచాంబ)   రత్నయ్య   సూరయ్య

చంద్రమౌళి   కొండలరాయఁడు   పుత్రుఁడు   పుత్రిక   పుత్రిక

[సంబరాట్చ్రేషిహ]

కాదు. 33 వ కమ్మయందుఁ దృతీయాశ్వాసము సమాప్తమగుటచే, దాని పరిమాణమునుబట్టి 66 వ కమ్మలో సమాప్తి నందుచున్న యీ యాశ్వాస మారవదియనుట సమంజసమేయని నా యభిప్రాయము. ఆశ్వాసపరిమాణము భిన్నభిన్నములుగ నుండుటయు నచ్చటచట గోచరించునుగాన నా యూహ నిశ్చయ మనుటకుఁ గొంకుచున్నాఁడను. ఇతర ప్రతులు లభించినచో వాని యాధారమున నిర్ణయింపఁదగిన విషయ మిది.

ఇందుఁ గవి కాలనిర్ణయమునకు వారి వంశావళితప్ప వే యాధారము నాకు గోచరింపలేదు. ఈ యాధారములను సైతము నే నుపయోగించుకొన లేకపోవుటచే కవి చరిత్రాది పరిశీలనాదక్షులగు విద్వత్ప్రకాండుల కా బాధ్యతను వదలివేయుచున్నాఁడను.

నాకు లభించిన కవి చరిత్రలను గోలకొండ కవుల సంచికను బరిశీలింపగా నీ గ్రంథ ప్రసక్తి యందుఁ గానరాలేదు. కాన అజ్ఞాతములుగానున్న తాళిదళ సంపుటములలో నిదియు నొక్కటిగానోవు నని యీ విషయమును ప్రకటించుచున్నాను.

కవిత్వము — పాండిత్యము

భాష సలక్షణముగ నున్నది. పద్యముల నడ కనుబట్టి ధారాశుద్ధిగలవాఁడనుట కెట్టి సందియములేదు. ఆశ్వాసాంతగద్యలోఁ జెప్పికొనినవిధముగ నీత డాంధ్రగీర్వాణభాషలం దప్రతిమానప్రజ్ఞ కల వాడు. దొరకినన్ని పుటలలో—రెండు, మూడు, నాలు గర్థములుగల పద్యములు కొన్ని గలవు. ఒక్కొక్కటి యుదాహరించెదను.

రెండర్థముల పద్యము

రామషడక్షరీ జప ప
రాయణ నిర్మల రామణీయ హృ
త్తామరసుండు భూర్యచల
ధర్మధురీణుఁడు సర్వమంగళో
ద్దాముఁ డహీనభూషణుఁడు
దర్పకరూప విమర్దనుండు ను
స్థేముఁడు చంద్రమౌళి విల
సిల్లెను రెండవ చంద్రమౌళియై.

మూడర్థముల పద్యము

(బ్రాహ్మణ చంద్ర గరుడ స్తుతి)

విలసద్విష్ణు పదావలంబన మహా
విఖ్యాతిచే మించి మం
జుల లాక్షణ్యక భావితాన విభవస్ఫూర్తిన్
విజృంభించి ని
ర్మల దివ్యామృత లక్ష్మియుక్తకరులై
రాద్ధాంత సర్వజ్ఞ ని
స్తుల వృత్తిన్ ద్విజరాజు లట్ల
ద్విజరాజుల్ వొల్తురా ప్రోలునన్.

(అయోధ్యానగర వర్ణనము)

నాలుగర్థముల పద్యము

(రాజసూర్యచంద్రహంసల స్తుతి)

అలఘు కళా కమలాకర
సలలిత తేజోఽభిరామ సౌందర్యముచే
వలరాజహంస లటువలె
నలరుదు రావీట రాజహంసలు వేడ్కన్.

ఇట్టి పండితుల గ్రంథములు కాలగర్భమునఁ గలసిపోకుండ కాపాడుట—ప్రభుత్వ కర్తవ్యములలో నొకటియని విన్నవించుచు ముగించుచున్నాను.

—వింజమూరి శేషఫణిశర్మ.

భావప్రకాశిక-లుప్త విసర్గకస్వరవళి

అప్పకవీయమునందలి తృతీయాశ్వాసమునకు వెలువడిన వ్యాఖ్యానరూప గ్రంథములలో 'అప్పకవీయ భావ ప్రకాశిక' అనుపేర శ్రీ రావూరి దొరస్వామి శర్మగారిచే రచింపబడినది రెండవ గ్రంథమని నా యూహ. (వేదులవారి వ్యాఖ్యతో వెలువడినది మొద టిది.)

రెండు గ్రంథముల యందుమఁగూడ 'లుప్త విసర్గక స్వరవళి'ని గూర్చి చర్చ విపులముగాఁ గావింపఁబడినది.

ఈ విషయమున భావప్రకాశిక యందు (18 వ పుట) 'పదాంత సకారము విసర్గముగాఁ

బలుకఁబడును (రామస్—రామః, తమస్—తమః). అట్లే పదాంత విసర్గము సకారమగును. (విసర్జనీయస్య సః). సకార విసర్గముల కభేదము పాటింపఁబడును. అకారముమీఁది విసర్గయున్నను అకారముమీది సకారమున్నను నొకటే కావునను ఈ సంధి యందు విసర్గ (సకారము) లోపించి ఓత్వమువచ్చును. దానికిఁ బరమందున్న అత్వము నియతము లోపించును.' అను వివరణ వాక్యములుగలవు.

విసర్గ సకారముల కభేదము వైయాకరణము గాదు. పదాంతము నందలి సకారము విసర్గముగా బలుకబడదుగదా! మఱి యీ తొలివాక్యమెట్లు సరిపడును?' అనంతుఁడు గూడ 'తపస్' ఇత్యాది శబ్దము లందు 'తపః' అను రూపమును మనసునం దుంచుకొని విసర్గయని పేర్కొన్నాడు. దీనింబట్టి పదాంత సకార విసర్గల కభేదమనుట సిద్ధము' అను వీరి మఱియొక వివరణ వాక్యముచేః (19 వ పుట) 'స్థితస్యగతిశ్చింతనీయా' యనుటచేతనుః పోనిండు విసర్గసకారముల కభేదము పాటింపబడునని ప్రస్తుతమునకనుకొందము.

'ఈ సంధియందు విసర్గ (సకారము)లోపించి ఓత్వము వచ్చును. దానికిఁ బరమందున్న అత్వము నియతము లోపించును', ఈరెండును ప్రౌఢోక్తులవక తప్పదు. 'కింకరోఽహమ్' 'తమోఽర్కః' ఇత్యాది రూపముల ప్రక్రియ యందు విసర్గమునకుగాని వారిపక్షము ననుసరించి విసర్గమువంటిదైన సకారమునకుఁగాని లోపము విధింపబడలేదుగదా! విసర్గమునకు సత్వము, సత్వమునకు రుత్వము, దానికి నుత్వము తదుపరిగుణము— ఈవిధముగా ప్రక్రియసాగును. మఱి విసర్గ (సకారము) లోపించుననుట చెల్లనిమాటయే యనకతప్పదు.

గుణసంధినిఁజేసిన తదుపరి 'ఏఙః పదాంతాదతి' అను సూత్రముచే ఓకార-అకారములకు (రెంటికిని) పూర్వరూపమైన ఓకారమేకాదేశముఁగాఁగ 'కింకరోఽహమ్— తమోఽర్కః' ఇత్యాది రూపములు సిద్ధించును. ఇందు అత్వలోపప్రసక్తి లేదు. మఱి 'దానికిఁబరమందున్న అత్వము నియతము లోపించును' అను వివరణ వాక్యమెట్లు పొసగును? 'ఆదర్శనం లోపః' అనుటచేత అట్లని తందమనినను 'ఇది ప్రమాద పతితమేమో' యనుకొందమనిన 19 వ పుటయందు 'ఏఙః పదాంతాదతి' అను సూత్రముచే ఏ—ఓలపిఁదాది అత్వములోపించి 'దాసోహమ్' అను రూపము సిద్ధించును' అను వాక్యముగలదు. దీనింజూడ నట్లు అనుకొనలేము గదా! ('ఏఙః పదాంతాదతి' యను) దానిచే ఏ—ఓలమీఁదియత్వమునకు లోపము విధింపఁబడుటలేదు. అది పూర్వరూపసంధి విధాయక సూత్రము. (పదాంతాదేఙఃఅతిపరే పూర్వరూపమేకాదేశః స్యాత్).

20 వ పుటయందలి 'సంధిలోఁగానవచ్చునది ఓకారమైనను, అందుఁబరంబైన అకారస్వరము లోపించి గూఢముగానుండుటచే, అప్పకవిఁయిట్లు చెప్పె వాఁడని సరిపెట్టుకొనగును' అను వాక్యమునను, పై మూడుదాహరణములందును అత్తు పరంబగునపుడు విసర్గలోపించివచ్చిన ఓత్వమునకు అందకారము గూఢముగా నున్నదిగాన అ—య—హలతో పరుసగయతిమైత్రి చూపఁబడినది' యనువాక్యమునను, 21 వ పుటయందలి 'ఇందు రెండవపాదమున 'శేజోఽసహ్య' అను శబ్దమున (శేజః—అసహ్య) ఓత్వమునకుఁబరమై లోపించిన అకారమునకును యతిస్థానములో నిలిచియున్న హకారమునకునియతి చెల్లింపఁబడినది' యను వాక్యమునను క్రీగీతలుగల పదముల భావ మసంగతమనక తప్పదు.

పంచమీవిభక్తి విరామ సందర్భమున 'కన్నన్' 'కంటెన్' అనువాని రూపసాధనప్రక్రియను భాషా చరిత్ర ననుసరించియుజూపిరి. అదెంతయు నుచితముగ నున్నది. కయి—కై యనువాని విషయమున వారిచ్చిన సూచన తగియున్నది. ఇంకను బలుతావులందు శ్రీ దొరసామి శర్మగారు తమ పరిశోధనా నిపుణతను వెలార్చిరి. కాని పై విషయములందేలనో యొకింత చిన్నచూపును జూచిరని యనుటకు సాహసించుచుంటిని.

—రామబ్రహ్మం.

లేఖలు

దేశ్యపదములు

జనవరినెల 'భారతి'లో శ్రీ భాగవతము రామారావుగారు వ్రాసిన 'తెలుగు నిఘంటువులలో దేశ్యపదములపై చిన్నమాట' అను వ్యాసమును, మార్చినెల భారతిలో శ్రీ శాస్త్రి జి. బాహులేయ, శ్రీ వి. సత్యనారాయణరాజు, శ్రీ నెమిలికొండ చంద్రమౌళిగార్లచే సేకరించబడి, ముద్రించబడిన మాండలికపదములు పరిశీలించితిని. శ్రీ నెమిలికొండ చంద్రమౌళిగారు మాత్రము శ్రీ వేదము లక్ష్మీనారాయణగారిచే పరిష్కృతమై 1963వ సంవత్సరమున 6వ ముద్రణ కావించబడిన శ్రీ మహంకాళి సుబ్బారాయుడుగారి శబ్దార్థచంద్రికను పరిశీలించియుండలేదనే తలంచుచున్నాను. ఏలనంటే అధికపదజాలంతో వచ్చిన ఆ శబ్దార్థచంద్రికయందు శ్రీ నెమిలికొండ చంద్రమౌళి గారు సంప్రదించిన కొన్ని కొన్ని పదములు వారు చూపిన ఆ అర్థములు ఉండనే ఉన్నవి. నేను గూడ చంద్రికను పరిశీలించినవాడనే. నాకు లభించిన మరి కొన్ని మాండలికపదములు, ప్రసిద్ధ వ్యావహారికరూపములతో అర్థములు వాటికిచ్చుచున్నాను. ఈ క్రింది పదసేకరణలో భారతి, సాహితివంటి మాసపత్రికల లోను, ప్రభ, పత్రికలవంటి దినపత్రికలలోను గిడుగు వేంకటరామమూర్తి, వడ్లమూడి గోపాలకృష్ణయ్య గార్లవంటి వ్యావహారిక భాషావాదులవ్యాసములు, మరియు వారివారి గ్రంథముల సాహాయ్యమునుగొని శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులుగారి ఆంధ్రశబ్దరత్నాకరము (మొదటిభాగము–'అ–ణ'), శ్రీ మహంకాళి సుబ్బారాయుడుగారి శ. చ. ను సంప్రదించినాను. ఈ విధముగ సంప్రదించుటలో నాకు పెక్కువ్యాసములేకాక నిఘంటువులలో—పద్యనిఘంటువులు: శ్రీ వేంకటేశాంధ్రము, సాంబ నిఘంటువు, ఆంధ్రనామ సంగ్రహము, దేశ్యనామార్థకోశములు; గద్యనిఘంటువులలో మజ్జనకులు శ్రీ మునునూరి వేంకటశాస్త్రిగారి శబ్దార్థదీపిక, లఘుశబ్దార్థదీపిక, విద్యార్థికల్పతరువులు మిక్కిలి ఉపయోగించినవి. కాన ఏతద్రచయితల కందఱికి నా హృదయపూర్వక కృతజ్ఞతావందనములు కావించుచు నీ క్రింది కొన్నిపదముల నిచ్చుచున్నాను. పండితులియ్యవి పరిశీలించి పరిష్కరించుకొన ప్రార్థన.

1. అంకము: ఎగతాళి-ఆక్షేపము – హేళన.

2. అంకకాడు: జగడాలమారి — కలహశీలుఁడు– చలపట్టువాఁడు.

3. అంగరుశెల్ల: ఒక దినుసు పిండివంట. రూ. అంగరొల్ల.

4. అంగడివాడ: అంగడివీథి – విపణివీథి — బజారు.

5. అంగారు బొట్టు: చాదుమక్క – అగు(రు–లు) బొట్టు.

6. అట్ల: అలాగ, ఆలాగున, ఆవిధంగ అను వర్థములో కర్నూలుజిల్లా వాడుక. దీనినే హైదరాబాదువారు 'అట్టా' అని– గుంటూరు, చిత్తూరులు 'అష్ట' అని వాడుచున్నారు. ఈ విధంగానే 'ఎట్ల, ఎట్టా, ఎష్ట' అను రూపములు గూడా వ్యవహారములో కలవు. దీని రూపాంతరము అటుల.

7. ఆడంగులు: ఆడవాళ్ళ.

8. ఈరుపన్నె: 'ఈరువాన' అని గుంటూరు, కర్నూలు, నెల్లూరుమండలాల వాడుక. దీని తొలి రూపము ఈరుపెన. రూ. ఈర్పెన. ఈళ్లను పేళ్లను దీయుసాధనము – దువ్వెనవంటి సాధనము— చిక్కంటు.

9. ఓరుపురాయి: దీనిని గుంటూరుజిల్లాలో గీటురాయి—ఒరపిడిరాయి—సానెం చూడడం, ఒరుపు పెట్టడం అనే అర్థంలో వాడుతున్నారు.

10. కానరాళ్ళ: కోయలు.

11. కత్తిపిడి: త్సరువు (వృక్షవిశేషము) – వెమ్మలిపరుజా.

12. కమలాలు: తమ్మెట్లు–దుద్దులు.

13. కళ్లజోడు: సులోచనములు – ముక్కద్దములు.

14. కాయితము: కా(గి–కి)తము–కాగిదము.

15. కాఅడి: అట్టు—దూలు—నింద.

16. కిదువు: తక్కువరకము. విశే. హీన మైన.

17. కిరాణా: చిల్లరదినుసులు - భోజనసంభారములు. రూ. కిరానా.

18. కిరాయి: ఇంటియద్దె—బాడుగ. 'కూలి' అను నర్థములోను వాడుకగలదు.

19. కీనీడ: దీపము క్రిందినీడ — ఛాయ. అసలు రూపము. క్రీనీడ.

20. కీసరబాసర: అర్థముగాని భాష.

21. కుంట్లు: పనికి పోబరు కాని దివాలను 'కుంట్లు' అని వాడుదురు.

22. కుట్యాపిరి: కొంచెము మిగిలియున్న ప్రాణము—కొనయూపిరి – కుట్టుమురు.

23. కురంగట: చెంత—పొంత — చెంగట — చేరువ.

24. కైకిలి: ఏనాటిపని కానాడిచ్చెడు కూలి—దినబత్తెము. రూ. కైకూలి.

25: కొజ్జా: పుంస్త్వములేనివాడు — నపుంసకుఁడు. రూ. ఖొజ్జా.

26. కొట్వాలు: నగరమును శాంతి భద్రతలతో కాపాడువాడు—రక్షకభటుడు—రూ. కొత్వాలు.

27. క్యాబేజి: కేబేజిపూవు —పేమవు.

28. క్రమ్మున: త్వరగా - వడిగా. — రూ, క్రమ్మన.

29. గంట్లు: చెవిప్రోఁగులు—కమలాలు — రూ. గంటీలు.

30. గంకోడి: గంధకొడి—బుక్కా — గంధచూర్ణము.

31. గడిబిడి: గగ్గోలు-తొందర— అల్లరి. రూ. గడబిడ.

32. గబ్బునూనె: కిర్సనాయిలు — మంటి నూనె.

33. గమ్మున: ఒక్కపారిగా—వెంటనే, గబుక్కున—గభేలున అనునవి వ్యావహారికరూపములు.

34. గల్లంతు: అల్లరి—గగ్గోలు—గడిబిడి. రూ. గల్లత్తు.

35. గుడువు: బొప్పి—బొడిపి—కదుము.

36. గులుగుచేయు: ఒయ్యారము నటించు — చేతనైనట్లు నటించు, లోలోపలే నణగు—గొణుగు—ననుకు అనునవి వాడుకలో గలవు.

37. గెంతు: ఎగురు. రూ. గంతు.

38. చావు: పంచలతాను, చేయిచావు.

39. చిదుప: తునియ—తునుక — ముక్క—ఖండము.

40. చిన్నవూ: నమస్కారము—చెంగనాలు—బెంకణాలు—గిడిగిడి—జోహారు.

41. చిన్నలు: చిన్నవారలు—పిన్నలు.

42. చిల్లావల్ల: చెల్లాచెదరు.

43. చెంగట: కురంగట—చెంత — చేరువ—పొంత.

44. చేపావు: నమస్కారము—గిడిగిడి. రూ. చేచావు.

45 జంకవాడు: జడ్డుకాడు—సోమరి.]

46. జడ్డుకాడు: చూ. జంకవాడు.

47. జవాను: బంట్రౌతు—పోలీసు. రూ. జవాను.

48. జాగా: చోటు—స్థలము—ప్రదేశము.

జత్తు: జుట్టు—సిగ—వెండ్రుకలు

జుబ్బా: చొక్కా — కమీజు —అంగీ — కూసం—లాల్చీ. ఈ పర్యాయపదములు వేఱువేఱు మండలము లుపయోగించు మాండలికములు.

49. దొడికి: దుప్పటి-ద్విపటము.

50. నల్లా: కొళాయి-పంపు—పైపు — నీటిగొట్టము.

51. నాన్న: తండ్రి—నాయన—జనకుఁడు.

52. నెమిలి: నెమలి—మయూరము — రూ. నెవిలి.

53. పంచి: ధోవతి—కట్టుబట్ట.

54. పన్ని: దువ్వెన—చిక్కంటు—కంకతిక.

55. పలకపుల్ల: పలకపై వ్రాయు సాధనము—బలపము—కతివి.

పుట్నాలు : వేయించిన సెనగలు.

పేర్పు : ఒకదానిపై నొకటిపెట్టుట—దొంతర పెట్టుట. రూ. పేరువు.

బరిగె : ఉపాధ్యాయుఁ డుపయోగించు బెత్తము.

బుక్కా : గంధపొడి—గంధచూర్ణము. రూ. బుక్క.

బుల్లి : దీనినే కోయలు గుంట—చిన్నది—పిట్ట—బొట్టె. అనే అర్థాలతో వ్యవహరించుచున్నారు.

బొరవ: చిన్నకొండ—బొడవ. రూ. బు (ర—డ) వ.

మంటినూనె : గబ్బునూనె—కిర్సనాయిలు.

మహీసాక్షి : ధూపగుగ్గిలం—మహిషాక్షం—యక్షధూపం. రూ. మైసాక్షి.

మామ్మ : అవ్వ—అయ్యమ్మ — తండ్రితల్లి—నాయనమ్మ—బామ్మ

ముష్టివాఁడు : బిచ్చగాడు—తిరిపెగాడు.

మైలోడు : దుప్పటి—ద్విపటము.

మైదా : గోధుమపిండి—సైదము.

మోహన దుంపలు : చిలగడ దుంపలు—ఎఱ్ఱ దుంపలు.

లొజ్జతనము : లిగాడు తనము.

వెంకు : వెదకు, అన్వేషించు.

విసురురాయి : పిండి విసరుట కుపయోగించు ఱాతి పనిముట్టు—తిరుగలి—ఘరుట్టము.


సరీతము : అట్లకాడ. రూ. సరాటా.

సాలి : సాలెవాఁడు—సాలీఁడు—వేఁతకాండ్రు.

సీమనూనె : కిర్సనాయిలు—మంటినూనె—గబ్బునూనె.

సోయి : స్పృహ—మైమఱవు.

—మునునూరి సుబ్బారావు.



గ్రంథ విమర్శలు

స్వయంవరణం

[నవల. రచయిత : శ్రీ మహీధర రామమోహన రావు. ప్రచురణ యం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు. వెల : 2–00. పేజీలు 208.]

ఒక ఆశయ ప్రచారంకోసం వ్రాసిన నవల ఇది. ఈ రచనలో రచయిత బాహాటంగా చెప్పదలచిన సత్యం వర్ణవ్యవస్థ. ఆ సత్యం ఏ రూపంలో ఉండాలో, ఈ వ్యవస్థ ఎలా మారాలో దానినిగూర్చి రచయితకున్న అభిప్రాయానికి రూపకల్పన ఈ నవల.

భారతదేశంలో, అందునా ఆంధ్రదేశంలో గట్టి పునాదులుతో కాలం తాకిడికి చెక్కుచెదరకుండా వుంది వర్ణవ్యవస్థ. దాని తిరుతెన్నులు వీలైనంత వరకు మార్చాలని రచయిత దృష్టి. అందుకాయుధం నవల. ఈ నవల ఆ ఆయుధం.

ఈ వ్యవస్థ మారాలంటే మార్గం వర్ణాంతర, కులాంతర, మతాంతర వివాహాలు ఘంటాపథాలుగా రచయిత దృష్టి. ఈ దృష్టి తెలుగునాట పలువురు కవులూ రచయితలూ చెప్పిందే!

ఈ నవల చదువుతుంటే వివాహ వ్యవస్థ మారాలనా, వర్ణవ్యవస్థ మారాలనా, రచయిత చెప్పదలచుకొంది ఏమిటీ, అని పాఠకులకు ప్రశ్న కలగవచ్చు. కలుగుతుంది. కొందరు వివాహ వ్యవస్థలోని లోపంవల్ల వర్ణవ్యవస్థ మారాలని రచయిత భావించినట్లు తలపోస్తారు. మరికొందరు, వర్ణవ్యవస్థలోని లోపం సరిదిద్దటానికి వివాహవ్యవస్థ సముచిత పరికరం అని రచయిత భావన అనుకొంటారు.

నిజంగా రచయిత దృష్టి ప్రథమాంశంమీదనే అయితే ఈ నవల స్థాపించే మహత్తరశక్తి శంకాస్పదం అవుతుంది. ఆ శక్తి సుక్షేత్రంనుంచి ఉబికివచ్చిన ఊటకాదు. ద్వితీయాంశం అయితే పరిశీలనార్హం. అది ఉపయోగకరం.

'మనం ఏ దృష్టితో పనిచేసినా కులవ్యవస్థ దెబ్బతిని తీరుతుంది. తింటూంది. దానిని బ్రతికించటం ఎవరి తరమూ కాదు' అన్నమాటల వెనుక కులవ్యవస్థ దెబ్బతినకూడదని, ఎవరిచేతనయినా అయితే బ్రతికించటం మంచిది అని రచయిత అభిప్రాయపడుతున్నాడా అనుకొనేవాళ్ళు, ఆ అభిప్రాయానికి భిన్నంగా రచయిత చూపిన నవలాంతంలోని పరిష్కారం గమనించవచ్చు.

'కులవ్యవస్థకు ఆర్థికమయిన పట్టు ఎన్నడో పోయింది. సామాజికమయిన పట్టుకూడా అంతరించినట్లే! ఇంక రాజకీయపు పట్టుకొనసాగుతోంది.' ఇది ప్రత్యక్షర సత్యం. ఇటువంటి విషయాలు చెబుతున్న చోట రచయితకు లోకగమనంమీద ప్రత్యక్ష వ్యాఖ్యానంచేసే సామర్థ్యం ఉందని పాఠకులు భావించి తీరుతారు.

ఈ విషయం ఆంధ్రుల హృదయాలకు హత్తుకొనేట్టు చెప్పటానికి రచయిత స్వీకరించిన నవలాప్రక్రియలో కథ కులాంతర మతాంతర వివాహాలుతో కూడుకొన్నదే అయింది. అందుకోసం కొన్ని పాత్రలు సృష్టింపబడ్డాయి.

ఆ పాత్రలు రెండు తరగతులు. మొదటి తరగతి తల్లులూ–తండ్రులు. రెండో తరగతి కొడుకులూ–కూతుళ్ళు.

మొదటి తరగతివాళ్ళు పెద్దవాళ్ళు. నలభై, నలభై అయిదు, అంతకంటే ఇంకా ఎక్కువ సంవత్సరాల వయస్సు ఉన్నవాళ్ళు. వాళ్ళలో కొందరిది ఉత్త చాదస్తం. ఒట్టి ముసలి నస! మరికొందరు, అంతాయింతా అనరానంత మంచివాళ్ళు! వయస్సుకు మించిన జ్ఞానవృద్ధులు. వయస్సు వచ్చినా యువకులు!

రెండో తరగతివాళ్ళు కుర్రవాళ్ళు! మరీ కుర్రకారుగాదు. పాతికేళ్ళపైన, ముప్పయిఏళ్ళలోపు

వాళ్ళు. పెళ్ళిగానివాళ్ళు. ప్రేమ ధోరణి దొరికితే నిలవలేనివాళ్ళు. మాటకారులు! మంచివాళ్ళు!

ఈ నవల సగం భాగం వృద్ధుల బుద్ధుల వినోదాల లీలలు! పాఠకులకు అంతగా రుచించక పోవచ్చు. రెండో భాగం యువతీ యువకుల ప్రేమ శృంగారాల కథా కమామీషులు!

మొదటి భాగంలో పెద్దవారల రూపరేఖలు స్వభావాలు, మాటల తీరులు, వ్యవహారాల నేర్పులు, సిద్ధాంత చర్చల సామర్థ్యాలు, ఆలోచనా విధానాలు, నేర్పుగా చిత్రించబడ్డాయి.

రెండో భాగంలో యువతీ యువకులు కలుసుకోవటాలు, ప్రేమించుకోవటాలు, తల్లిదండ్రులను తిరస్కరించటాలు, పెళ్ళాడటాలు రచించబడ్డాయి.

ద్వివిధ మనస్తత్వాలు చిత్రించటంలో రచయిత సామర్థ్యం పాఠకులు గమనిస్తారు. వృద్ధుల మనస్తత్త్వ చిత్రణలో ఎంత వైవిధ్యం వుందో, యువకుల ఆవేదనలో ఆత్మీయతలో అంతవైవిధ్యం వుంది. ఏ కులం పిల్లనయినా తన కొడుక్కు చేసుకోగలననే తండ్రికి సరీగ్గా భిన్నంగా భిన్నకులం వాడికి తనకూతుర్నిచ్చి పెళ్ళి చేయటం చచ్చినా కుదరదనే తండ్రి ఉన్నాడు. ప్రేమించి, ఆరాధించి, తపించి పోయే ప్రియుడికి పెళ్ళిముందు శరీరార్పణం చేయటానికి జంకించే సుధకు సరీగ్గా భిన్నంగా, ప్రేమిస్తూ ప్రేమిస్తూనే ప్రియుడికి సర్వసంతోషాలు కలిగించటానికి సన్నద్ధమయ్యే రుక్మిణీ వుంది.

ఒక పెళ్ళి సందర్భంలో తారసపడిన నలుగురు పెళ్ళికానివాళ్ళకు రెండు పెళ్ళిళ్ళు—కులాంతర వివాహాలు—జరగటంతో నవల సమాప్తమవుతుంది. ఈ మధ్య కథ తిరిగిన మెలికలు, తల నెరిసినవాళ్ళు తిప్పిన డొంకతిరుగుళ్ళు చిత్రంగా వుంటాయి.

తండ్రులు కూతుళ్ళను అలా పెళ్ళిచేసుకోమని, సూచనలు చేస్తారా అన్నది ఆలోచించదగిందే అయితే, కూతురు పెళ్ళిచేయకుండా మాటా పలుకూ లేకుండా, రాబడి పోతుందే అని భయంతో మథన పడే మాష్టరులూ ఉంటారా అన్నదీ ఆలోచించదగిందే!

పెళ్ళిగాని పిల్లల్ని చూచి, వృద్ధులైనవాళ్ళు పడే సరదాలూ, వాళ్ళతో వీళ్ళు మాట్లాడే తీరులూ, పోయే పోకళ్ళు చూడాలంటే ఈ నవల చదవవలసిందే!

తెలివితేటలున్న పాత్రలకు, వయస్సూ తదుచితమైన కోర్కెలూ ఉన్న పాత్రలకు ముక్కుతాళ్ళు వేసి, తన ఆశయసిద్ధికోసం ఉపసంహారాభిముఖంగా లాక్కుపోతూ, ఏవీ ఎరుగనట్లు పాత్రలు సజీవంగా వుండాలంటే వారు వారి వారి ఇష్టాలతో స్వేచ్ఛగా మసలుకోవాలని నేర్పుగా చెప్పే పరమనిరంకుశ చక్రవర్తి ఈ రచయిత.

పరమ నైష్ఠికంగా, పరమనైతికంగా మాట్లాడుతాయి పాత్రలుకొన్ని. మహావేదాంతంతో, మరింత సిద్ధాంతంతో చర్చిస్తాయి మరికొన్ని పాత్రలు. ఒకటే శృంగారంగా, ఒకటే సుందరంగా, ఒకటే వయ్యారంగా, విలాసంగా వినోదంగా కేళీవిహారంగా, గలగలా గబగబా చలాకీగా, చులాగ్గా మాట్లాడేస్తాయి మరికొన్ని పాత్రలు.

ఈ నవలలో మాట లెక్కువ. మరీ మరీ మాట లెక్కువ. అంతెక్కువ చేష్టలు లేవు. సన్నివేశం కనిపించటంకంటే, సంఘటనలు దొర్లిపోవటంకంటే సంభాషణలు వినిపిస్తాయి. సాగిపోతాయి.

నవల నిండా సంభాషణలు. మొదటి సగం సామాన్య పాఠకులకు సరసంగా ఉండవు. మిగతా సగం సరదాగా వుంటాయి. కథాకథనం తక్కువ. సంభాషణలు ఎక్కువ. సంభాషణలు నాటకీయంగా వుంటే అదో అందం. అంత అందం వెతుక్కోవాలి.

సంభాషణ అంతా నాటకీయం కాలేదు. అలాగే అయితే లోకం అంతా బృహన్నాటకం అయి కూర్చుంటుంది. ఒట్టి సంభాషణలు ఒకొకప్పుడు విసుగు పుట్టించవచ్చు. ఒక పాత్ర మాట్లాడిన మాటకు ఉన్న రెండో అర్థం పాఠకులకు అర్థం కాలేదని రచయిత వివరించించోట్లు ఎక్కువ. ధ్వన్యాత్మక స్థితిపోయి వాచ్యమయి నీరసం అయిందే ఇక్కడా అని ఎక్కడయినా పాఠకులు అనుకొంటారు.

యువతీ యువకుల శృంగారచేష్టలు ధ్వనిగా చెప్పి వూరుకోలేదు రచయిత. వాచ్యంగా ఒక్కసారి

చెప్పి తిమ్మనకుండా వుండలేదు. ఒక్కజంటవిషయం అనేకపర్యాయాలు చెప్పి అంతటితో ముగించలేదు. రెండో జంట వంటివిండా శృంగారం పొరుగింటి నిండా శృంగారం పాఠకుడి కంటినిండా శృంగారం చేపిందాకా రచయిత తృప్తిచెందలేదు.

చూపులు శృంగారం, మాటల శృంగారం; చేతితాకుళ్ల శృంగారం ప్రాథమికంగామూ, కారంలో ఒరగటాలు, వంటి పైమెట్టు శృంగారం; ఆ పై మెట్టు శృంగారం రచయిత వివరంగా చిత్రించటం పాఠకులకు ఆనందమే కలిగింపవచ్చు.

అదేమిటోగానీ, రెండు రకాలుగా భిన్నమనస్తత్వాలున్న ఇద్దరు యువతులు (సుధ, రుక్మిణి) మగవాళ్ల స్పర్శ తగిలితే మరీ అన్యాయంగా సోలిపోవటం వింతగా వుంటుంది! వింతేముంది అదే స్త్రీ నైజం పొమ్మంటే, పోక చేసేదేముంది!

ఈ రచయిత కొన్నివిషయాలపట్ల తన అభిప్రాయం వ్యక్తం చేయటానికి ప్రయత్నించిన తీరు చూడదగింది.

'కాలేజీలకు వచ్చే ఆడపిల్లల్ని ప్రలోభపరచి... వస్తున్న కథలూ, నవలలూ గురించి' (పేజీ 134).

భిలాయ్ ఉక్కు కర్మాగారం నిర్మించేందుకు సోవియట్ సహాయం ఇవ్వటం, మన దేశంలో బూర్జువా ప్రభుత్వం దృఢపడేందుకు సోవియట్ సాయం ఇవ్వడమేనని (పేజీ 136).

'అమెరికాలో మాత్రం ఆ ప్రభుత్వ విధానాల్ని అక్కడి ప్రజలందరూ హర్షిస్తున్నారంటారా?' (పేజీ 137)

ఈ పదేళ్ళ ఈ మధ్య మన యూనివర్సిటీలు మూడూ కనీసం ఏభయిమంది తెలుగు డాక్టర్లని తయారు చేశాయి. కాని మన భాషలో విమర్శ సాహిత్యం ఇంచుమించు లేనేలేదు......థీసీసులు వెయ్యి పేజీల కొలత చూడడమేగాని దాని విలువ ఏమిటో ఆలోచిస్తున్నారా? (పేజీ 140)

ఇటువంటి జాతీయాంతర్జాతీయ విషయాల మీద ఏదో ఒక మాట అనే ప్రయత్నం నవలలో చాలాచోట్ల కనబడుతుంది.

ఈ రచయితకు చక్కగా విషయ వ్యక్తీకరణ చేసే నేర్పు వుంది. వాక్య విన్యాసంలో సమత ఉంది. సమర్థంగా ఆలోచించి చక్కని తూగుతో పూర్వాపర పరిశీలనతో విషయం అందించే నైపుణ్యం ఉంది. ఇటువంటి రచయితలు విమర్శ సాహిత్య సముద్ధరణకు పూనుకోక పోవటం శోచనీయం.

ఈ రచయిత చేసే కల్పనాత్మకమయిన రచనలకంటే విమర్శనాత్మకమయిన రచనలు విశిష్టంగా ఉండవచ్చు. విమర్శనా దృక్పథం నవలలో ఎల్లెడలా గోచరమవుతుంది.

ఈ రచయిత రచనలలో ఉత్తమమయిన కల్పనారచనకంటే ఉత్తమమయిన విమర్శనా రచన ఎక్కువకాలం నిలిచే అవకాశం వుంది.

ఒక సదుద్దేశ ప్రచారార్థం వ్రాసిన ఈ నవలలో కొన్ని అచ్చంగా మంచి పాత్రలు. మరికొని మరింత స్పష్టంగా ఛాందస పాత్రలు. మంచయినా, చెడయినా, ఉచితమయినా, అనుచితమయినా ఆశయ సిద్ధికోసం, కులవ్యవస్థ కూలిపోవటంకోసం కులాంతర వివాహాలు మతాంతర వివాహాలు జరిగిపోవటం నవల సమాప్త సమాకాంక్షితం.

హైందవ జీవితం చిత్రించే ఈ నవల అంతా హైందవం అయితే అంతగా బాగుండదో ఏమో కొంత క్రైస్తవత్వం, నవలలో కనిపించటం, మరికొంత మహమ్మదీయ మతప్రసక్తి వినిపించటం పాఠకులు గమనిస్తారు.

ఏదో ఒక నవల వ్రాయాలి అని కాక, ఒక ఆశయం, ఒక సదుదేశం, జాతి జీవితం పునీతంచేసే ఒక సత్సంస్కరణ దృష్టిలో ఉంచుకొని వ్రాసిన 'స్వయం వరణం' వంటి నవలలో కథ· కథనం కొరవడిందనిగానీ, వాస్తవికతకు సమీపస్థం కాలేక పోయిందనిగానీ, మరింకేమయినాగానీ అనుకొంటే అనుకోవచ్చు. అంతేగానీ ఏ ఆంధ్రుడూ ఈ నవలను చదవకుండా విడిచిపెట్టకూడదు,

కోనేరు_సెలయేరు

[నవల. రచయిత : శ్రీ వాసమూర్తి. ప్రచురణః యం. శేషాచలం అండ్ కో. మచిలీపట్నం, మద్రాసు,

సికింద్రాబాదు. ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు. రాష్ట్రపతి రోడ్డు సికింద్రాబాదు. వెల: రు. 2–00 పేజీలు 256.]

ఒక సుకుమార హృదయంగల వ్యక్తి, అంత సుకుమారత్వంలేని సమాజంలో పొందిన హృదయ వేదనకు చిత్రీకరణ ఈ నవల. కోరుకొన్న స్త్రీ లభ్యం కావటానికి ఎదురైన అవాంతరాలు, తలచిన జీవితం తీరుతెన్నులు సక్రమంగా సంక్రమించక పోవటానికిగల పరిస్థితులు రాజాను ఎంతగానో క్రుంగదీశాయి.

మధ్యతరగతి జీవితం త్రిశంకుస్వర్గం. ఒక దృష్టిలో అది తీరనిశాపం. కలవాళ్ల జీవితం అంచునే కాలినడకతో పయనించాలనుకొన్న హేమలత దుఃఖమే పొందింది. బీదవాళ్ల బ్రతుకుబాటలో పళ్లేరుగాయలు తీసిపారేద్దామనుకొన్న రాజా హృదయార్తి పూర్తికాలేదు. వాళ్లిద్దరూ భార్యాభర్తలై, మధ్యతరగతి జీవితం ఎటూ కానిదైపోగా పొందిన వ్యథ చిత్రించిన ఈ నవల ఈ జీవిత రావ్యానికి ప్రతిపదార్థం తాత్పర్యం చెప్పింది.

అభ్యంతరం చూపకుండా హేమలత పెళ్ళికి అంగీకరించివుంటే, వనజాక్షితో పరిచయం కలిగే అవకాశం వుండేది కాదు. హేమలత విషయగతమైన బాధా, వనజాక్షి జీవితంపట్ల వ్యథా అతనికి కలిగి వుండేవి కావూ అనీ, కోరిన ఉద్యోగం లభ్యమయి వుంటే విజయవాడ చేరి వుండే వాడుకాడు, అటువంటి యింట్లో వుండేవాడు కాడు, ఆ పైన జరిగిన పరిణామాలకు అవకాశం వుండేదికాదూ అనీ, ఎవరైనా అనుకొంటే అది పొరపాటే అవుతుంది.

రాజావంటి సున్నిత హృదయం కలవాళ్ళు బాధ పడకపోతే బ్రతకలేనివాళ్ళు, ఎక్కడయినా సంతోషంగా వుండలేరనే అనిపిస్తుంది. అతనికి ఆనందంగా వుండటం అనేది వీలుకాని సంగతి. ప్రత్యల్ప విషయానికి అటువంటి సున్నిత హృదయుడి గుండె బదాబదలై పోతుంది.

లైంగిక జీవితం ప్రశాంతంగావుంటే మిగతా అన్నివిషయాలూ బాగుండి తీరుతాయనే సిగ్మండ్ ఫ్రాయిడ్ అభిప్రాయం అన్నివిధాలా అంగీకరింపదగిందే! రాజాకు భార్యతో సత్సంబంధం ఉండివుంటే, చాలా విషయాలలో అతనికి దుఃఖం కలిగేది కాదు.

కొందరు తాము చేసిన పని గుర్తింపబడాలని కోరుకోవటం అనుచితం కాకపోవచ్చు. అలాకోరుకొన్న అమాయకుడు రాజా. హేమలత కొంత ఉదాత్తత, మరికొంత ఉదాసీనత కల స్త్రీ. ఆమెకు ఏవో తప్ప అన్నివిషయాలు అంత ఆనందం కలిగింపలేవు. భార్యను కాపురానికి తీసుకువచ్చేముందు, అర్హతకు మించిన (డబ్బు విషయంలో) ఖర్చుచేసి, ఇల్లు అందంగా అలంకరించిన రాజాకు ఒక్క మంచిమాట చెప్పలేక పోయింది హేమలత. అతనిబాధ అక్కడే ప్రారంభం కాలేదు. తనకు ఇష్టమైన హేమలతకు, తనెందుకు ఇష్టం కలిగించలేక పోయాడో, తప్పి పోయిందనుకొన్న పెళ్ళిసంబంధం మళ్ళీ దారిన పడటానికి మధ్యలో జరిగిన మార్పు ఏమిటో రాజాకు వాచ్యంగా తెలియలేదు. తెలిసివుంటే అతనికి కొంత ఉపశమనం కలిగి వుండేది. తనను ప్రతివిషయంలోనూ అనుమానించే భార్యమీద, ఆమె పూర్వ జీవితంమీద రాజాకు అంతో యింతో అనుమానం ఉంది. అయితే అత వేసమయంలోనూ దానిని వ్యక్తం చేయలేదుగానీ అతనిని క్రుంగదీసిన ముఖ్యాంశం అదే అయివుండవచ్చునని ఏ కొందరో పాఠకులు అనుమానించే అవకాశం లేకపోలేదు.

తనచుట్టూ ఉన్న సమాజం దాని మంచి చెడ్డల ఏకీకృతరూపంతో రాజాకు జీవితంమీద వైమనస్యం పుట్టించింది. అందుకు హేమలత ఒక్కతే కారణం కాదు. నరసింహం దైన్యమూ కాదు. విజయ దుఃఖమూ కాదు. వాసుతల్లి వ్యథాకాదు. సంపూర్ణంగా సమాజంలో ఉన్న అస్తవ్యస్తత అతన్ని బాధించింది.

కలవాళ్ల ఆనందాలు, లేనివాళ్ల దుఃఖాలు రాజా చూడలేదు. ఉన్నవాళ్ల సరదాలకు తను ఒక పరికరంగా మారిపోవటం రాజా కిష్టంలేదు. అందుకే హేమలత స్నేహితురాలు పుట్టినరోజు వేడుకలో పద్యాలు చదవకుండా వచ్చేశాడు రాజా.

తన వ్యక్తిత్వం గౌరవింపబడినచోట రాజా నిలవగలడుగాని తదితరమైన తావుల్లోకాదు. ఉన్నవాళ్ళు ఉన్నవాడినే తమ స్నేహానికి తగినవాడుగా

భావిస్తారని రాజా నమ్మకం. అందుకే భార్యకు స్నేహితులైన స్త్రీల కుటుంబాలలోని పురుషులతో మైత్రి కొనసాగించలేకపోయాడు. నరసింహంతో మైత్రి పాగటానికీ అదే కారణం. కాలేజీలో ఉద్యోగం వదులుకోవటానికి కొంతవరకు అదే కారణం.

కళాశాలల్లో పాఠం బాగా చెప్పగల, లేక, విద్యార్థుల ప్రేమను పొందగల అధ్యాపకుల జీవితం స్వర్గం అయితే, తద్భిన్నతగల వ్యక్తుల జీవితం నరకం అవుతుంది. అదే ఎదురయింది రాజాకు. క్లాసులో అల్లరి భరించలేకపోయాడు. కళాశాలా వాతావరణంలో కలుషిత పరిస్థితి చూస్తూ వూరుకోలేకపోయాడు. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

రాజా స్వేచ్ఛకోరే కవితా హృదయం ఉన్నవాడు. కవిత్వం వ్రాశాడు. ప్రచురించాడు. కళాశాలలో ట్యూటరుగా ఉద్యోగంలో చేరాడు. లెక్చరర్లు, శాఖాధ్యక్షుడు, ప్రిన్సిపాల్ అధికారం క్రింద బానిసగా వుండవలసి వస్తూ వుంది, ఉండలేననుకొన్నాడు. చివరికి ఒక పక్షపత్రికకు సంపాదకుడుగా జీవితం మార్చుకొంటాడు.

ఈ పనిచేస్తూ జీవితాన్ని ఎదుర్కొంటున్నాననుకొంటాడు రాజా. అయితే జీవితంనుంచి పారిపోతున్నాడని పాఠకులు అనుకొనే అవకాశం ఉంది. ఉదాత్తమయిన సంపాదకవృత్తిని చేపట్టి, తన హృదయార్తికి ఉపశమనం కలిగించగల కలం చేతబట్టి, తక్కువ జీతమయినా సర్దుకుపోయే మనస్థితిని అలవర్చుకొన్న రాజా గొప్పవ్యక్తిగా కనిపిస్తున్నా, ఆ నీడలో పిరికివాడుగా కనిపిస్తాడు.

ఆ పిరికితనానికి మరోపక్క అతని శృంగార జీవితం. వనజాక్షిని ఉద్ధరిద్దామనుకొనే ఆ పనిచేయలేక పోతాడు. భార్యను సక్రమంగా తీర్చిదిద్దుకొందామని, అది పూర్ణంగా నిర్వహించలేకపోతాడు. వాసు తల్లికి కలిగిన మమకారం చెప్పుకోలేక పోతాడు. విజయపట్ల అనురాగం వెలికి రానియ్యడు.

ఇంట్లో వచ్చిన చిరుతగాదాకు భార్య పుట్టింటికి వెళ్లిపోతే ఆమె వచ్చిందాకా తను పిలిపించననుకోవటం, ఏవిధంగానూ సమస్యకు పరిష్కారం కాదు. మౌనం చాలా విషయాలలో మార్గం చూపుతుందనుకోవటం అయితే పిరికివాడి గుణం. కాదంటే మౌని లక్షణం.

ఒక్కమాటలో రాజా ఒక మహోత్తమపాత్ర. ఆ పాత్ర సృష్టి నిజాయితీతో చేసిన రచయిత శ్రీ వాసమూర్తి ఆంధ్ర పాఠకుల అభినందనార్హత సంపాదించుకొని, అభిమానం ఆర్జించుకొన్నట్లే!

హేమలత పాత్ర రాజాకు అర్థం కాలేదుగానీ, పాఠకులకు అర్థం కాకుండా పోలేదు. ఆ నేర్పు రచయిత ప్రత్యంశంలోనూ ప్రదర్శించిన తీరు ప్రశంసాపాత్రం. ఆమె అమాయకురాలు. జీవితం యొక్క పూర్ణరూపం తెలియని వ్యక్తి స్నేహితురాండ్రందరకు కలిగిన అనంతానంద సంపద తనకూ కలుగుతుందని తలపోసిన వ్యక్తి. లభ్య జీవితంలోని కఠినసత్యాలు చూచి రాజీ పడలేనిదశ దాటలేదు. అక్కడక్కడా రాజాకు మాదిరిగానే హేమలతమీద పాఠకులకు కోపం రావచ్చుగానీ, వెంటనే సానుభూతి కలుగుతుంది.

నవలలోని ప్రతిపాత్రా పాఠకుల హృదయంలో చెరగని ముద్ర వేస్తుంది. చక్కని పాత్ర సృష్టితో కార్యాకారణ సంబంధంఉన్న సంఘటనలతో, మంచి కథతో సాగిన ఈ నవల తెలుగువాళ్ళ మంచి నవలలో ఒకటి.

పరిమిత పరిధిని చిత్రీకరించి, చక్కని భాషలో వ్రాసిన ఈ నవల, ఏ అధ్యాయానికి ఆ అధ్యాయం ఒక రసవత్తరమైన కథలాగా వుంటుంది. కరుణాత్మక శృంగారం రసరమ్యంగా నవల అంతటా దర్శనమిస్తుంది.

రాజవంటి వ్యక్తిని ప్రదర్శించటానికి అతను తప్పనిసరిగా రచయిత అయివుండవలసిన అవసరం లేకపోయినా, ఎంత వేశ్య అయినా వనజాక్షి లాడ్జిలో ఆ విధంగా ప్రవర్తిస్తుందనే దానికి బుజువు లేకపోయినా, కలవాళ్ళు అందరూ ఆనందమ్ పొందుతున్నారనీ, లేనివాళ్ళు అందరూ బాధలే అనుభవిస్తున్నారనే అనటం శ్రుతిమించినట్లు కనిపించినా, నవలనీ పట్ల కలిగిన సదభిప్రాయం తొలగిపోదు.

ఈమధ్య వస్తున్న ఎమెస్కో పాకెట్ బుక్స్‌లో

దొరుకుతున్న ముద్రణా దోషాలు ఈ నవలలోనూ ఎదురవుతాయి.

ఆంధ్రులు అవశ్యం చదవవలసిన నవల 'కోనేరు—సెలయేరు'.

నూరు శరత్తులు

[నవల. రచన: శ్రీ మంజుశ్రీ. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్. ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు. వెల: 2-00. పేజీలు: 244.]

ఈ నవలలో సమాజంలోని ఒక భాగం సమగ్రంగా చిత్రించాలన్న ప్రయత్నం ఉంది. పల్లె వాతావరణం ఉన్నది ఉన్నట్లుగా చిత్రించాలనుకొన్న కవితాత్మ ఉన్న రచయిత ప్రయత్నం పరిపూర్ణంగా నెరవేరిందని కొందరే అనుకొంటారు. సూచనప్రాయంగా పల్లె చిత్రణ, పల్లెటూళ్లలో కనిపించే మంచిచెడ్డలు వాటికి వ్యాఖ్యానంచేసే ప్రయత్నంలో సాగింది రచన.

లక్ష్మీపురాగ్రహారం, ఆంధ్రదేశంలోఉన్న చాలా పల్లెల్లో ఒకటి వంటిదే! ప్రాచీనాంధ్రత్వంపై ఆధునిక నాగరకత ప్రసాదించిన ముద్రతో పాతదనం వదులుకోలేక, క్రొత్తదనం పూర్తిగా స్వీకరించలేక సంధి అవస్థలో సర్దుకోలేకుండాఉన్న పల్లెటూరు లక్ష్మీపురాగ్రహారం. పల్లెలోనే ఉన్న నాటువైద్యుడు 'ఆచార్లు' అక్కర లేకపోనూలేదు. బస్తీలో ఉన్న ఇంగ్లీషు చదువుల డాక్టరు అక్కరలేకుండానూ పోలేదు. అటు పూర్తిగా పల్లె వైద్యుణ్ణి వదులుకోలేక, ఇటు ఇంగ్లీషు డాక్టర్ను పూర్తిగా స్వీకరించలేక నమ్మకాలు త్యజించలేక ఆశలు రూపం గుర్తించలేకఉన్న అన్నిపల్లెల వంటిదే లక్ష్మీపురాగ్రహారం!

ఈ నవల ఆ పల్లెకు చెందింది. అయితే గుంటూరు కొంతా, హైద్రాబాద్ కొంతా, మద్రాసు కొంతా, ఆ పైన శ్రీరంగం కొంతా కథ నవలకు కలిపినా ముఖ్యంగా నవల ఆ గ్రామం సంగతిచెప్పే ఇతివృత్తం కలిగిందే! చిన్నరెడ్డికి ఆరోగ్యం బాగుంటే గుంటూరు కథలేదు. 'దయ' చదువు సంగతి చెప్పవలసి వచ్చింది కాబట్టి హైద్రాబాద్ నవలలోకి వచ్చింది. శ్రీనివాసులు చదువు సక్రమంగా సాగివుంటే మద్రాసు మాటగానీ, శ్రీరంగం ప్రసక్తిగానీ రాకపోవును.

ఈ నవలలో ప్రధాన పాత్ర గోపాలాచార్యులు. నవలా కాలంలో ఆ పాత్ర దయనీయమైన స్థితిలో వుంది. అందుకు కారణాలు అనేకం. ముఖ్యమైంది బీదతనం. అది పూర్వంనుంచీ లేదు. ఈ మధ్య వచ్చింది. అందుకు కారణం రామిరెడ్డి.

గోపాలాచార్యులకు ముగ్గురు కొడుకులు. ఇద్దరికి పెళ్ళిళ్ళు అయిపోయాయి. పెద్దవాడు ఇంటి విషయం పట్టించుకోడు. స్వాతంత్ర్య సమరంలో బాగా మత్తెక్కించుకొన్నాడు. ఆ మత్తు ఆ పైన ఇరవై సంవత్సరాలయినా వదలలేదు. రెండో కొడుకు డాక్టరు. ఫారిన్‌పోయి, అక్కడే ఒక పెళ్లిచేసుకొని స్థిరపడిపోయాడు. నవలాకాలంలో ఆయన పెద్దకూతురు 'దయ' ఎం. ఏ చదువుతూ వుంది. మూడో కొడుకు చిన్నవాడు. ఫోర్తుఫారంతో చదువు మానేయవలసివచ్చింది.

నవలలో విలన్ రామిరెడ్డి, రామిరెడ్డి అంటే మామూలు మనిషి కాదు, మునసబు. నవలాకాలంలో దిగులుతో ఉంటాడు. కారణం ఒక్కగానొక్క (గోవిందరెడ్డి 'చిన్నరెడ్డి') కొడుకు జబ్బున పడ్డాడు. పూర్వం భయంకరమైన నేరాలు చేశాడు. గోపాలా

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు
వ్యవసాయము — ఫిషరి — కోళ్ల పెంపకం — ఆవులు — తోట పని — ఇంజనీరింగ్ — వైద్యము — వివిధ సాంకేతిక విషయములపై గ్రంథములు గలవు. కేటలాగు ఉచితము.
ఇంగ్లీషులో వ్రాయండి!
N. K. PAUL & SONS,
P. B. No. 12202, Calcutta—5.

చార్యుల ఈ పరిస్థితికి చాలావరకు అతనే కారణం. జనార్దనస్వామి దేవాలయం సొమ్మయిన భూమి గోపాలాచార్యులకు చెందకుండాచేసి, తను అపహరించిన వ్యక్తి.

నవల ప్రారంభంలో మంచిపాత్రలకూ చెడ్డ పాత్రలకూ తేడా లేకుండా కష్టాలు గోచరిస్తాయి. 'శిశిరం తరువాత వసంతం రాకమానదు. కష్టం తరువాత సుఖమూ అంతే!' అనే అట్టపైనున్న విషయం ఆధారంగా సగం నవలలో కష్టాలే కనిపిస్తుంటే ఆపైన అన్నీ సుఖాలే అనుకొనే అవకాశం వుంది.

పాత్రచిత్రణలో రచయిత నేర్పు ప్రదర్శితమయింది. గోపాలాచార్యులపాత్ర కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. రామిరెడ్డి స్వరూప స్వభావాలు తీర్చి దిద్దినట్టు వ్యక్తమవుతాయి. గోవిందరెడ్డి శ్రీనివాసులు పాఠకుల హృదయంలో నిలిచిపోతారు. 'దయ' పాత్ర సృష్టి అత్యుత్తమం. పురుషుడి ఊహకందని స్త్రీ స్వభావ చిత్రీకరణ 'దయ' పాత్ర సృష్టిలో రచయితకు దృష్టిలో వుంది. ప్రకాశరావు పాత్ర విద్యుత్కాంతి ప్రసరించే దయ పాత్ర చెంత కాంతిని ఏ మాత్రం కోల్పోదు. ప్రత్యల్పపాత్ర సృష్టిలోను రచయిత చూపిన నేర్పు ప్రశంసాపాత్రం.

పాత్ర సృష్టిలో వైవిధ్యం అధికం. ఈ నవలలో ఏ పాత్రా ఇంకో పాత్రలాగా వుండదు. లక్ష్మిపురాగ్రహారం బాహిర స్వరూపం బాహాటంగా తీర్చి దిద్దబడింది. అయితే అంతర రూపం పరిపూర్ణంగా ప్రదర్శించాలనే ప్రయత్నం కనిపించినంత తీవ్రంగా ఫలితం లేదేమోననిపిస్తుంది.

ఈ రచయిత తన రచనల్లో భార్యమీద అన్నివిషయాలకూ ఆధారపడే భర్తలను సృష్టించే సంగతి, ఈ రచయిత ఇతర రచనలు చదివిన పాఠకులు ఈ నవలలోనూ చూడవచ్చు. ఆ వ్యక్తి రామిరెడ్డి!

రామిరెడ్డి అంతటి దుర్మార్గుడు భార్యను అంతగా ప్రేమిస్తాడనీ, స్త్రీ అంటేనే అంత ఉన్నతాభిప్రాయం కలవాడనీ కొడుకు హాస్పటల్లో చేరినప్పుడు అతని ప్రవర్తన చూచిందాకా అనుకోరు. స్త్రీ ఔన్నత్యం, అర్థం చేసుకొనే రచయిత ప్రయత్నంలో రామిరెడ్డి ప్రవర్తన ఒక భాగం. అయితే నవలలో అంత ఉత్తముడుగా కనిపించే రామిరెడ్డి, అంతకుముందు చేసిన దుర్మార్గాలు దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే, ఇటువంటి వ్యక్తి అటువంటి పనులు చేశాడా, లేదంటే, అటువంటి పనులు చేయగల మనిషి ఇలాగా కూడా వుండగలడా అనిపిస్తుంది.

ఈ నవలలో స్వీకరించిన ఇతివృత్తంలో ప్రేమ వ్యవహారాలు చిత్రించటానికి అవకాశం తక్కువ. దయ—ప్రకాశరావుల మధ్య సాగిన తొలివలపుల తొంకరి ఆ దృష్టితో అనవసరమే కావచ్చు. అయితే ఆ మాత్రం ప్రేమ లేకపోతే పాఠకులు ఏమనుకొంటారో అని ఈ మాత్రపు ప్రేమ రచన సాగిందేమో అనుకోక తప్పదు.

యతిరాజులు ఫారిన్ పోయి, అక్కడొక పెళ్లి చేసుకొని, అమాంతం అక్కడే స్థిరపడి, ఇల్లూ వాకిలీ తల్లీ దండ్రి, భార్యాపిల్లలు సంగతి వదిలి స్వేచ్ఛగావుంటే వుండవచ్చుగానీ, ఆ విషయం ఈ నవలలో ఎంతవరకు అవసరమో రచయిత సమగ్రంగా ఆలోచించలేదనే అనుకోవలసివస్తుంది.

ఒక కొడుకు రాజకీయవాది, రాజకీయ బాధితుడుగా ఊళ్ళవెంట సభలనీ సమావేశాలనీ తిరగటంగానీ, మరో కొడుకు దూరదేశంలో స్థిరపడటంగానీ, ఇంకో కొడుకు ఇల్లు వదిలి శ్రీరంగం పోవటంగానీ, గోపాలాచార్యుల కష్టాలు పెంచటానికీ పనికి వస్తాయిగానీ, మరో ప్రయోజనం ఆ పాత్రలవల్ల లేదు. ఆ పాత్రలు అంతవరకే ఉండాలన్న నియమం ఏమీ అక్కరలేదు. ఎంతమంది అయినా ఉండవచ్చు. మరిన్ని కష్టాలు సృష్టించవచ్చు. అంతకంటే మరీ ప్రయోజనం అయినా ఆ పాత్రలు సాధించివుంటే బాగుండేది. కొంతలో కొంత శ్రీనివాసులు పాత్ర అవసరం నవలలో ఉంది. మిగతా రెండు పాత్రలు ఉన్నందువల్ల పేజీలు పెరిగాయి.

గోపాలాచార్యులు, రామిరెడ్డి—ఈ రెండు పాత్రలు చుట్టూ పెరిగిన పాత్రలు ఆ రెండుపాత్రల మధ్యఉన్న కథను అతుకుతూ పొగలిగినవిగా వుంటే నవలలో వస్త్వైక్యం సమగ్రంగా సాధితమయివుండేది.

'పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం, నందామ శరదశ్శతం' ఆధారంగా మూడు శరత్తులు అనే పేరు కుదిరిందీనవలకు. నవల నామధేయంలో శరత్సంభావన వుందిగానీ, కథలో ప్రథమార్థంలో శిశిర సమాశ్లేషం తప్పలేదు. శిశిర దశలో అగమిష్యమాణ వసంత పరామర్శ వుంటే మరింత శోభావహంగా నామధేయం ప్రకాశించే అవకాశం వుంది.

రచయిత ప్రయోగించిన భాష ఒక వింత దృష్టి కలిగి వుంది. స్వచ్ఛమైన వ్యావహారికంగా ఈ నవలా భాషను గూర్చి అనుకొనే అవకాశం తక్కువ. గ్రాంథికభాష వెనుకముందులు తువిగి వ్యవహార రూపంలో ఈ నవలలో దర్శన మిస్తుంది. అంతేకాదు, ప్రాచీనాధునిక కవులు వ్యక్తంచేసిన భావాలూ, పద్యాలూ అక్కడక్కడా నవలలో ప్రత్యక్షం అవుతాయి.

'కంటికి కునుకురాదు
జిహ్వకు రుచి తెలియదు.
కడుపు నిండదు
మనసుకు శాంతి ఉండదు' వంటి

వాక్యాలు చదువుతుంటే......

'కంటికి నిద్ర వచ్చునె, సుఖంబగునే రతికేళి? జిహ్వకున్ వంటకమించునే'...పద్యం గుర్తుకు రాక తప్పదు.

'మెలితిప్పిన మీసాలు చచ్చిపోయిన పాముల్లాగున్నాయి' వంటి వర్ణనలు చదువుతున్నప్పుడు, 'పడివేసి పదిలేపిన ముంగురులు పసిపాముల్లా బుసగొడుతున్నాయి' అనే డా॥ సి. నారాయణరెడ్డి కవిత గుర్తుకు రావచ్చు.

లోకోక్తులు, సంస్కృత శ్లోకాలు కొంతలో కొంత నవలలో కనిపిస్తాయి. ఈ నవల చదువుతుంటే, జీవితం దర్శింపచేయాలనే పట్టుదలతో రచన సాగిస్తున్న ఈ రచయితకు ఆంధ్ర సాహిత్యంతో పరిచయం విశిష్టమయిందిగా పాఠకులు భావించుకొంటారు.

ఈ నవల చదవటం ఒక చక్కని అనుభూతి. ఆ అనుభూతి రసరాజ్య పట్టాభిషేకం—పాఠకుడికి—చేసి వుండేది రచయిత ఇంకింత వస్త్వైక్యంపట్ల జాగరూకత వహించివుంటే.

ఏమైనా తెలుగునాట పల్లెపట్టులు తీరుతెన్నులు దర్శించే ప్రయత్నం చేసిన ఈ నవల అందరూ చదవదగింది. శ్రీ 'మంజుశ్రీ' ఇతర రచనలు లాగా, ఈ నవలా పాఠకుల అభిమానం చూరగొంటుంది.

—రవి.

అశ్వత్థభారతము-ఉద్యోగపర్వము

[రచయిత: శ్రీ కలుగోడు అశ్వత్థరావు. ప్రతులకు; రచయిత, కవిరాజ ప్రింటర్సు, రాయదుర్గం. (ఆంధ్ర). మూల్యము: అయిదు రూపాయలు.]

కవిరాజ, కవిసవ్యసాచి బిరుదాంచితులు శ్రీ కలుగోడు అశ్వత్థరావుగారు తిరిగి మహాభారతమును తెనుగుచేయ పూనికచేసి కృషి సాగించుచున్నారు. ఆ కృషి ఫలిత మింతకుపూర్వ మొకసారి మొదటి నాలుగు పర్వముల నొక సంపుటముగా ప్రకటించిరి. ఇప్పుడైదవదైన ఉద్యోగపర్వమును ప్రకటించిరి. కవిత్రయము వారి తరువాత వారి ననుసరించియు, మూలము ననుసరించియు మహాభారతమును తెనుగు జేయుటకు ఇప్పటికి అయిదు ప్రయత్నములు జరిగినవి. ఆరవది శ్రీ అశ్వత్థరావుగారి ప్రయత్నము. శ్రీ అశ్వత్థరావుగారి రచనా సామర్థ్యమును గురించి క్రొత్తగా చెప్పవలసిన అక్కరలేదు. అధునికాంధ్ర వాఙ్మయ నిర్మాతలలో ఆయన సుప్రసిద్ధుడు.

పూర్వవాక్యము పేర ఉపోద్ఘాతము వ్రాసిన శ్రీమాన్ కంచపీడు శ్రీనివాసాచార్యులుగారు 'ఈ భారత రచనలో కవిగారి ప్రధాన లక్ష్యము భారతసార ప్రతిపాదనమని తోచుచున్నది. కనుకనే ఉపాఖ్యాన కథానికలతోడను, వర్ణనలతోడను అతివిస్తారమైన భారతమును మూలము చెడకుండ ప్రధాన కథాభాగమునకు భంగమురాకుండ సంక్షిప్త మొనర్చి రచించెను' అని వ్రాసిరి. ఈ మాట గ్రంథము నత్యంతము శ్రద్ధగా పరిశీలించి చెప్పిన మాట. శ్రీ అశ్వత్థరావుగారి అనువాదము పూర్వానువాదములవలెకాక ఒక క్రొత్త పద్ధతిలో నున్నది. ముఖ్యముగా శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి

శాస్త్రిగారి శ్రీ కృష్ణభారతము చదివినవారి కీఅశ్వత్థ భారతములోని క్రొత్తదనము తెలియును. ఈరీతియను వాదమువలన కలుగు ప్రయోజనమేమన్నచో చెప్ప లేము. కవి యట్లు చేయసంకల్పించినాడు. చేయు చున్నాడు అంతే.

ఆంధ్రమహా భారత విమర్శకులలో చాలమంది వ్యాసభారతమునకు కవిత్రయమువారు అనౌచిత్యములను తొలగించి మెఱుగుపెట్టినట్లుగా చెప్పుదురు. అట్లే కవిత్రయము వారి భారతమున కీ అశ్వత్థ రావుగారి భారతము మెరుగుపెట్టుచున్నట్లున్నదని చెప్పుటయు కలదు. అట్లు చెప్పరాదు.

శ్రీ అశ్వత్థరావుగారు పద్య రచనాదికమున చేయి తిరిగినవారు. తెనుగు నుడికారములను సము యోచితముగా ప్రయోగించుటచేతను, పాత్రముల మనస్తత్త్వమును ప్రదర్శించు రీతిని పదప్రయోగము చేయుటచేతను, రసోచితముగా సమాసములను హ్రస్వ దీర్ఘములుగా కల్పించుటచేతను, రాయలసీమ పలుకు బడుల నడనెఱిగి చెల్లుబడి చేయుటచేతను ఈ అశ్వత్థ భారత పద్యరచన పరమ రమణీయముగా నున్నది.

కథాకథనము విషయమునగూడ శ్రీ అశ్వత్థ రావుగారు విషయ సంగ్రహణముతోపాటు కొన్నిచోట్ల నూత్న విషయములను ప్రవేశపెట్టి రచనమును విస్తృతముకూడ చేసిరి. ఇట్టివానిలో పేర్కొనదగి నది తృతీయాశ్వాసమునగల శ్రీకృష్ణ దుర్యోధన సంవాదము. ఇందు దుర్యోధనుడు ధర్మరాజునకు రాజ్యార్హతలేదని వాదించును. ఆయా కారణములను శ్రీకృష్ణుడు పూర్వపక్షముచేసి ధర్మరాజునకుమాత్రమే రాజ్యార్హత కలదని నిరూపించును. ఈ వాగ్వివాదము శ్రీ అశ్వత్థరావుగారు స్వబుద్ధిచేత ప్రవేశపెట్టినది. ఇంతవరకు బాగుగనే యున్నదిగాని మరల చివరకు శ్రీకృష్ణుడు దుర్యోధనుని నగమునీయవేని అయిదు గురకు నైదూళ్లైనను విమ్మనియడుగుట బాగుగా లేదు. ఇట్లే ద్రుపద పురోహితుని విషయమునను శ్రీ అశ్వత్థరావుగారు స్వతంత్రించి వ్రాసిరి. సంజయ రాయబార ఘట్టముచిత రమణీయముగా నున్నది.

శ్రీ అశ్వత్థరావుగారి రచనా రీతియందు గుబా ళించు సౌరభము తెనుగుభాషయొక్క దైనందిన మైన వినియోగ వైచిత్ర్యము. చతుర్థాశ్వాసమునందలి కర్ణ కుంతీ సంవాదమునందది కనిపించును. శ్రీ అశ్వత్థ రావుగారు కుంతి తాను కర్ణుని విడనాడుట మొద లుగాగల పూర్వగాథను స్మరించి పశ్చాత్తాపపడు టను కల్పించి వ్రాసిరి. అది అంతవరకు బాగుగనే యున్నది. కుంతి అర్జునుని వధ కంగీకరించి మిగి లిన వారిని చంపకుండ కర్ణునినుండి వరము పొంది నది. ఆమె కర్ణుని చంపవద్దని ధర్మరాజాదులకు చెప్పలేదు. ఏల చెప్పలేదు? ఇచట కుంతి మనస్సున ఈ అభిప్రాయము మెదలినట్లుగా శ్రీ అశ్వత్థరావు గారు వ్రాసినది పరమ రమణీయముగా నున్నది.

> 'రణమున పుత్రులన్ దునుమరా'దని
> యూతని గోరినట్లె యా
> తనయుల 'నీవి మానుడని' తల్లి
> వరంబును గోరరాదొ? యా
> కనికరమిందు లేదొ? కనికాంచిన
> దానను గాదొ? భేదమీ
> జననికిమాత్ర మేటికిడ
> జాలితినో? వికటంపు దుర్విధీ!
>
> 4–82.

శ్రీ అశ్వత్థరావుగారి ప్రయత్నము ప్రశంసింప దగినదిగా నున్నది.

—క్షేమేంద్ర.

పగా మైనస్ ద్వేషం

[కథలు: రచన: శీలా వీర్రాజు. ప్రచురణ: సువర్ణ పబ్లికేషన్స్, కొత్తపేట పోస్టు, హైదరా బాద్–35. వెల: రు. 1–75]

ఈ సంపుటిలో నాలుగు కథ లున్నాయి. మొదటి కథ 'పగామైనస్ ద్వేషం'లో సంగీతరావు, భానుమూర్తి మంచి మిత్రులు. 'జీవితంలో మోస పోయి' తాగుడూ, తిరుగుడూ మొదలైన వ్యసనా లకు లొంగిపోయినవాడు భానుమూర్తి. భానుమూర్తి దగ్గరినుంచి వారానికి ఒక్క ఉత్తరమయినా రాకపోతే బొత్తిగా సహించలేడు సంగీతరావు. అటువంటిది

వెలంతరబడి ఉత్తరం రాకపోవటంతో, టెలిగ్రాములకు కూడా జవాబు లేకపోవడంతో సంగీతరావు తల్లడిల్లిపోతాడు. చివరకు తానే బయలుదేరి వెళ్లి భానుమూర్తి పరిస్థితి గమనించి అతినేర్పుగా అతన్ని ఆ దుర్వ్యసనాలబారినుండి రక్షించి సంస్కరించాడు. ఆ తర్వాత వరహాలరావు రంగంలో ప్రవేశించి మళ్లీ భానుమూర్తిని దిగజార్చాడు. సంగీతరావు మనసు క్షోభించింది. 'ఒకసారి పగిలిపోయిన స్నేహాన్ని అతి కష్టంమీద అతికించుకొని, జాగ్రత్తగా దాచుకుంటూ వస్తోంటే అమాంతం దాన్నిచేతుల్లోంచి తోసేశాడు వరహాలరావు.' అని అలమటించిపోతాడు.

రెండవ కథ 'రెండు కన్నీటిచుక్కలూ – ఒక ప్రశ్న'. ఇందులో భవానీ దురదృష్టవంతురాలు. ఆమె జీవితంలో ఆశించినవన్నీ అందినట్టేఅంది అంతలోనే చేజారిపోయాయి.

'అతుకుపడ్డ సౌందర్యం' అనే కథలో యూసఫాకు మంచిసంబంధం రాగానే పెళ్లి జరిగిపోయింది.ఆమెను అభిమానించే వ్యక్తి మూడేళ్ల తర్వాత యూసఫాను చూడబోతే చాలా బాధ కలిగింది. ఆమె భర్త మళ్లీ పెళ్లిచేసుకుని యూసఫాను వొదిలేశాడని వినగానే కొయ్యబారిపోయాడు. కాని, నెమ్మదిమీద యూసఫాకు మళ్లీ పెళ్లిఅయిందని విని, అతడు, ఆమెను చూడాలనే కోరికను, సానుభూతిని చంపుకున్నాడు.

'పాడిమేఘం–పెనుగాలి' అనే రచన సంపుటిలోని నాలుగు రచనలలోనూ ఎన్నదగినది. వసంతరావు జీవితంలో వంచింపబడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది ఫలించక ఆసుపత్రిలో మరణబాధ అనుభవిస్తున్నాడు. వాగమణికి అతడంటే జాలి. ఎంతో జాగ్రత్తగా కంటికి రెప్పలా కాపాడింది. ఆమె అందుకు బదులుగా ఏమి కోరిందో అది లభించలేదు. వసంతరావు ఆసుపత్రి వదలి వెళ్లేటప్పుడు డాక్టర్లతోనూ, ఇతర నర్సులతోనూ ఒకే ధోరణిలో రికార్డు పెట్టినట్టు కృతజ్ఞత చెప్పుకున్నాడు. వాగమణి వేరే ఏదో ఆశించింది. కాని అతడు ఆమెతోనూ అవే మాటలతో కృతజ్ఞత చెప్పుకుని వెళ్లిపోయాడు. వాగమణి ఏడవకూడదనుకుంటూనే ఏడ్చేసింది.

కొంత అస్పష్టత, కొంచెం అయోమయత కొంత అర్థకాఠిన్యమూ వగైరా లక్షణాలతో ఇటీవల వెలువడుతున్న కొన్ని గేయాలు వ్రాసే రచయితలు 'కథలు' వ్రాయబూనుకుంటే ఎలా వుంటాయో తెలుసుకునేందుకీ సంపుటి చక్కని ఉదాహరణ. రచయిత చాలా సూటిగా, స్పష్టంగా, శక్తివంతంగా చెప్పవలసిన పట్టులలో అస్పష్టంగా అయోమయంగా వ్రాశారు. సంగీతరావు, పోస్టుమన్‌కోసం ఎదురుచూసి ఆశాభంగం చెందాడు. భానుమూర్తినుంచి ఉత్తరం రాలేదు. ఆ సందర్భంలో 'ఎక్కడా స్థిరంగా నిలుచోక...' అని ప్రారంభమయ్యే పేరా మొత్తం పైన చెప్పబడిన ధోరణిలో వుంది. పాత్రల ఆకృతి వర్ణనచేసే పట్టులలో కూడా రచయిత ధోరణి చిత్రంగా వుంటుంది. 'గుండ్రటి గోళం వేడెక్కి వ్యాకోచించి కిందకు బరువు దిగినట్టు'ందిట కోలమొహం! 'నవ్వినప్పుడు పెదాలకొసలమీంచి జారిన మడతలు చెక్కిళ్లమీదకు పాకుతూపోయి కళ్లచుట్టూ పెనవేసుకుని చిరునవ్వు గీతల్ని సృష్టిస్తున్నాయట! భానుమూర్తి, వరహాలరావు, భీమేశ్వరరావు, భవానీ, బ్రహ్మానందం, యూసఫా...వగైరా పాత్రల ఆకృతివర్ణన చేయడంలో రచయిత చిత్రమనిపించే ధోరణి అవలంబించారు. 'ఆ కళ్ల చీకటి అంచులమధ్య కాంతి కరిగిన తెల్లటి చూపుల్లో ఆకర్షణే కాదు అందమూ పెనవేసుకుంది' అంటారొకచోట. 'మహాప్రకాశవంతంతో వెలిగే విద్యుద్దీపం టప్పున పగిలిపోయి...' అంటారు మరొకచోట. 'చూపులను పైకి లాక్కుంది...' అని కూడా అంటారు.

ఈ తరహా అస్పష్టమైన, కఠినమైన రచనా ధోరణివల్ల ఈ సంపుటిలోని రచనలు బలహీనపడ్డాయి. కథను నడపడంలోనూ, సమర్థంగా ఊహించడంలోనూ, రచయిత ప్రతిభ ఎన్నదగినదే. ముందుముందు వీరు కథారచనలో మరింత సూటియైన, స్పష్టమైన రచనా ధోరణి అలవరచుకోడం ముఖ్యం అనిపిస్తుంది.

మానినీమానసం

[కథలు: రచన: ఎస్. వివేకానంద. ప్రతులకు: వేంకటేశ్వర అండ్ కో., గుంటూరు—1. వెల: రు. 3-50.]

ఈ సంపుటిలో ఇతఃపూర్వం వివిధ పత్రికలలో ప్రచురించబడిన పదమూడు రచన లున్నాయి. రచయిత ను గురించిన పరిచయంలోనూ, రచయిత సంపుటి చివర చేర్చిన 'నా మాట'లోనూ, ఒక్క విషయం స్పష్టమవుతున్నది. రచయితలో ఉత్సాహం ఉంది. పదుగురు మెచ్చే 'మంచి' కథలు వ్రాయాలని ఉబలాటం ఉంది.

ఈ సంపుటిలోని పదమూడు కథలలోనూ 'జీతాలు—జీవితాలు' అనే కథ ఎన్నదగినదిగా ఉంది. సుందరరామయ్య అనే మధ్యతరగతి గుమాస్తా—పెద్ద సంసారసాగరాన్ని అష్టకష్టాలుపడి ఈదుకొస్తున్న వాడు—ఏ ప్రలోభాలకూ లొంగడు, లంచాలు పట్టడు. గోవిందయ్య అనే కంట్రాక్టరు తన ఏనభై వేల రూపాయల బిల్లును లక్షకు సరిచేసి తెచ్చి దాన్ని పాస్ చేయమని అర్థిస్తూ వంద రూపాయలనోట్లకట్ట నొకదాన్ని సుందరరామయ్య ముందుంచుతాడు. తర్వాత భయం సుందరరామయ్యను భయంకరంగా వెంటాడుతుంది: తనను అధికారులు బంధించినట్లు అతడు పీడకల కంటాడు. పై వృత్తాంతాన్ని సుందరరామయ్య పీడకలగా రచయిత చిత్రించారు.

మిగిలినవానిలో 'ఆశలు హాస్యాలు', ప్రేమ జ్వరం, ప్రేమకథ, శాస్త్రిగారూ—శంకరవిలాసు, దానిమ్మచెట్టు, ఇవి హాస్యరచనలు. మానినీమానసం, వర్షించినరాత్రి, మానవత, పరిధి, దొంగ, వెలుగును మింగిన చీకటి—ఇవి కొంచెం 'సీరియస్' రచనలు.

రచనావ్యాసంగం మొదలుపెట్టిన కొత్తలలో వెలువడిన రచన లన్నిటినీ, వివిధమైన 'ఎన్నిక' లేకుండా ఇప్పుడే సంపుటీకరించే అవసరం లేదనిపిస్తుంది. ఒక రచయిత తన రచనలను సంపుటిగా వెలువరించేముందు కొంచెం నిగ్రహం చూపడం, తన మేలిరచనలను ఎన్నిక చేయడం ముఖ్యం. ఈ కథలలో కొన్ని తప్పువాక్యాలూ, మాటల తప్పులూ దిద్దుకొని ఉండవలసింది. రచయిత మరింత ఏకాగ్రతతో, కృషి చేసిన పక్షంలో 'ఫరవాలేద'నిపించే రచనలు చేయగల రని ఈ సంపుటి సాక్ష్యం యిస్తున్నది.

—పి.

ధనయోగ ఫల ప్రదర్శనము

రచయిత—శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు. పుటలు—200. వెల రూ. 5—00. ప్రాప్తిస్థానం—(1) శ్రీ వేంకటేశ్వర జ్యోతిష గ్రంథమాల, 281, విజయనగర కాలనీ, హైదరాబాద్—28. (2) 3 వ లైను, అరండల్ పేట, గుంటూరు—2. దీనిలో (1) సమష్టి ధనయోగములు (2) ద్వాదశలగ్న ధనయోగములు (3) ధనయోగ ఫలాన్వయము అనే అధ్యాయా లున్నాయి.

తరంగిణి

ఖండకావ్య సంపుటి. రచయిత—శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి, పుటలు-105. వెల 2—25. ప్రాప్తిస్థానం—శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి, గమలపాటు, వయా దాచేపల్లి, గుంటూరుజిల్లా. దీనిలో 28 ఖండిక లున్నాయి,

రెండు నాటికలు

దీనిలో అమ్మ, కాంతదాన్ బి. ఎ. అనే రెండు నాటికలు ఉన్నాయి. రచయిత—శ్రీ పాకల వెంకట కృష్ణయ్య, పుటలు—68. వెల 1—00. ప్రాప్తిస్థానం—మిత్రమండలి, 7/334, తూర్పు వీధి, గూడూరు, నెల్లూరుజిల్లా.

శ్రీ రుక్మిణీ కల్యాణము

ద్విపదకావ్యం. రచయిత శ్రీ విష్ణుల సీతారామ స్వామి. పుటలు—40. 70 పైసలు పంపితే బుక్‌పోస్టుగా పంపుతారు. ప్రాప్తిస్థానం—శ్రీ విష్ణుల సీతారామశాస్త్రి, సంస్థాన బహుదారు సాధక పాఠశాల, బొబ్బిలి.

వ్యాస భారతి

36 చిన్నచిన్న వ్యాసాల సంపుటి. రచన—శ్రీ తేరాల సత్యనారాయణశర్మ. పుటలు—158. వెల రూ. 4—00. ప్రాప్తిస్థానం—విజయభారతి ప్రచురణలు, నల్లగొండ.

షష్టిక

పద్యకావ్యం. రచన—శ్రీ కొత్త సత్యనారాయణ చౌదురి. పుటలు — 36. వెల 0—60.

రచయిత తమ షష్టిపూర్తి సందర్భంలో చెప్పిన 60 పద్యాల గుచ్ఛం. ప్రాప్తిస్థానం - మేనేజర్, భాషాపోషక గ్రంథమండలి, వేంకటేశ్వర నగర్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

శ్రీ అవుల గోపాలకృష్ణమూర్తి స్మృతి

రచన—శ్రీ కోగంటి దుర్గామల్లికార్జున కవి. పుటలు - 24. వెల 0-50. ప్రాప్తిస్థానం—భారతీ సమితి, పామర్రు, కృష్ణాజిల్లా.

సుందరీ కాండ

స్త్రీ పాత్రలేని హాస్యనాటిక. రచన—శ్రీ కె. ఎస్. కె. వేంకటేశ్వర్లు. పుటలు—32. వెల—0-80. ప్రాప్తిస్థానం—సీతాశంకర్ పబ్లికేషన్స్, శీతారామనివాస్, 71, మునిసిపల్ కాలనీ మలక్ పేట, హైదరాబాద్-36.

శివమహిమ్న స్తోత్రం

పుష్పదంత విరచిత శివమహిమ్న స్తోత్రం తెలుగులోను, దానికి ఎదుట ఆంగ్లానువాదమూ వున్నవి. ఆంగ్లానువాదం—శ్రీ పి. కృష్ణమూర్తి. శ్రీ ఎస్. టి. జి. వరదాచార్యులు మున్నుడి, శ్రీ నిడుదవోలు వేంకటరావు పరిచయము, శ్రీ ఈయుణ్ని వేంకటవీరరాఘవాచార్యులు కపర్ది కర్ణపూరం (కొన్ని చారిత్రక విషయాల వివరణం) ఉన్నాయి. పుటలు—102. వెల—1-00. ప్రాప్తిస్థానం—శ్రీ పి. కృష్ణమూర్తి, *5677, సెయింట్ మేరీ రోడ్డు, సికింద్రాబాద్* (ఆంధ్రప్రదేశ్).

బాలకథామంజరి

ఏడు పిల్లల కథలున్న సంపుటి. రచన—జి. ఎస్. కె. సాయిబాబా. పుటలు—34. వెల—0-50. ప్రాప్తిస్థానము—కె. ఎ. ఎస్. పబ్లికేషన్స్, శాఖవీధి: అనకాపల్లి, విశాఖజిల్లా.

మహారాష్ట్రీ పెండ్లి పాటలు

సంపాదకుడు—శ్రీ పేర్వారం సంతాజీ. పుటలు—12. వెల—తెలియదు. ప్రాప్తిస్థానం—శ్రీ పేర్వారం సంతాజీ, ఖిలాషాపురం, వయా రఘునాథపల్లి, జనగామ తాలూకా.

తెలుగుదేశంలో మరాఠీలు చాలమంది వున్నారు. వీరు శతాబ్దాలక్రితం—మహారాష్ట్రమనే భాష ఏర్పడిన తర్వాత—మన దేశానికి వచ్చినవారు. వీరి భాషకు ప్రాచీనమైన పేరు ఆరె. అందువల్ల వారిని ఆరె కవులు, ఆరె మరాఠీలు అంటారు. వీరి ఆచార వ్యవహారాలు, ముఖ్యంగా వివాహాచారం తెలుసుకోడం మన సంఘ విజ్ఞానానికి తోడ్పడుతుంది. ఈ పుస్తకంలో ఒడినింపడం, పెండ్లి కొడుకును పిలవడం, దేవక్ కట్టడం, ఐరేండ్లు తేవడం, పెండ్లికి పసుపు విసరడం, వాకబలి, గొందర్ తీయడం, బోలపాడడం, భవాని ఆరతి మొత్తం పదిపాటలు వున్నాయి.

ప్రహ్లాద చరిత్రము సమీక్ష

పోతన భాగవతంలోని ప్రహ్లాద చరిత్రను సమీక్షించే బృహద్వ్యాసం. రచన — శ్రీ డి. ఎం. జేసుదాసన్. పుటలు - 24. వెల 0-50. ప్రాప్తిస్థానం—శ్రీ అలోట సామియేలు ఫాస్టరు, బాపిసీడు రోడ్డు, తెనాలి—3.

శ్రీ వేంకటేశ్వర శతకము

పద్యకావ్యం. రచన — శ్రీ అనంతాచార్యులు. పుటలు—30. వెల తెలియదు. ప్రాప్తిస్థానం—గాయత్రీ ప్రచురణలు, మహబూబునగర్, (ఆంధ్రప్రదేశ్.)

సమస్యాపూరణము

శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణ పూరించిన సమస్యల గుచ్ఛం. పుటలు—36. వెల 0-50. ప్రాప్తిస్థానం—శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణ, ఆంజనేయస్వామిగుడివద్ద, అరండల్ పేట, నరసారావుపేట, గుంటూరుజిల్లా.

పశ్చాత్తాపము

పెద్దకథ. రచన—శ్రీ తలమర్ల కళానిధి. పుటలు—20. వెల 0-30. ప్రాప్తిస్థానం — శ్రీ తలమర్ల కళానిధి, 8/170, అరవిందనగర్, అనంతపురం.

శ్రీ రామలింగేశ్వర శతకము

రచన–శ్రీ మద్దాలి శ్రీరామచంద్రమూర్తి. పుటలు–ఏబది. వెల 0–50. ప్రాప్తిస్థానం–శ్రీ మద్దాలి పేర్రాజు, కరణము, దుర్గాడ, తూర్పు గోదావరిజిల్లా.

మల్లీశ్రమకీయము

పద్యకావ్యం. రచన–డాక్టర్ బి. నరసింగ్‌ఖాన్. పుటలు–112. వెల 2–25. ప్రాప్తిస్థానం–డాక్టర్ బి. రామ్‌సింగ్, వీరరాఘవపేట, చీరాల, గుంటూరుజిల్లా.

రక్షరేఖ

ఏసుక్రీస్తు జీవితగాథ ఇతివృత్తమైన కావ్యం. రచయిత–శ్రీ బొడ్డు ప్రకాశం. పుటలు–84. వెల 1–25. ప్రాప్తిస్థానం–శ్రీ బొడ్డు ప్రకాశం, విశ్వజ్యోతి, కొబాల్డుపేట, గుంటూరు–2.

అశ్రువాహిని

నవల–ఆంగ్ల మూలం–శ్రీ కృష్ణచందర్. అనువాదం – పోలు శేషగిరిరావు. పుటలు–148. వెల సాదాప్రతి: 2–50. మేలుప్రతి: 3–50. ప్రాప్తిస్థానం – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ–2.

విద్రోహి

నవల. ఆంగ్ల మూలం – శ్రీ కృష్ణచందర్. అనువాదం–జ్ఞానేంద్ర. పుటలు–112. వెల సాదా ప్రతి: 2–00. మేలు ప్రతి: 3–00. ప్రాప్తిస్థానం – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ–2.

దొంగ డాక్టరు

పిల్లల కథలు. మూలం–శ్రీ సోమశర్మ. అనువాదం–శ్రీ వాకాటి పాండురంగారావు. పుటలు–40. వెల–1–50. ప్రాప్తిస్థానం–ఎం. శేషచలం అండ్‌కో; మచిలీపట్నం, మద్రాసు, సికిందరాబాద్.

మీ ఆరోగ్యం

పిల్లల పుస్తకం. మూలం–శ్రీ స. కు. గణపతి అయ్యర్ అనువాదం–శ్రీ వాకాటి పాండురంగ రావు. పుటలు–32. వెల 1–50. ప్రాప్తిస్థానం–ఎం. శేషచలం అండ్‌కో, మచిలీపట్నం, మద్రాసు, సికిందరాబాద్.

LUGU ACADEMY, COC

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.



అమృతాంజనం వాడి

శీఘ్రంగా నివారణ పొందండి

స్థానికంగా ఉండే బాధను నివారించుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తల నొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెంకొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతా కలిపి నెలల తరబడి వస్తుంది.

అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహ ఔషధం.



అమృతాంజన్ <u>నొప్పులు జలుబుల</u> నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు.

అమృతాంజన్ లిమిటెడ్. మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ